
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 292
'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'
గురువారం 12-1-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ప్రపంచ టీటీ చాంపియన్‌షిప్ పోటీలకు శ్రీజ అర్హత

దక్షిణాఫ్రికాలో ఈ ఏడాది మే నెలలో జరిగే ప్రతిష్టాత్మక ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలకు మహిళల సింగిల్స్ విభాగంలో జాతీయ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ, మనిక బత్రా అర్హత పొందారు. దోహాలో జరుగుతున్న ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో వీరిద్దరు ప్రిక్వార్టర్ ఫైనల్ చేరి ఈ బెర్త్‌లు ఖరారు చేసుకున్నారు. పురుషుల సింగిల్స్‌లో ఆచంట శరత్ కమల్... పురుషుల డబుల్స్‌లో శరత్ కమల్-సత్యన్.. మిక్స్‌డ్ డబుల్స్‌లో మనిక బత్రా-సత్యన్ కూడా ఈ మెగా ఈవెంట్‌కు అర్హత పొందారు.

బోపన్న, రామ్‌కుమార్ జోడీలు ఓటమి



అడిలైడ్ ఓపెన్ ఇంటర్నేషనల్-2 ఏటీపీ టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)... రామ్‌కుమార్ (భారత్)-రేయస్ వరేలా (మెక్సికో) జోడీలు ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయాయి. బుధవారం జరిగిన మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ బోపన్న-ఎబ్డెన్ 6-7 (4/7), 5-7తో నికోలస్ మహుట్ (ఫ్రాన్స్)-టిమ్ ప్యుయెట్జ్ (జర్మనీ) చేతిలో... రామ్-వరేలా 3-6, 4-6తో అరెవాలో (ఎల్ సాల్వడోర్)-రోజర్ (నెదర్లాండ్స్) చేతిలో ఓటమి పాలయ్యారు.

హైదరాబాద్ వన్డే టికెట్లన్నీ 'ఆన్‌లైన్'లోనే

- ఈ నెల 18న భారత్, కివీస్ మ్యాచ్
- 13 నుంచి 'పేటీఎం'లో టికెట్ల విక్రయం



సాక్షి, హైదరాబాద్: దాదాపు నాలుగు నెలల క్రితం హైదరాబాద్‌లో టి20 మ్యాచ్ టికెట్ల అమ్మకాల సందర్భంగా తీవ్ర రచ్చ జరిగింది. తోపులాటలు, పోలీసుల లాఠీఛార్జీతో పాటు పలువురు గాయపడి పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) పనితీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దాంతో ఈసారి హెచ్‌సీఏ ముందు జాగ్రత్తలపై దృష్టి పెట్టింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రత్యక్షంగా కౌంటర్ ద్వారా 'ఆఫ్‌లైన్' పద్ధతిలో టికెట్లు అమ్మరాదని నిర్ణయించింది. దీంతోపాటు టికెట్ల సంఖ్యపై కూడా స్పష్టతనిచ్చింది. ఈ నెల 18న ఉప్పల్ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగే తొలి వన్డే కోసం అన్ని టికెట్లనూ 'ఆన్‌లైన్' ద్వారానే అమ్ముతామని హెచ్‌సీఏ అధ్యక్షుడు మొహమ్మద్ అజహరుద్దీన్ ప్రకటించారు. 'పేటీఎం' వెబ్‌సైట్ ద్వారా టికెట్లను (ఒక్కొక్కరు గరిష్టంగా నాలుగు చొప్పున) అభిమానులు కొనుగోలు చేయవచ్చు. మ్యాచ్‌కు సంబంధించిన ఇతర వివరాలను ఆయన బుధవారం వెల్లడించారు. స్టేడియం సామర్థ్యం 39,112 కాగా... 9,695 కాంప్లిమెంటరీ టికెట్లు పోను 29,417 టికెట్లను ప్రేక్షకుల కోసం అందుబాటులో ఉంచారు. ఒకేరోజు అన్ని టికెట్లను అమ్మితే వచ్చే సమస్యలను దృష్టిలో ఉంచుకొని నాలుగు రోజుల పాటు అమ్మకానికి ఉంచుతున్నట్లు అజహర్ చెప్పారు. జనవరి 13, 14, 15, 16 తేదీల్లో సాయంత్రం 5 గంటల నుంచి ఆన్‌లైన్‌లో ఫ్యాన్స్‌కు టికెట్లు లభిస్తాయి. ఈ వన్డే కోసం కనిష్ట టికెట్ ధర రూ. 850, గరిష్ట టికెట్ ధర రూ. 20,650 (కార్పొరేట్ బాక్స్)గా ఉంది.

న్యూజిలాండ్ విజయం

కరాచీ: పాకిస్తాన్‌తో బుధవారం జరిగిన రెండో వన్డేలో న్యూజిలాండ్ 79 పరుగుల తేడాతో గెలిచి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. మొదట న్యూజిలాండ్ 49.5 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌటైంది. కాన్వే (101; 13 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ చేశాడు. విలియమ్సన్ (85; 10 ఫోర్లు) రాణించాడు. పాక్ బౌలర్లలో నవాజ్ (4/38), నసీమ్ షా (3/58) ఆకట్టుకున్నారు. 262 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ 43 ఓవర్లలో 182 పరుగులకు ఆలౌటైంది. బాబర్ ఆజమ్ (79; 8 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మూడో వన్డే శుక్రవారం జరుగుతుంది.

ఇక్కడే సిరీస్ పడతారా?

- సూపర్ ఫామ్‌లో భారత్
- తప్పక గెలవాల్సిన స్థితిలో లంక
- కోల్‌కతాలో నేడు రెండో వన్డే
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

కోల్‌కతా: ఈ ఏడాది ప్రపంచకప్ సన్నాహాన్ని ఘనంగా ప్రారంభించిన టీమిండియా ఇదే ఊపులో సిరీస్‌ను కోల్‌కతాలోనే ముగించాలనే పట్టుదలతో ఉంది. శ్రీలంకతో నేడు జరిగే రెండో వన్డేలో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. మరోవైపు సిరీస్‌లో నిలవాలంటే తప్పక గెలవాల్సిన స్థితి లంకది. టి20 సిరీస్‌లో రెండో మ్యాచ్ ద్వారా పుంజుకున్నట్లే... ఈ పోరులోనూ గెలవాలని ఆశిస్తుంది. ఈడెన్ పిచ్‌పై ఐదేళ్ల క్రితం (2017) ఆసీస్‌తో వన్డే ఆడిన భారత్ గెలిచింది. లంకతో మాత్రం ఈ వేదికపై 2014లో ఆడగా.. రోహిత్ శర్మ డబుల్ సెంచరీ (264) చేశాడు. గువహటి వన్డేలోనూ ధాటిగా ఆడిన భారత కెప్టెన్ తన జోరు కొనసాగిస్తే మాత్రం సింహళ జట్టుకు కాళరాత్రే! పైగా గిల్, కోహ్లిలతో టాపార్డర్ సూపర్ ఫామ్‌లో ఉండటం, మళ్లీ పేస్ దళం చెలరేగడం భారత బలాన్ని అమాంతం పెంచుతోంది. కోల్‌కతాలో స్పిన్నర్లకు అవకాశం ఉండటంతో చహల్, అక్షర్ కూడా ప్రభావం చూపుతారు.

సర్వశక్తులు ఒడ్డాల్సిందే!

ఇప్పుడున్న భారత్ ఫామ్‌ను చూస్తే దుర్భేద్యంగా ఉంది. ఇలాంటి జట్టును ఎదుర్కోవాలన్నా... ఓడించాలన్నా శ్రీలంక సర్వశక్తులు ఒడ్డాల్సిందే. సమష్టి బాధ్యత కనబరిస్తేనే పటిష్టమైన టీమిండియాను ఢీకొంటుంది. లేదంటే గత మ్యాచ్ ఫలితమే పునరావృతమైనా ఆశ్చర్యం లేదు. టాపార్డర్‌లో నిసాంక మాత్రమే నిలకడగా ఆడుతున్నాడు. షనక కెప్టెన్ ఇన్నింగ్స్‌తో రాణిస్తున్నాడు. వీరితో పాటు ఫెర్నాండో, కుశాల్ మెండిస్‌లు కూడా రాణిస్తేనే భారీ స్కోరు చేయగలుగుతుంది.

21 ఈడెన్ గార్డెన్స్‌లో భారత్ ఇప్పటి వరకు 21 వన్డేలు ఆడింది. 12 మ్యాచ్‌ల్లో గెలిచి, 8 మ్యాచ్‌ల్లో ఓడింది. ఒక మ్యాచ్ రద్దయింది. ఈ వేదికపై శ్రీలంకతో ఐదు మ్యాచ్‌లు ఆడిన టీమిండియా మూడింటిలో గెలిచి, ఒక మ్యాచ్‌లో ఓడింది. మరో మ్యాచ్ రద్దయింది.

పిచ్, వాతావరణం

ఈడెన్ గార్డెన్స్ బ్యాటర్లతో పాటు బౌలర్లకూ అవకాశమిస్తుంది. అయితే టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్‌కే మొగ్గుచూపుతుంది. వాన ముప్పు లేదు.





అమిన్‌గావ్ (అస్సాం): జాతీయ జట్టులో పునరాగమనం కోసం తీవ్రంగా కృషి చేస్తున్న ముంబై యువ క్రికెటర్ పృథ్వీ షా అద్భుత ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. అస్సాం జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో పృథ్వీ షా (383 బంతుల్లో 379; 49 ఫోర్లు, 4 సిక్స్‌లు) 'ట్రిపుల్ సెంచరీ' సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌తో 23 ఏళ్ల పృథ్వీ షా 89 ఏళ్ల రంజీ ట్రోఫీ చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. ఈ మెగా టోర్నీ చరిత్రలో మహారాష్ట్ర క్రికెటర్ బి.బి.నింబాల్కర్ (443 నాటౌట్; 1948లో కథియావార్ జట్టుపై) తర్వాత రెండో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన బ్యాటర్‌గా పృథ్వీ షా నిలిచాడు. అంతేకాకుండా రంజీ ట్రోఫీలో 'ట్రిపుల్ సెంచరీ'... విజయ్ హజారే వన్డే టోర్నీలో 'డబుల్ సెంచరీ'... ముస్తాక్ అలీ టి20 టోర్నీలో సెంచరీ చేసిన ఏకైక భారత క్రికెటర్‌గా పృథ్వీ షా గుర్తింపు పొందాడు. ఈ రంజీ సీజన్‌లో పృథ్వీ ఇప్పటివరకు 539 పరుగులు చేశాడు.

ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరు 240తో బ్యాటింగ్ కొనసాగించిన పృథ్వీ మరో 139 పరుగులు సాధించి రియాన్ పరాగ్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ఓవర్‌నైట్ స్కోరు 397/2తో ఆట కొనసాగించిన ముంబై ... కెప్టెన్ అజింక్య రహానే (191; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) అవుటవ్వగానే తొలి ఇన్నింగ్స్‌ను 4 వికెట్లకు 687 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అస్సాం ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ కోల్పోయి 129 పరుగులు చేసింది.

హైదరాబాద్ ఓటమి

ఇన్నింగ్స్ 57 పరుగులతో నెగ్గిన సౌరాష్ట్ర



సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు నాలుగో ఓటమి చవిచూసింది. మాజీ చాంపియన్ సౌరాష్ట్ర జట్టుతో జింఖానా మైదానంలో రెండు రోజుల్లోపే ముగిసిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 57 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ సీజన్‌లో ఐదు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న హైదరాబాద్ కేవలం ఒక్క పాయింట్‌తో ఎనిమిది జట్లున్న గ్రూప్ 'బి'లో చివరి స్థానంలో ఉంది.

అనికేత్‌కు 7 వికెట్లు

ఆట రెండో రోజు బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 250/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర మరో 77 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయి 327 పరుగుల వద్ద ఆలౌటైంది. దాంతో సౌరాష్ట్రకు 248 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. హైదరాబాద్ ఎడంచేతి వాటం స్పిన్నర్ గంగం అనికేత్ రెడ్డి 95 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. 248 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ జట్టు 46.4 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌటై పరాజయం పాలైంది. సంతోష్ గౌడ్ (58; 4 ఫోర్లు, 1 సిక్స్), చందన్ సహాని (49; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. సౌరాష్ట్ర బౌలర్లు ధర్మేంద్ర సింగ్ జడేజా (4/34), కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (3/62) హైదరాబాద్ జట్టును దెబ్బ తీశారు.

సింధుపై మారిన్‌దే పైచేయి

స్పెయిన్ ప్లేయర్ చేతిలో పదోసారి ఓడిన భారత స్టార్ షట్లర్


సింధు


మారిన్

కౌలాలంపూర్: కొత్త ఏడాదిని, కొత్త సీజన్‌ను భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఓటమితో ప్రారంభించింది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి ప్రపంచ ఏడో ర్యాంకర్ సింధు తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. చిరకాల ప్రత్యర్థి, మూడుసార్లు ప్రపంచ చాంపియన్, రియో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత కరోలినా మారిన్ (స్పెయిన్)తో బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 12-21, 21-10, 15-21తో ఓడిపోయింది. మారిన్, సింధు ఇప్పటివరకు 15 సార్లు ముఖాముఖిగా తలపడగా... మారిన్ పదిసార్లు సింధును ఓడించి, ఐదుసార్లు ఆమె చేతిలో ఓడిపోయింది. 2018 మలేసియా ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో చివరిసారి మారిన్‌పై సింధు గెలిచింది. చీలమండ గాయం కారణంగా ఐదు నెలలపాటు ఆటకు దూరంగా ఉన్న సింధు ఈ మ్యాచ్‌లో అడపాదడపా మెరిసింది. యాదృచ్ఛికంగా మూడు గేముల్లోనూ ఒక్కసారి కూడా ఇద్దరి స్కోర్లు సమంగా కాకపోవడం విశేషం. తొలి గేమ్‌లో మారిన్ పూర్తి ఆధిపత్యం చలాయించగా... రెండో గేమ్‌లో సింధు విజృంభించింది. మూడో గేమ్‌లో మళ్లీ మారిన్ పుంజుకుంది. ఆరంభంలోనే 3-0తో ఆధిక్యంలోకి వెళ్లిన మారిన్ అదే జోరును కొనసాగించి విజయాన్ని ఖరారు చేసుకుంది. మరో మ్యాచ్‌లో భారత్‌కే చెందిన మాళవిక బన్సోద్ 9-21, 13-21తో రెండో సీడ్ అన్ సె యంగ్ (కొరియా) చేతిలో ఓడిపోయింది.

పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత నంబర్‌వన్, ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్ 22-24, 21-12, 21-18తో భారత్‌కే చెందిన ప్రపంచ పదో ర్యాంకర్ లక్ష్య సేన్‌పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ 21-16, 21-13తో చోయ్ సోల్ జియు-కిమ్ వన్ హో (కొరియా) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.

సినిమా

ఆ ఊహ రాగానే ఎనర్జిటిక్‌గా దూకేశా!

\- చిరంజీవి

"దర్శకులు, రచయితలు చెప్పే కథని అందరూ వింటారు.. కానీ, నేను మాత్రం చూస్తాను. అందులో ఎమోషన్ ఎంత ఉంది? ప్రేక్షకులు సంతృప్తి చెందుతారా? లేదా అనేది విజువల్‌గా చూస్తాను. పాటలు, ఫైట్లు, డైలాగులు అనేవి అదనపు అలంకరణలు. 'వాల్తేరు వీరయ్య'లో ఎమోషన్స్‌తో పాటు ప్రతి సీన్ ఎంటర్‌టైన్ చేస్తుంది. పిల్లలు, ఫ్యామిలీతో వెళ్తే ఈ చిత్రాన్ని చాలా ఎంజాయ్ చేస్తారు" అని చిరంజీవి అన్నారు. బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. హీరో రవితేజ కీలక పాత్ర చేశారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిరంజీవి చెప్పిన విశేషాలు.



బాబీ 'వాల్తేరు వీరయ్య' కథ చెప్పినప్పుడు మిమ్మల్ని ఆకర్షించిన అంశమేంటి?

ఎమోషన్ కనెక్ట్ అయితేనే ఏ సినిమా అయినా ప్రేక్షకుల మనసులను హత్తుకుంటుంది. 'వాల్తేరు వీరయ్య' కథలో గొప్ప ఎమోషన్ ఉంది. అందుకే బాబీ కథ చెప్పగానే చేద్దామన్నాను. ఇందులోని ఎంటర్‌టైన్‌మెంట్‌ని నా గత చిత్రాలు 'ముఠా మేస్త్రీ, ఘరానా మొగుడు, అన్నయ్య'లో ఫస్ట్ హాఫ్ క్యారెక్టరైజేషన్‌తో పోల్చుకోవచ్చు.

మీ అభిమానిగా బాబీ మిమ్మల్ని తెరపై ఎలా చూపించనున్నారు?

నేను కంటెంట్‌ని బలంగా నమ్ముతాను.. బాబీ కూడా నాలాగే కథని నమ్ముతాడు. అందుకే మా ఇద్దరికీ కుదిరింది. ఏదైనా సీన్ కాస్త తగ్గినట్లు అనిపించినా వెంటనే మరో చక్కని సన్నివేశం రాసి, తీసేవాడు. నా అభిమానిగా కంటే ఓ డైరెక్టర్‌గా బాబీ ఎక్కువ మార్కులు సంపాదించాడు.

'బాబీకి నేను ఫ్యాన్ అయ్యాను' అని మీరు అనడానికి కారణం?

అతని హార్డ్ వర్క్‌కి ఫ్యాన్ అయ్యా. 'వాల్తేరు వీరయ్య' చేస్తున్నప్పుడు వాళ్ల నాన్నగారు చనిపోయారు. మామూలుగా 11 రోజుల పెద్ద ఖర్మ వరకూ తను ఉండాలి. కానీ, మూడో రోజు చిన్న ఖర్మ అయిన వెంటనే వచ్చి పని చేశాడు. 'మీతో పని చేస్తుంటే నాన్న లేని లోటు ఉండదు సార్' అన్నాడు. తన అంకితభావానికి హ్యాట్సాఫ్.. అందుకే నేను తనకు అభిమాని అయ్యాను.

ఈ సినిమాలో వింటేజ్ వైబ్ కనిపిస్తోంది. షూటింగ్ టైమ్‌లో మీక్కూడా యంగ్ ఏజ్ వైబ్ వచ్చిందా?

నాకు అన్ని రకాల వైవిధ్యమైన పాత్రలు చేయాలని ఉంది. 'శుభలేఖ, స్వయంకృషి, మంత్రిగారి వియ్యంకుడు' వంటి చిత్రాలు ఆ తాపత్రయం నుండి వచ్చినవే. రాను రాను ఆర్థికంగా, కమర్షియల్‌గా ముడిపడిన చిత్ర పరిశ్రమలో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్ శ్రేయస్సుని దృష్టిలో పెట్టుకొని మనకి ఏం కావాలనే దానికంటే ప్రేక్షకులు మన నుండి ఏం కోరుకుంటున్నారో ఇవ్వడానికే మొదటి ప్రాధాన్యత ఇచ్చాను. రీ ఎంట్రీలో కూడా ఫ్రీడమ్ ఫైటర్‌గా 'సైరా', పాటలు, హీరోయిన్ లేకుండా 'గాడ్ ఫాదర్' చేశాను.. ఈ సినిమాలు గౌరవప్రదమైన హిట్లందుకున్నాయి. అయితే ప్రేక్షకులు, అభిమానులు నన్ను కమర్షియల్ సినిమాల్లో చూడటానికే ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అది వందకి వంద శాతం ఇవ్వాలనే 'వాల్తేరు వీరయ్య' చేశాను. ఈ చిత్రం మరోసారి వింటేజ్ చిరంజీవిని గుర్తు చేస్తుంది.

ఇన్నేళ్లయినా ఏ అంశం మీలో తపన పెంచుతోంది?

కేవలం ప్రేక్షకుల ఆదరణే.. వాళ్లు ఆదరిస్తున్నారు కాబట్టే చేయగలుగుతున్నాను. 'బావగారూ బాగున్నారా'లో నేను చేసిన బంగీ జంప్‌ని ప్రేక్షకులు చూసి.. 'వాట్ ఏ ఫీట్' అని క్లాప్స్ కొడతారని ఊహించుకున్నాను. ఆ ఊహ రాగానే ఎక్కడ లేని ఎనర్జీ వచ్చింది.. రిలాక్స్‌గా దూకాను. అయితే ఫైట్స్, డ్యాన్స్.. అంటూ ఒళ్లు హూనం చేసుకోవడం కంటే 'దృశ్యం'లో వెంకటేశ్‌లా, 'విక్రమ్' సినిమాలో కమల్ హాసన్‌లా చేయాలనుంది.. (నవ్వుతూ).

సంక్రాంతి రేసులో ఎప్పుడూ మీ సినిమా ముందు వస్తుంది.. కానీ ఈసారి వెనక్కి తగ్గారు?

మైత్రీ మూవీస్ నుండే రెండు చిత్రాలు (వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి) సంక్రాంతికి వస్తున్నాయని హ్యాపీ ఫీలయ్యాను. పండగ టైమ్‌లో ఎన్ని సినిమాలకైనా చోటు ఉంటుంది. ఒక రోజు గ్యాప్ ఇస్తే ఏ సినిమా రెవెన్యూ ఆ సినిమాకే ఉంటుంది. అందుకే నేనే ఒకరోజు వెనక్కి జరుగుతానని చెప్పాను. ఫస్ట్ డే రికార్డ్ కోసం తాపత్రయపడేవారికి మా రెవెన్యూ తగ్గుతుందనే ఫీలింగ్ ఉంటుంది. రావాల్సిన షేర్ వస్తుందనే నమ్మకం ఉంటే ఎప్పుడు ఎలా రిలీజ్ చేసినా నిలబడుతుంది.

ఎన్నో ప్రతిష్ఠాత్మక బ్యానర్లలో, ఎంతో మంది నిర్మాతలతో పని చేశారు. మైత్రీ మూవీ మేకర్స్‌లో సినిమా చేయడం ఎలా అనిపించింది?

మైత్రీ మూవీ మేకర్స్ లాంటి నిర్మాతలు చాలా అరుదుగా ఉంటారు. ఖర్చుకు వెనకాడకుండా ప్యాషన్‌తో సినిమాలు చేస్తున్నారు. 'ఖర్చు విషయంలో జాగ్రత్త. మీలాంటి నిర్మాతలు ఇండస్ట్రీకి కావాలి' అని నేనే వాళ్లకి చెబుతుంటాను. షూటింగ్‌లో ఒక రోజుకి నలభై లక్షల రూపాయిలు కూడా ఖర్చు అయ్యేది. చిత్రీకరణ టైమ్‌లో ఎక్కడా వృథా కాకూడదని బాబీకి కూడా చెప్పాను.. తను కూడా వృథా కాకుండా చేశాడు.. దాంతో నిర్మాతలకు కలిసొచ్చింది. నిర్మాతల బాగోగులు చూడాల్సిన బాధ్యత దర్శకులపైనా ఉంది.

సినిమాల్లో రిటైర్‌మెంట్ గురించి మీరు చేసిన కామెంట్స్ హాట్ టాపిక్ అవడంపై..?

కెరీర్ మొదట్లో ప్రతి నటుడికి ఒక ఆకలి ఉంటుంది. మనల్ని మనం తెరపై చూసుకోవాలని, మంచి పేరు తెచ్చుకోవాలనే స్పిరిట్ ఉంటుంది. ఆ కసి, స్పిరిట్ కొంతకాలం తర్వాత ఎందుకు ఉండకూడదు? అమితాబ్ బచ్చన్‌గారు ఇప్పటికీ హార్డ్ వర్క్ చేస్తారు. ఇక్కడ ఎప్పుడూ ఆర్టిస్ట్‌కలితో ఉండాలి. కడుపు నిండినట్లు ఉంటే అనుకున్నది డెలివర్ చేయలేమని చెప్పడమే నా మాటల ఉద్దేశం.

నటీనటుల క్రమశిక్షణ గురించి మీ అభిప్రాయం?

క్రమశిక్షణ, సమయ పాలన వల్లే నా కెరీర్ ప్రారంభంలో వరుస అవకాశాలు అందిపుచ్చుకున్నా. మనం ఫామ్‌లో ఉన్నప్పుడు దాని విలువ తెలియదు.. కానీ అపజయాలు వచ్చినప్పుడు తెలుస్తుంది. క్రమశిక్షణ, సమయ పాలన అనేది లేకపోతే మనకి అవకాశాలు ఇచ్చేవారు కూడా ఉండరు.

'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు..' పాటకు గోల్డెన్ గ్లోబ్ అవార్డు దక్కడం ఆనందంగా ఉంది. దేశం గర్వించే చారిత్రక విజయం ఇది. 'ఆర్ఆర్ఆర్' చిత్రబృందానికి నా అభినందనలు.

'అన్నయ్య'(2000)లో రవితేజ మీ తమ్ముడిగా నటించారు. ఇరవై ఏళ్ల తర్వాత 'వాల్తేరు వీరయ్య'లో చేశారు. ఆయనలో అప్పటికీ ఇప్పటికీ మీరు గమనించిన తేడా?

రవితేజ అప్పుడు ఎలా ఉన్నాడో ఇప్పుడూ అలాగే ఉన్నాడు. స్టార్ ఇమేజ్ వచ్చిన తర్వాత తనలో వచ్చిన మార్పులేవీ లేవు. అదే ప్రేమ, అదే ఉత్సాహం, అదే ఎనర్జీతో ఉన్నాడు. 'వాల్తేరు వీరయ్య'లో రవితేజ పాత్ర కథకు మరింత బలం చేకూరుస్తుంది.

ఈ చిత్రంలో మీ డైలాగ్ రవితేజ, ఆయన డైలాగ్ మీరు మార్చుకున్నట్టున్నారు?

మా ఇద్దరి అభిమానిగా బాబీకి వచ్చిన ఆలోచన అది. నన్ను ఇష్టపడే రవితేజకి నా డైలాగ్ చెప్పడం తనకి ఫ్యాన్ బాయ్ మూమెంట్. అలాగే నా తమ్ముడిలాంటి రవితేజ డైలాగ్‌ని నేను చెప్ప డం సరదాగా అనిపించింది.. ఈ డైలాగ్స్‌ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు.

శ్రుతీహాసన్‌తో వర్క్, డ్యాన్స్ చేయడం గురించి?

నా ఫ్రెండ్, లెజెండ్ కమల్‌గారి కూతురు శ్రుతి. తన డీఎన్‌ఏలోనే డ్యాన్స్ ఉంది. అవలీలగా డ్యాన్స్ చేస్తుంది. హార్డ్‌వర్క్ చేసింది.

దేవిశ్రీప్రసాద్ మ్యూజిక్ గురించి..

దేవిశ్రీ డబుల్ ఎనర్జిటిక్‌గా ఉంటాడు. ఇందులోని పాటలన్నీ ఇష్టం. అయితే 'నీకేమో అందం ఎక్కువ.. నాకేమో సిగ్గెక్కువ..' పాట నా ఫేవరెట్.

తెలుగులో కథల కొరత ఉందా?

లేదు.. మంచి ప్రతిభ ఉన్న యువ దర్శక, రచయితలు వస్తున్నారు. 'అర్జున్ రెడ్డి, ఉప్పెన, జాతిరత్నాలు, పెళ్ళి చూపులు' వంటి సినిమాలన్నీ మంచి కంటెంట్ ఉన్న కథలే.

రీమేక్ సినిమాలు చేయడం రిస్కా?

అలాంటిదేం లేదు. ఒక రీమేక్ కథతో సినిమా చేస్తున్నపుడు అందులో మన హీరో ఎలా ఉంటాడనే క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో ఉంటుంది. మలయాళ హిట్ ఫిల్మ్ 'లూసిఫర్'లో కొన్ని మంచి మార్పులు చేసి 'గాడ్‌ఫాదర్' చేశాం. ఆ సినిమా మాతృక చూసినవ్వటికీ 'గాడ్ ఫాదర్'ని కూడా ప్రేక్షకులు హిట్ చేశారు.. ఇప్పుడు తమిళ హిట్ మూవీ 'వేదాలం' రీమేక్ చేస్తున్నాను.

దర్శకత్వం ఆలోచనలున్నాయా?

చివరి శ్వాస వరకూ సినిమాతో మమేకం అవ్వాలనే ఉంది. సినిమాకి సంబంధించిన ఏ విభాగం అయినా ఓకే. దర్శకత్వం చేయగలననే నమ్మకం కలిగినప్పుడు చేస్తాను.

'చిరంజీవికి మరీ అతి మంచితనం పనికిరాదు' అనే అభిప్రాయంపై ఏమంటారు?

కొందరు ఓ మాట అంటారు.. అనిపించుకుంటారు. కానీ, నేనలా కాదు. నన్ను అన్నారని నేను కూడా అంటే నాకూ, వాళ్లకి తేడా ఏముంటుంది? నేను ఏదైనా మంచి ముగింపు గురించి ఆలోచిస్తాను.. అందుకే సంయమనం పాటిస్తాను. అది ఎంతోమందికి ఆనందం ఇస్తుంది.

దాసరి నారాయణరావుగారి తర్వాత ఇండస్ట్రీలో పెద్ద దిక్కు మీరే అంటున్నారు.. కానీ ఆ బాధ్యతని మీరెందుకు వద్దంటున్నారు?

ఇండస్ట్రీకి ఎలాంటి సమస్య వచ్చినా స్పందిస్తాను.. అందుకు బాధ్యత అవసరం లేదు. చిత్ర పరిశ్రమకి భుజం కాయడం నాకు ఇష్టం.. అంతే కానీ, ఆ భుజం కీర్తి తీసుకోవడం ఇష్టం ఉండదు.

'వాల్తేరు వీరయ్య' సినిమా టిక్కెట్ ధర పెంచుకునే వెసులుబాటు కల్పించిన ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ ప్రభుత్వాలకు కృతజ్ఞతలు.

నాటు నాటుకు డ్యాన్స్ చేశా!

\- షారుక్ ఖాన్



షారుక్ ఖాన్, దీపికా పదుకోన్ జంటగా నటించిన చిత్రం 'పఠాన్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిలింస్ నిర్మించిన ఈ హిందీ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. కాగా ఈ చిత్రం తెలుగు ట్రైలర్‌ను సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు హీరో రామ్‌చరణ్. ఈ సందర్భంగా ట్విట్టర్‌లో తనదైన స్టైల్‌లో రామ్ చరణ్‌కి కృతజ్ఞతలు చెప్పారు షారుక్ ఖాన్. ''థ్యాంక్యూ సో మచ్. నా మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్. మీ 'ఆర్ఆర్ఆర్' టీమ్ ఆస్కార్ అవార్డును ఇండియాకు తీసుకొచ్చినప్పుడు దయచేసి నన్ను తాకనివ్వండి.. లవ్యూ'' అని ట్వీట్ చేశారు షారుక్. ''తప్పకుండా ఎస్ఆర్‌కే సార్. ఈ అవార్డు ఇండియన్ సినిమాకు చెందింది'' అని పోస్ట్ చేశారు చరణ్. కాగా 'నాటు నాటు..' పాటకు గోల్డెన్ గ్లోబ్ అవార్డు లభించడం పట్ల షారుక్ ఖాన్ హర్షం వ్యక్తం చేశారు. ఉదయం వార్త తెలిసిన వెంటనే 'నాటు నాటు..' పాటకు డ్యాన్స్ చేశానని ట్విట్టర్‌లో వెల్లడించారు. భారత్‌ను గర్వపడేలా చేశారని ప్రశంసించారు.


చిన్న సినిమా నిర్మాతలను ప్రోత్సహించాలి

\- నక్కిన త్రినాధరావు


త్రినాథరావు, రూప

''చిన్న చిత్రాలు తీసే నిర్మాతలను ప్రోత్సహించాలి. ఎందుకంటే వారు తీసిన చిత్రాలు మినిమమ్ సక్సెస్ అయినా కొత్త సినిమాలు చేస్తూనే ఉంటారు'' అని డైరెక్టర్ నక్కిన త్రినాధరావు అన్నారు. మనీష్, మధునందన్ హీరోలుగా, లావణ్య, అక్సా ఖాన్, అలివియా ముఖర్జీ హీరోయిన్లుగా శివ బాబు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'క్షణం ఒక యుగం'. రూప నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నక్కిన త్రినాధరావు విడుదల చేసి, ''కొత్తవారిని ప్రోత్సహిస్తున్న నిర్మాత రూపగారికి ఈ సినిమా పెద్ద సక్సెస్ ఇవ్వాలి'' అన్నారు. ''నటీనటులు, సాంకేతిక నిపుణులు ఫుల్ సపోర్ట్ చేయడంతో మా సినిమా బాగా వచ్చింది'' అన్నారు రూప. ''మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న మా చిత్రం అందరికీ నచ్చుతుంది'' అన్నారు శివ బాబు.

యాక్షన్ ఎంటర్‌టైనర్


జీఎస్ఎన్ నాయుడు

జీఎస్ఎన్ నాయుడు ప్రధాన పాత్రలో ప్రమోద్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'యుగల్'. 'ది మాన్ విత్ డైవర్షన్' అనేది ట్యాగ్ లైన్. శ్రీలక్ష్మి గణపతి సుబ్రమణ్య స్వామి ప్రొడక్షన్స్ పతాకంపై ఆర్. బాలాజీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. జీఎస్ఎన్ నాయుడు మాట్లాడుతూ– ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ఈ మూవీకి తొలుత 'గన్ని' అనే టైటిల్ అనుకున్నాం. కానీ, ఆ టైటిల్ వేరేవాళ్లు రిజిస్టర్ చేయించడంతో 'యుగల్' ఖరారు చేశాం'' అన్నారు. ''మా చిత్రాన్ని సెప్టెంబర్ 2న విడుదల చేస్తున్నాం'' అన్నారు ప్రమోద్ కుమార్. కెమెరామేన్ ప్రేమ్ శై విన్సన్ట్, ప్రొడ్యూసర్ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50 సంపుటి: 15 సంచిక: 282

గురువారం 12-1-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'



భారత్ వేగుచుక్క..

భారత్.. పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యంగా మారిందన్న మోదీ -6లో



కొత్త వాహనాల సందడి

గ్రేటర్ నోయిడాలో 'ఆటో ఎక్స్‌పో 2023' బుధవారం ప్రారంభమైంది. -13లో



చిక్కుల్లో బైడెన్

అమెరికా అధ్యక్షుడు కార్యాలయంలో రహస్య పత్రాలు బయటపడ్డ ఉదంతం చినికి చినికి గాలివానగా మారుతోంది.

వివరాలు 6లో ▸



ఐక్యత, సౌభ్రాతృత్వాలే...

మన దేశం ఐక్యతకు, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని.. అందుకే భారత్ జోడో యాత్ర విజయవంతమైందని రాహుల్ అన్నారు.

వివరాలు 6లో ▸



లక్షద్వీప్ ఎంపీకి పదేళ్ల ఖైదు

హత్యాయత్నం కేసులో లక్షద్వీప్ ఎంపీ మహమ్మద్ ఫైజల్ సహా నలుగురికి జిల్లా కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది.

వివరాలు 6లో ▸



ముగ్గురు జవాన్లు మృతి

కశ్మీర్‌లో కుప్వారా జిల్లాలోని ఎల్‌వోసీ వద్ద విధుల్లో ఉన్న ముగ్గురు సైనికులు ప్రమాదవశాత్తూ లోయలో పడి మృతిచెందారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

బియ్యం పంపిణీ షురూ



ఈనెల బియ్యం పంపిణీని చౌకధరల దుకాణాల ద్వారా బుధవారం నుంచి ప్రారంభించినట్లు మంత్రి గంగుల తెలిపారు. ఏప్రిల్ నుంచి కార్డుదారులకు యథాతథంగా తలసరి ఆరు కిలోల చొప్పున పంపిణీ చేస్తామని వెల్లడించారు.

- వివరాలు 5లో ▶

జిల్లాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



హైదరాబాద్‌లోనే కాకుండా జిల్లాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మహిళా పారిశ్రామికవేత్తలకు అవార్డులు ప్రదానం చేశారు.

- వివరాలు 12లో ▶

నా'రాబంధువులే'!



అసైన్డ్ భూముల్లో వాలిన భూ రాబందుల అక్రమాలు బహిర్గతమయ్యాయి. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2014- 18 మధ్య చోటు చేసుకున్న ఈ దారుణాలు సీఐడీ దర్యాప్తులో ఆధార సహితంగా, రియల్ ఎస్టేట్ అక్రమ సామ్రాజ్యం భౌగోళిక సరిహద్దులతో సహా వెలుగు చూశాయి.

- వివరాలు 10లో ▶



తెలుగు 'నాటు' గ్లోబల్ హిట్టు

ప్రతి భారతీయుడిని గర్వించేలా చేసింది: ప్రధాని మోదీ ట్వీట్

- తెలుగు పాటకు అరుదైన గౌరవం
- బెస్ట్ ఒరిజినల్ సాంగ్– మోషన్ పిక్చర్ కేటగిరీలో అవార్డు - వివరాలు 11లో ▶



తెలుగు పాట దుమ్మురేపింది.. 'నా పాట సూడు..' అంటూ 'గోల్డెన్ గ్లోబ్'ను ముద్దాడింది. ఎంఎం కీరవాణి స్వరపర్చిన 'ఆర్‌ఆర్‌ఆర్' లోని 'నాటు నాటు' పాటకు బెస్ట్ ఒరిజినల్ సాంగ్-మోషన్ పిక్చర్ కేటగిరీలో ప్రతిష్టాత్మక గోల్డెన్ గ్లోబ్ అవార్డు లభించింది. భారత్ నుంచి ఒక పాటకు ఈ అవార్డు లభించడం ఇదే మొదటిసారి. 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం 'బెస్ట్ పిక్చర్-నాన్ ఇంగ్లిష్' కేటగిరీలోనూ నామినేట్‌ైనా.. చివరకు అవార్డు మాత్రం అర్జెంటీనా చారిత్రక చిత్రం 'అర్జెంటీనా 1985'కు దక్కింది.



"

ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి కృషిచేస్తా

- మీడియాతో సీఎస్

నాపై ఎంతో నమ్మకంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా అవకాశం ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. సీఎం నాపై ఉంచిన ఈ నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్ర అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తా. సీఎం చేపట్టిన ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలతోపాటు అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సహచర అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో విజయవంతంగా అమలు చేయడానికి కృషిచేస్తా.



ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న సీఎస్ శాంతికుమారి

తొలి మహిళా సీఎస్

తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా శాంతికుమారి

సీఎం ఆదేశాలతో ఉత్తర్వులు

- ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన శాంతికుమారి..
- సచివాలయంలో బాధ్యతల స్వీకారం
- గతంలో మెదక్ కలెక్టర్‌గా, సీఎంఓ ముఖ్య కార్యదర్శిగా విధులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా 1989 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఎ.శాంతికుమారి నియమితులయ్యారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఆమెను సీఎస్‌గా నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి వి.శేషాద్రి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె తెలంగాణ రాష్ట్ర తొలి మహిళా సీఎస్‌గా చరిత్రకెక్కారు. గత సీఎస్ సోమేశ్ కుమార్‌ను ఏపీ కేడర్‌కు వెళ్లాలని ఆదేశిస్తూ మంగళవారం రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో కొత్త సీఎస్ నియామకం అనివార్యంగా మారిన విషయం తెలిసిందే. సీఎస్ రేసులో ఆర్థిక, పురపాలక, అటవీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, అరవింద్ కుమార్, శాంతికుమారిల పేర్లు ప్రముఖంగా వినిపించగా, శాంతికుమారి వైపు సీఎం కేసీఆర్ మొగ్గు చూపారు. సీఎస్‌గా నియామకం జరిగిన వెంటనే ఆమె ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్‌తో సమావేశం తర్వాత శాంతికుమారి బీఆర్‌కేఆర్ భవన్‌లోని రాష్ట్ర సచివాలయం చేరుకుని సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించారు.

కేసీఆర్‌తో కలిసి పనిచేసిన శాంతికుమారి

శాంతికుమారి 1999 నవంబర్ నుంచి 2001 జూన్ వరకు మెదక్ జిల్లా కలెక్టర్‌గా పనిచేయగా, అప్పట్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించిన కేసీఆర్

మిగతా 2వ పేజీలో ▶

కాపు సంఘాల హర్షం

- కేసీఆర్‌తో జనసేన నలహాదారు రామ్మోహన్‌రావు భేటీ
- సీఎం నిర్ణయం సముచితం: వద్దిరాజు

2లో

సంక్రాంతి కానుకగా వందే భారత్



15న సికింద్రాబాద్-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం

- ఢిల్లీ నుంచి వర్చువల్‌గా పచ్చజెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- సికింద్రాబాద్‌లో హాజరుకానున్న కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్‌రెడ్డి
- 19న ప్రధాని పర్యటన వాయిదా నేపథ్యంలో ఈ కార్యక్రమం ముందుకు

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు ప్రజలకు సంక్రాంతి కానుకగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర ప్రభుత్వం అందించనుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 8వ వందేభారత్ రైలును జనవరి 15న ఉదయం 10.00 గంటలకు ఢిల్లీ నుంచి వర్చువల్ వేదికగా పచ్చజెండా ఊపి ప్రారంభించనున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి విశాఖపట్నం మధ్య సుమారు 8 గంటల్లో నడిచే ఈ రైలు ప్రారంభోత్సవ కార్యక్రమం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 10వ నంబర్ ప్లాట్‌ఫాం వద్ద జరుగనుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి హాజరుకానున్నారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రిల్లో ఆగనుంది. వాస్తవానికి వందేభారత్ రైలుకు

మిగతా 2వ పేజీలో ▶

విద్యుత్ వెలుగుల్లో మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయం



నేడు మానుకోటకు కేసీఆర్

బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం, నూతన కలెక్టరేట్ ప్రారంభం

- 10వేల మంది అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో సమావేశం
- మహబూబాబాద్ నుంచి నేరుగా భద్రాద్రి కొత్తగూడెం వెళ్లనున్న సీఎం
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్

12లో

యాదాద్రి నుంచి ఖమ్మం సభకు..

కేసీఆర్, ముగ్గురు సీఎంలు, ప్రముఖుల పర్యటన షెడ్యూల్ ఖరారు

12లో

తుమ్మలతో మంత్రులు హరీశ్, పువ్వాడ భేటీ

బడి 'వణికిపోతోంది'!

రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత పెరిగి విద్యార్థులు వణికిపోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గత నాలుగు రోజులుగా విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా తగ్గినట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి. హాజరయ్యే విద్యార్థులు కూడా ఏదో ఒక సీజనల్ వ్యాధితో బాధపడుతున్నారని ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి.

- వివరాలు 2లో ▶

ఇదం జగత్



విమాన ప్రయాణం చేసే పల్లెటూరట ఏంటండీ!

ఫ్లెక్సీల్లో ఫొటోలు కాదు.. ఇంటింటికీ వెళ్లాలి!

కమలం గుర్తును ప్రచారం చేయాలి

- బీజేపీ నేతలకు రాష్ట్ర సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్ దిశానిర్దేశం.. పార్టీ ఎవరికి దండ వేస్తే వారే నాయకులు
- సీనియర్లు రాకపోతే మండలాధ్యక్షులే కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశం
- పార్టీ సంస్థాగతంగా బలోపేతం కావడమే లక్ష్యమని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ''గోడల మీద నేతల పేర్లు, ఫ్లెక్సీల్లో ఫొటోలు కాదు.. కమలం గుర్తును ఇంటింటికీ తీసుకెళ్లాలి. బీజేపీ ఎన్నికల గుర్తును ప్రజల్లో ప్రచారం చేయాలి. సొంతంగా దండలు, పార్టీ కండువాలు వేసుకుని వచ్చేవారు నాయకులు కాదు. పార్టీ ఎవరికి దండ వేస్తుందో వారే లీడర్లు..'' అని బీజేపీ నేతలకు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్ స్పష్టం చేశారు. ఎవరో పెద్ద నాయకుడో, ఎంపీనో, ఎమ్మెల్యేనో వస్తారని వేచి చూడకుండా.. షెడ్యూల్ ప్రకారం మండల అధ్యక్షులే పార్టీ కార్యక్రమాల నిర్వహణలో ముందుకు వెళ్లాలని సూచించారు. అసెంబ్లీ కేంద్రంగా కాకుండా మండలాలు కేంద్రంగా పార్టీ కార్యక్రమాలను ఉధృతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో 'ప్రజా గోస-బీజేపీ భరోసా' బైక్‌ర్యాలీలు సాగిన తీరుతోపాటు మేడ్చల్ జిల్లాలో మల్కాజిగిరి లోక్‌సభ స్థానంపై సునీల్ బన్సల్ బుధవారం సమీక్షించారు. దీనితోపాటు రాష్ట్రంలోని 17 లోక్‌సభ సీట్లకు నియమితులైన

మిగతా 12వ పేజీలో ▶

ఎన్ని గెలుస్తాం.. ఎలా అధికారంలోకి వస్తాం?

కాంగ్రెస్ నేతలకు ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ప్రశ్నల వర్షం

- ఉప ఎన్నికల్లో ఓట్లెందుకు తగ్గుతున్నాయి?
- పార్టీలో అంతర్గత సమస్యలు, విభేదాలు ఏమిటి?
- 60 సీట్లు గెలవాలంటే ఏం చేయాలో చెప్పండి
- మాట్లాడుతూ.. మాట్లాడిస్తూ.. అన్ని అంశాలపై ఆరా
- బలంగానే ఉన్నా సరైనదిశలో వెళ్లలేకపోతున్నామన్న నేతలు
- పీసీసీ చీఫ్ రేవంత్, సీఎల్పీ నేత భట్టితోపాటు సీనియర్లతో విడివిడిగా మాణిక్‌రావ్ భేటీ.. నేడు కూడా సమావేశాలు



మాణిక్‌రావ్‌కు స్వాగతం పలుకుతున్న రేవంత్, భట్టి

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో ఏం జరుగుతోంది? గతం కంటే బలపడుతున్నామా? బలహీనపడుతున్నామా? మనకు గతంలో వచ్చిన 26–28 శాతం ఓట్లు 40 శాతానికి చేరాలంటే ఏం చేయాలి? ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 119 స్థానాల్లో ఎన్నిచోట్ల మనం గెలుస్తాం? 60 సీట్లు సాధించి అధికారంలోకి వచ్చేందుకు మీ దగ్గర ఉన్న ప్రణాళిక ఏమిటి? పార్టీలో అంతర్గత సమస్యలేంటి? ఎందుకీ విభేదాలు..?''.. రాష్ట్ర కాంగ్రెస్ నూతన ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ఇక్కడి నేతల నుంచి లోతుగా ఆరా తీస్తున్న అంశాలివి. వీటితోపాటు రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీల పరిస్థితి ఏమిటి, వాటి విషయంలో ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపైనా ఆయన సమాచారం సేకరిస్తున్నారు. రాష్ట్ర ఇన్‌చార్జిగా

మిగతా 12వ పేజీలో ▶

బుధవారం ఉదయం నెవార్క్ లిబర్టీ విమానాశ్రయంలో నిలిచిపోయిన విమానాలు



అమెరికాలో విమాన సేవలకు అంతరాయం


3,700 విమానాల ఆలస్యం.. 600 సర్వీసులు రద్దు సాంకేతిక లోపం వల్లే..

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికాలో బుధవారం ఉదయం నుంచి విమాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఫ్లైట్ ట్రాకింగ్ కంపెనీ ఫ్లైట్ అవేర్ సమాచారం ప్రకారం.. అమెరికాలో, వెలుపల 3,700కు పైగా విమానాలు ఆలస్యంగా నడిచాయి. 600కు పైగా విమానాల రాకపోకలను రద్దు చేశారు. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) వ్యవస్థలో సాంకేతిక సమస్య తలెత్తడమే ఇందుకు కారణం. విమానాలు తిరిగే మార్గాల్లో మార్పులు చేర్పులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ప్రమాదాల గురించి విమాన సిబ్బందిని అప్రమత్తం చేయడానికి ఎఫ్ఏఏ వ్యవస్థ పని చేస్తోంది. నోటమ్(నోటీస్ టు ఎయిర్ మిషన్స్ సిస్టమ్)లో సాంకేతిక సమస్య తలెత్తిందని ఎఫ్ఏఏ వెల్లడించింది. సమస్యను పరిష్కరించి, సేవలను పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. వందలాది విమానాలు ఎయిర్‌పోర్టుల్లోనే నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల తరబడి పడిగాపులు గాస్తున్నామని, అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఎఫ్ఏఏ వ్యవస్థలో సాంకేతిక లోపం గురించి అమెరికా ట్రాన్స్‌పోర్టేషన్ సెక్రెటరీ పెటీ బుటీగిగ్ అధ్యక్షుడు జో బైడెన్‌కు తెలియజేశారు. సాధారణ విమాన సేవలు క్రమంగా పునఃప్రారంభమవుతున్నాయని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ట్విట్టర్‌లో వెల్లడించింది.

మాస్టర్‌ప్లాన్‌పై రైతన్న కన్నెర్ర

- కామారెడ్డి, జగిత్యాల మున్సిపల్ కార్యాలయాల ఎదుట ఆందోళన
- మాస్టర్‌ప్లాన్ రద్దుకు డిమాండ్

- వివరాలు 5లో ▶



'గ్రూప్-1' ఫలితాలకు గ్రీన్‌సిగ్నల్

- టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమ్స్ ఫలితాల విడుదలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఒక అభ్యర్థి స్థానికత వివాదం నేపథ్యంలో ఫలితాలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒక్క అభ్యర్థి కారణంగా పూర్తిగా ఫలితాలనే నిలిపివేయడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత వ్యవహారంపై తర్వాత తుది ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేస్తూ విచారణను వాయిదా వేసింది.

- వివరాలు 2లో ▶

క్లుప్తంగా...

ఎస్టీ రిజర్వేషన్ల పెంపుపై సుప్రీంకోర్టులో పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఎస్టీ రిజర్వేషన్లను పెంచుతూ జారీ అయిన జీవో నెంబర్ 33పై స్టే విధించాలని సుప్రీంకోర్టులో నాలుగు పిటిషన్లు దాఖలయ్యాయి. ఎస్టీ రిజర్వేషన్ల పెంపును వ్యతిరేకిస్తూ ఆధార్ సొసైటీ, ఆదివాసీ (గిరిజన) ఉద్యోగుల అసోసియేషన్, ఆదిమ ఆదివాసుల సంక్షేమ హక్కుల పరిరక్షణ సంఘం, కోడెపాక రోహిత్‌లు బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అల్లంకి రమేశ్ ఈ నాలుగు పిటిషన్లు దాఖలు చేశారు. బంజారా, లంబాడ, సుగాలీలను ఎస్టీలో చేర్చవద్దని గతంలో తాను వేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండగానే, రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపుపై జీవో తీసుకురావడాన్ని తప్పుబడుతూ పిటిషన్‌లో సవాల్ చేశారు. ఈ జీవో కారణంగా ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన బంజారా, లంబాడ, సుగాలీలకు లబ్ధి చేకూరుతుందని పిటిషన్‌లో వివరించారు. ఈ కారణంగా తెలంగాణలోని అసలైన ఎస్టీలకు నష్టం జరుగుతుందని.. రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు తీర్పును జీవో నెంబర్ 33 ఉల్లంఘించిందని పేర్కొన్నారు.

గ్రూప్–2 శిక్షణకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–2కు సన్నద్ధమవుతున్న బీసీ అభ్యర్థులకు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ కె.అలోక్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వెంటనే బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 23వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. వివరాలకు బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ లేదా 040–27077929, 7780359322 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

జేఈఈ అర్హతలో మార్పులు

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్ అర్హత నిబంధనల్లో స్వల్ప మార్పులు చేశారు. ఈ విషయాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. జేఈఈ పరీక్ష రాసిన అభ్యర్థులు ఐఐటీలు, ఎన్‌ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో ప్రవేశాలు పొందేప్పుడు ఇంటర్‌లో 75 శాతం మార్కులు పొంది ఉండాలని ఎన్‌టీఏ తొలుత పేర్కొంది. దీనివల్ల ఈశాన్య రాష్ట్రాలతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో వివాదం చెలరేగింది. ఆయా రాష్ట్రాల్లో ఇంటర్, 10 ప్లస్‌టులో గరిష్టంగా 60 శాతం పర్సంటైల్ మాత్రమే వస్తోంది. దీంతో కొంతమంది కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఇంటర్, ప్లస్ టులోని సబ్జెక్టుల్లో 75 మార్కులు లేదా టాప్ 20 పర్సంటైల్ ఉన్నవారు జాతీయ సీట్ల కేటాయింపునకు అర్హులని ఎన్‌టీఏ మార్పు చేసింది. ఎస్సీ, ఎస్టీలు ఇంటర్‌లో 65 మార్కులు పొంది ఉంటే సరిపోతుందని నిర్ణయించింది.

నేడు పీజీ వైద్య విద్య కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: పీజీ వైద్య విద్య కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం తెలిపింది. ఇప్పటికే నాలుగు విడతల కౌన్సెలింగ్ పూర్తయిందని పేర్కొంది. ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి గురువారం సాయంత్రం 3 వరకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారని వెల్లడించింది. ప్రాధాన్యత క్రమంలో కళాశాలల వారీగా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించింది. తుది మెరిట్ జాబితాలోనే అర్హులైన అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని పేర్కొంది. అర్హత, ఇతర వివరాలకు www. knruhs. telangana. gov.inలో చూడాలని స్పష్టం చేసింది.

కాళోజీ రిజిస్ట్రార్‌గా సంధ్యారాణి

సాక్షి, హైదరాబాద్: కాకతీయ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణిని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు.

29 నుంచి అనురాగ్ సెట్

సాక్షి, హైదరాబాద్: వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 29 నుంచి అనురాగ్ సెట్–2023 నిర్వహిస్తున్నట్టు అనురాగ్ వర్సిటీ సీఈవో ఎస్.నీలిమ తెలిపారు. గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి ఆసక్తి చూపే విద్యార్థులు తమ వర్సిటీకి వచ్చి సెట్ పరీక్ష రాయవచ్చని, ఆన్‌లైన్‌లోనూ సెట్ నిర్వహిస్తున్నామని నీలిమ తెలిపారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైందని వివరించారు. బుధవారం విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఆమె సెట్‌కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రవేశపరీక్షలో 1–10 ర్యాంకుల వారికి ఎలాంటి ఫీజు లేకుండానే ప్రవేశం కల్పిస్తామని, 11–25 ర్యాంకుల వారికి 50%, 26–100 లోపు ర్యాంకు వచ్చినవారికి 25% ఫీజు రాయితీ ఉంటుందని ఆమె తెలిపారు. ఈ ఏడాది నుంచి ఎంసెట్, జేఈఈ ర్యాంకర్లకు 10–50 శాతం వరకూ ఫీజు రాయితీ ఉంటుందన్నారు. తమ వర్సిటీ జాతీయ స్థాయిలో ఫార్మసీ, ఇంజనీరింగ్‌లో 140వ ర్యాంకులో ఉందని వైస్ చాన్స్‌లర్ రామచందర్‌రావు తెలిపారు.

బడి 'వణికిపోతోంది'!

- చలి తీవ్రతకు తగ్గుతున్న విద్యార్థుల హాజరు
- వెంటాడుతున్న సీజనల్ వ్యాధులు
- ప్రభుత్వ హాస్టళ్లలో మరీ దారుణం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దీంతో చలి తీవ్రత పెరిగి విద్యార్థులు వణికిపోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గత నాలుగు రోజులుగా విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా తగ్గినట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి. హాజరయ్యే విద్యార్థులు కూడా ఏదో ఒక సీజనల్ వ్యాధితో బాధపడుతున్నారని ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి. కొన్ని బడుల్లో కనీస హాజరు శాతం కూడా ఉండటం లేదని, దీంతో బోధన చేపట్టలేకపోతున్నారని చెప్తున్నాయి. అనేకచోట్ల టీచర్లు కూడా చలి ప్రభావానికి లోనవుతున్నారు. మూడు రోజులుగా దాదాపు 3 వేల మంది టీచర్లు సీజనల్ వ్యాధితో సెలవు పెట్టినట్టు తెలుస్తోంది. అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న పాఠశాలల్లో పరిస్థితి తీవ్రంగా ఉందని, తరగతి గదిలో వెచ్చదనం లేకపోవడంతో విద్యార్థులు గజగజ వణికిపోతున్నట్లు విద్యాశాఖాధికారులు చెప్పారు.

అంతటా అనారోగ్యం

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల్లో సోమవారం 45 శాతం హాజరు నమోదైనట్టు అధికారులు తెలిపారు. మంగళవారం ఇది 35 శాతానికి తగ్గింది. స్కూల్‌కు రాని ప్రతీ విద్యార్థి ఏదో ఒక అనారోగ్య సమస్యతో బాధపడుతున్నట్టు అధికారులు గుర్తించారు. విద్యార్థుల్లో జలుబు, దగ్గు, జ్వరం, నీరసం లాంటి సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయని ఓ జిల్లా విద్యాశాఖాధికారి చెప్పారు. ఆదిలాబాద్, కొత్తగూడెం, ములుగు, నల్లమలకు ఆనుకుని ఉన్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగా కన్పిస్తోంది. ఈ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా ఎండ కూడా రావడం లేదు. దీంతో శరీర ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయి, విద్యార్థులు శ్వాస సమస్యలకు లోనవుతున్నట్టు అధికారులు చెప్పారు. ప్రభుత్వ హాస్టళ్లలోని విద్యార్థులు చాలా వరకు ఇళ్లకు వెళ్లిపోతున్నారు. హాస్టళ్లకు కిటికీలు లేకపోవడం, పడుకునే నేల మంచును తలపించేలా ఉండటంతో సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇదే క్రమంలో చలికి స్నానం చేసే పరిస్థితి ఉండటం లేదని, దీంతో చర్మవ్యాధులూ సోకుతున్నాయని అధికార వర్గాలు తెలిపాయి.



ఆదిలాబాద్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో దుప్పట్లను చుట్టూరా కట్టుకున్న విద్యార్థులు

ముందే సెలవులివ్వాలి..



పాఠశాలల్లో విద్యార్థుల హాజరు తగ్గింది. చలికాలం ఇబ్బంది పెడుతోంది. ఢిల్లీ వంటి ప్రాంతాల్లో సెలవులు ఇచ్చారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండే పాఠశాలల్లో ఈ తరహా ఆలోచన చేయాలి. అన్నింటికన్నా ముఖ్యంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించాలి. ఈ దిశగా వైద్యరంగం తోడ్పాటు తీసుకోవాలి. సంక్రాంతి సెలవుల తర్వాత కూడా సీజనల్ వ్యాధుల బారిన పడే పిల్లల వల్ల వైరస్ మరింత వ్యాప్తి జరగకుండా చూడాలి.

– జి సదానందంగౌడ్, ఎస్‌టీయూటీఎస్, రాష్ట్ర అధ్యక్షుడు

ఇది కీలక సమయమే

ఒక్కసారిగా వాతావరణంలో మార్పులొచ్చాయి. దీనికి అనుగుణంగా పిల్లల శరీరం ఇప్పటికిప్పుడు అలవాటు పడే అవకాశం ఉండదు. ఇలాంటి సీజన్లలో వారిలో వ్యాధి నిరోధక శక్తి అంత చురుకుగా పనిచేయదు. ఫలితంగా చలి తీవ్రతకు జలుబు, జ్వరం వంటి వ్యాధులతో నీరసపడే ప్రమాదం ఉంది. చల్లదనానికి నీళ్ల ఎక్కువగా తీసుకోనందున డీ హైడ్రేషన్ సమస్యలూ ఉంటాయి. మరో వారంపాటు ఇదే పరిస్థితి ఉండొచ్చు. ఏమాత్రం అనారోగ్యంగా ఉన్న స్కూల్‌కు పంపకపోవడమే మంచిది. దీనివల్ల ఇతర విద్యార్థులకు వైరస్ సోకకుండా నియంత్రించవచ్చు. విద్యార్థుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంచేలా ఆకు కూరలు, ఇంట్లో చేసిన వంటలు ఎక్కువగా ఇవ్వాలి. గోరు వెచ్చని నీరు తాగించాలి.



– డాక్టర్ ఎస్.కవిత, పిల్లల వైద్య నిపుణురాలు, నిలోఫర్ ఆసుపత్రి

తొలి మహిళా సీఎస్

▶ మొదటి పేజీ తరువాయి

డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించారు. 2015–2018 వరకు శాంతికుమారి సీఎంఓ ముఖ్యకార్యదర్శిగా ఉన్నారు. ఈ విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కొన్నేళ్ల పాటు కలిసి పనిచేసిన అనుభవం ఉండడంతో పాటు నమ్మకస్తురాలు కావడం.. ఎన్నికల సంవత్సరంలో ఆమెను సీఎస్‌గా నియమించడానికి దోహదపడినట్టు చర్చ జరుగుతోంది. రెండేళ్ల మూడు నెలలకు పైగా సర్వీసు మిగిలి ఉన్న శాంతికుమారి 2025 ఏప్రిల్‌లో పదవీ విరమణ చేస్తారు. ఉమ్మడి ఏపీ రాష్ట్ర తొలి మహిళా సీఎస్‌గా మిన్నీ మాథ్యూస్ 2012లో నియమితులయ్యారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ రాష్ట్ర తొలి మహిళా సీఎస్‌గా నీలం సాహ్ని వ్యవహరించారు. ఆ తర్వాత తెలుగు రాష్ట్రాల్లో మూడో మహిళా సీఎస్ శాంతికుమారి కావడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శాంతికుమారి మెరైన్ బయాలజీలో ఎమ్మెస్సీ, అమెరికాలో ఎంబీఏ చదివారు.

వివిధ హోదాల్లో విశేష సేవలు..

ఐఏఎస్‌గా ఎంపికైన తర్వాత శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్‌గా శాంతికుమారి తొలి పోస్టింగ్ అందుకున్నారు. మూడు దశాబ్దాల కెరీర్‌లో ఆమె పేదరిక నిర్మూలన, సమ్మిళిత అభివృద్ధి, విద్య, వైద్య ఆరోగ్య రంగాలు, నైపుణ్యాభివృద్ధి, అటవీశాఖల్లో వివిధ హోదాల్లో సేవలందించారు. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమాల్లో రెండేళ్ల పాటు పనిచేశారు. తెలంగాణ వచ్చాక నాలుగేళ్ల పాటు సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీగా, టీఎస్ ఐపాస్‌లో ఇండస్ట్రీ ఛేజింగ్ సెల్ స్పెషల్ సెక్రటరీగా సేవలందించారు. అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ సీఎస్‌గా నియమితులయ్యారు.

కొత్త సీఎస్‌కు అభినందనల వెల్లువ

కొత్త సీఎస్‌గా నియమితులైన శాంతికుమారికి అభినందనలు వెల్లువెత్తాయి. ఇన్‌చార్జి డీజీపీ అంజనీకుమార్, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి, ఆర్థిక, పురపాలక శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కె.రామకృష్ణారావు, అరవింద్‌కుమార్, అదర్ సిన్హా, సీనియర్ ఐఏఎస్‌లు నవీన్ మిట్టల్, వాకాటి కరుణ, టీకే.శ్రీదేవి, అనితా రామచంద్రన్, శైలజారామయ్యర్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

మున్నూరుకాపు సంఘం హర్షం

సీఎస్‌గా శాంతికుమారిని నియమించిన సీఎం కేసీఆర్‌కు మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. వెనుకబాటుకు గురైన కాపు సామాజిక వర్గాన్ని గుర్తించి, తగువిధంగా ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి భారత దేశ భవితకు దిక్సూచి అని పేర్కొన్నారు.

అసిస్టెంట్ కలెక్టర్ నుంచి స్పెషల్ సీఎస్ వరకు..

కాల వ్యవధి	పోస్టింగ్
1991 ఆగస్టు 23-1993 జూన్ 18	అసిస్టెంట్ కలెక్టర్
1993 మే 1-1995 జనవరి 1	జాయింట్ కలెక్టర్ (జేసీ)
1995 జనవరి 1 -1995 ఆగస్టు 1	జేసీ, మెదక్
1996 జనవరి 29-1997 అక్టోబర్ 22	ఇంధన శాఖ ఉప కార్యదర్శి
1997 అక్టోబర్ 22-1998 జూన్ 1	నిజామాబాద్ జిల్లా జేసీ
1998 జూన్ 1-1999 ఏప్రిల్ 1	బీసీ, ఎండీ, సాంఘిక సంక్షేమం
1999 ఏప్రిల్ 1 -1999 నవంబర్ 1	అరుణాచల్‌ప్రదేశ్‌లోని చంగ్లాంగ్ జిల్లా కలెక్టర్
1999 నవంబర్ 1-2001 జూన్1	మెదక్ జిల్లా కలెక్టర్
2001 ఆగస్టు 1 -2003 జూలై 1	సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి
2005 జూన్ 1- 2006 సెప్టెంబర్ 18	సర్వే సెటిల్మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్
2006 సెప్టెంబర్ 18 -2010 జనవరి 4	గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్, సెర్ప్ అదనపు సీఈఓ
2010 జనవరి 4 -2011 ఆగస్టు 30	గిరిజన సంక్షేమశాఖ కమిషనర్
2011 ఆగస్టు 30 -2013 ఆగస్టు 28	రాజీవ్‌గాంధీ మిషన్ డైరెక్టర్
2013 ఆగస్టు 28-2015 మే11	యుఎన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సీవోవో
2015 మే 11- 2018 మార్చి 31	సీఎంఓ ముఖ్యకార్యదర్శి
2018 జనవరి 2 -2020 మార్చి 31	వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి
2020 మార్చి 31- ఇప్పటివరకు	అటవీ శాఖ స్పెషల్ సీఎస్

గ్రూప్–1 ప్రిలిమ్స్ ఫలితాలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

ఒక్క అభ్యర్థి స్థానికత కోసం ఆపడం సరికాదన్న ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమ్స్ ఫలితాల విడుదలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఒక అభ్యర్థి స్థానికత వివాదం నేపథ్యంలో ఫలితాలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. స్థానికత అంశంపై తర్వాత విచారణ చేస్తామని చెప్పింది. ఒక్క అభ్యర్థి కారణంగా పూర్తిగా ఫలితాలనే నిలిపివేయడం సరికాదని అభిప్రాయపడింది. ఏడో తరగతి నుంచి పీజీ వరకు తెలంగాణలో చదివిన తనకు స్థానికత కోటా వర్తింపజేయకపోవడంపై నిహారిక అనే అభ్యర్థి గతంలో హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సింగిల్ జడ్జి విచారణ జరిపి స్థానికతను పరిగణనలో తీసుకోవాలని టీఎస్‌పీఎస్సీని ఇటీవల ఆదేశించారు. ఈ ఉత్తర్వులపై టీఎస్‌పీఎస్సీ హైకోర్టును ఆశ్రయించగా జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ కార్తీక్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఒక్క అభ్యర్థి స్థానికత వివాదం నేపథ్యంలో ఫలితాలను మొత్తంగా నిలిపివేయడాన్ని తప్పుబట్టింది. టీఎస్‌పీఎస్సీ తరఫున న్యాయవాది ఎం.రాంగోపాల్‌రావు వాదనలు వినిపించారు. ఏడో తరగతి వరకు తెలంగాణలో చదివి ఉంటేనే స్థానికత వర్తిస్తుందని, అయితే నిహారిక ఆరో తరగతి ఏపీలో చదివారని, ఈ కారణంగా ఆమెకు స్థానికత వర్తించదని చెప్పారు. సింగిల్ జడ్జి ఉత్తర్వుల కారణంగా గ్రూప్–1 పరీక్ష రాసిన లక్షలమంది అభ్యర్థులు ఫలితాల కోసం నిరీక్షించాల్సి వస్తోందని నివేదించారు. దీనిని పరిగణనలోకి తీసుకుని ఫలితాల వెల్లడికి అనుమతి ఇవ్వాలని కోరారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను అమలు చేయాలని నిహారిక తరఫు న్యాయవాది సత్యంరెడ్డి వాదనలు వినిపించారు. అనంతరం ధర్మాసనం అభ్యర్థి సమగ్ర వివరాలను నివేదించాలని టీఎస్‌పీఎస్సీని ఆదేశించింది. స్థానికత వ్యవహారంపై తర్వాత తుది ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేస్తూ విచారణను వాయిదా వేసింది.

హైకోర్టులో 176 పోస్టుల భర్తీ

నోటిఫికేషన్ విడుదల చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: హైకోర్టులో 176 పోస్టుల భర్తీకి సంబంధించి హైకోర్టు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. సబార్డినేట్–50, సిస్టమ్ అసిస్టెంట్–45, ఎగ్జామినర్–17, అసిస్టెంట్–10, స్టెనో–2, అసిస్టెంట్ లైబ్రేరియన్–2, కంప్యూటర్ ఆపరేటర్–20, ట్రాన్స్‌లేటర్–10, కోర్టు మాస్టర్/ హైకోర్టు జడ్జిల వ్యక్తిగత కార్యదర్శులు–20 పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. జనవరి 21 నుంచి ఆన్‌లైన్‌లో వీటికి దరఖాస్తులు స్వీకరించనున్నారు. కేటగిరీల వారీగా పోస్టుల వివరాలు, విద్యార్హత, వయసు, రిజర్వేషన్, భర్తీ విధానం, పరీక్ష ఫీజు తదితర వివరాల కోసం హైకోర్టు వెబ్‌సైట్‌లో చూడొచ్చని రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్) తెలిపారు. పరీక్ష తేదీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

షెడ్యూల్ ఇలా..

నోటిఫికేషన్ విడుదల:	జనవరి 11
ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం:	జనవరి 21
దరఖాస్తుల స్వీకరణ ముగింపు:	ఫిబ్రవరి 11
హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ షురూ:	ఫిబ్రవరి 20

శాంతికుమారి నియామకంపై కాపు సంఘాల హర్షం

- సీఎం కేసీఆర్‌తో జనసేన సలహాదారు రామ్మోహన్‌రావు భేటీ
- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన సంఘాలు



సీఎం కేసీఆర్, సీఎస్ శాంతికుమారిలతో ఏపీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా శాంతికుమారి నియామకం పట్ల కాపు సంఘాల నేతలు హర్షం ప్రకటించారు. జనసేన పార్టీ సలహాదారు, తమిళనాడు మాజీ ప్రధాన కార్యదర్శి, కాపు సమాజం నాయకుడు ఆర్.రామ్మోహన్‌రావు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బుధవారం ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సుదీర్ఘంగా జరిగిన ఈ భేటీలో వీరు ఏపీ రాజకీయాలతోపాటు పలు అంశాలపై చర్చించారు. సీఎస్‌గా శాంతికుమారి నియామకం పట్ల బీఆర్‌ఎస్ ఏపీ శాఖ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, పార్టీ నాయకుడు చింతల పార్థసారథి.. కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శాంతికుమారిని సీఎస్‌గా నియమించడం పట్ల మున్నూరుకాపు సంఘం తెలంగాణ అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వెనుకబాటుకు గురైన కాపు సామాజిక వర్గాన్ని గుర్తించి, వారిని ప్రోత్సహిస్తున్న కేసీఆర్ దేశ భవితకు దిక్సూచి అని అన్నారు. కేసీఆర్‌కు కాపు సమాజం అంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. శాంతికుమారి నియామకంపై మున్నూరు కాపు సంఘం రాష్ట్ర యువజన విభాగం కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ హర్షం వ్యక్తం చేశారు.

సీఎం నిర్ణయం సముచితం: ఎంపీ వద్దిరాజు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శాంతికుమారికి రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శుభాకాంక్షలు తెలిపారు. ఒక మహిళా ఐఏఎస్ అధికారిణిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ కేసీఆర్ సముచిత నిర్ణయం తీసుకున్నారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ మొట్టమొదటి మహిళా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా శాంతికుమారిని నియమించడం పట్ల టీజీవో అధ్యక్షురాలు వి.మమత ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కీలక బాధ్యతతో కూడిన అత్యున్నత పదవికి మహిళను ఎంపిక చేయడం.. కేసీఆర్‌కు మహిళాభ్యుదయం పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

నూతన సీఎస్‌కు అభినందనలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎ.శాంతి కుమారిని పీసీసీఎఫ్ ఆర్.ఎం. డోబ్రియాల్, అటవీ శాఖ అధికారులు అభినందించారు. బుధవారం బీఆర్కే భవన్‌లో నూతన సీఎస్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టెన్త్ ప్రశ్నపత్రంలో మార్పులు

వ్యాసరూప ప్రశ్నలు తగ్గింపు- జీవో విడుదల చేసిన విద్యాశాఖ

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: పది, తొమ్మిది తరగతుల వార్షిక పరీక్ష ప్రశ్నపత్రంలో మార్పులు చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వ్యాసరూప ప్రశ్నల సంఖ్యను తగ్గించారు. గతంలో ఒక్కో విభాగంలో రెండు ప్రశ్నలు (ఎ, బి) ఇచ్చి వాటిల్లో ఒకటి రాయమన్నారు. మొత్తం ఆరు విభాగాల నుంచి ఆరు ప్రశ్నలు రాయాల్సి ఉండేది. ఒక్కో ప్రశ్నకు 5 మార్కులు ఉండేవి. ఇప్పుడీ ప్రశ్నలను ఆరు ఇస్తారు. విభాగాలుగా కాకుండా మొత్తంగా ప్రశ్నలుంటాయి. ఆరింటిలో నాలుగింటికి సమాధానం రాస్తే సరిపోతుంది. ఒక్కో ప్రశ్నకు ఆరు మార్కులు (ఒక మార్కు పెరిగింది) ఉంటాయి.

- స్వల్ప సమాధాన ప్రశ్నలు ఆరు ఉంటాయి. వీటికి గతంలో మూడు మార్కులు ఉంటే, ఇప్పుడు ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు ఇస్తారు.
- మరింత స్వల్ప ప్రశ్నలు ఆరు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులుంటాయి.
- బహుళ ఐచ్ఛిక ప్రశ్నలు 20 ఉంటాయి. ఒక్కో దానికి ఒక మార్కు ఉంటుంది.

గతంలో ఇచ్చిన మాదిరి ప్రశ్నపత్రం కఠినంగా ఉందని, వ్యాసరూప ప్రశ్నలు ఎక్కువగా ఇవ్వడం వల్ల విద్యార్థులకు రాసే సమయం సరిపోదని వివిధ వర్గాల నుంచి ఆందోళన వ్యక్తమైన నేపథ్యంలో ప్రశ్నపత్రాల విధానంలో మార్పు తెచ్చినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. టెన్త్ విద్యార్థుల పరీక్షల విధానం కఠినంగా ఉందనే ఆందోళనను 'సాక్షి' ఈ నెల 2వ తేదీన వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం ప్రశ్నపత్రాల్లో మార్పు చేయాలని ఎస్‌సీఈఆర్‌టీని ఆదేశించింది.

..వందే భారత్

▶ మొదటి పేజీ తరువాయి

పచ్చజెండా, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులకు శ్రీకారం, ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం ప్రధాని ఈ నెల 19న తెలంగాణకు రావాల్సి ఉంది. అయితే ప్రీ బడ్జెట్ భేటీల్లో భాగంగా అనేక వర్గాలతో గత కొన్ని రోజులుగా ప్రధాని స్వయంగా సంప్రదింపులు జరుపుతుండటం, త్వరలో జరగనున్న కేబినెట్ విస్తరణకు కసరత్తు నేపథ్యంలో పర్యటన వాయిదా పడినట్టు చర్చ జరుగుతోంది. పర్యటన వాయిదాపై పీఎం కార్యాలయం కిషన్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ నేతలకు బుధవారం సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.

ఆర్పీఎఫ్‌లో ఉద్యోగాలకు ఫేక్ నోటిఫికేషన్!



సాక్షి, హైదరాబాద్: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో కానిస్టేబుల్ ఉద్యోగాల పేర కేటుగాళ్లు నిరుద్యోగులను బురిడీ కొట్టించే ప్రయత్నం చేశారు. మామూలు మాటలు చెబితే అభ్యర్థులు నమ్మరన్న ఉద్దేశంతో, ఫేక్ నోటిఫికేషన్‌ను సృష్టించి సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ చేశారు. దీంతో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు వీరి వలలో పడినట్లు తెలుస్తోంది. తాజాగా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రైల్వే కార్యాలయాలకు అభ్యర్థులు వచ్చి, దరఖాస్తులు ఎప్పటి నుంచి అందుబాటులో ఉంటాయో వాకబు చేయటం ప్రారంభించారు. దీంతో గుట్టు రట్టయింది.

దరఖాస్తు ఆప్షన్ రాకపోవడంతో..

రైల్వేలో ఉద్యోగాల పేర మోసగాళ్లు భారీ ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. వీరితో స్టడీ సెంటర్ల నిర్వాహకులు కొందరు చేతులు కలుపుతున్నారు. ఉద్యోగాల కోసం అభ్యర్థుల నుంచి కేటుగాళ్లు డబ్బులు వసూలు చేస్తుంటే, వారికి పరీక్ష కోసం శిక్షణ పేరుతో స్టడీ సెంటర్ల నిర్వాహకులు దందా నడుపుతున్నారు. ఇలాంటి సమయంలో తాజాగా 19,800 ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయిందంటూ ఆర్పీఎఫ్ పేరుతో ఓ ప్రకటన సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైంది. కొన్ని పత్రికల్లో కూడా ఈ ప్రకటన ప్రచురితమైంది. దీంతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వేల మందిలో ఆశలు రేకెత్తాయి. దీంతో కేటుగాళ్లు ఉద్యోగాలిప్పిస్తామంటూ దందా ప్రారంభించారు. చాలా ప్రాంతాల్లో అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో రోజులు గడుస్తున్నా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అప్‌లోడ్ చేసే ఆప్షన్ వెలువడకపోవడంతో అభ్యర్థుల్లో అనుమానాలు మొదలయ్యాయి. రైల్వే కార్యాలయాలకు వెళ్లి వాకబు చేయటం ప్రారంభించటంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది.

ప్రస్తుతం ఎలాంటి రిక్రూట్‌మెంటూ లేదు

తామెలాంటి రిక్రూట్‌మెంట్ ప్రస్తుతం చేపట్టడం లేదని, అది నకిలీ ప్రకటన అంటూ అధికారులు వెల్లడించారు. సాధారణంగా రైల్వే ఉద్యోగాల భర్తీ రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్‌ఆర్‌బీ), రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ (ఆర్‌ఆర్‌సీ) ద్వారా జరుగుతుంది. కానీ ఆర్పీఎఫ్ ఉద్యోగాలు వీటి ద్వారా కాకుండా ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతుంది. ప్రస్తుతం రైల్వే బోర్డు అలాంటి కమిటీ ఏదీ ఏర్పాటు చేయలేదు. కానీ ఏకంగా 19,800 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ పేరుతో భారీ అక్రమాలకు తెరతీయటం రైల్వేలో దుమారం రేపుతోంది. దీని వెనుక ఉన్నవారి కోసం రైల్వే పోలీసులు వేట ప్రారంభించినట్లు ఓ ఉన్నతాధికారి తెలిపారు.

సోషల్ మీడియా ప్రకటనలు నమ్మొద్దు

రైల్వేలో ఎలాంటి ఉద్యోగ భర్తీ కసరత్తు మొదలైనా ఆర్‌ఆర్‌బీ, ఆర్‌ఆర్‌సీ, రైల్వే బోర్డు ఆధ్వర్యంలోని ప్రత్యేక కమిటీలు నోటిఫికేషన్ జారీ చేస్తాయి. ఇవన్నీ రైల్వే అధీకృత వెబ్‌సైట్‌ల ద్వారా మాత్రమే వెల్లడవుతాయి. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ నోటిఫికేషన్ల విషయంలో అభ్యర్థులు జాగ్రత్తగా ఉండాలి. కేటుగాళ్లు వాటిని సృష్టించి మోసగించే ప్రమాదం ఉందన్న విషయాన్ని గుర్తించాలి.

– దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ. రాకేశ్

క్రీడాపాలసీకి సబ్ కమిటీ: మంత్రి సబిత

అన్ని హైస్కూళ్లలో పీఈటీ తప్పనిసరి ఉండేలా చూస్తాం



కబడ్డీలో బాలికల జట్టుకు షీల్డు అందజేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: రాష్ట్రంలో క్రీడాపాలసీ రూపొందించేందుకు క్రీడా సబ్‌కమిటీ వేసుకొని నివేదిక ఇవ్వాలని ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి వెల్లడించారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో చిరుమర్తి చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడురోజులుగా నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో ఇప్పటికే వివిధ ప్రభుత్వశాఖల్లో 80 వేల పోస్టులకు నోటిఫికేషన్లు జారీచేశారని, విద్యాశాఖలోనే అత్యధికంగా 20 వేల పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. అన్ని హైస్కూళ్లలో పీఈటీ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోబోతున్నామని మంత్రి వెల్లడించారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో వెయ్యి గురుకులాలను ఏర్పాటు చేశామన్నారు. గురుకులాల్లో ఒక్కో విద్యార్థిపై రూ.లక్షాఇరవై వేలు ఖర్చు చేస్తూ నాణ్యమైన ఇంగ్లిష్ విద్యను అందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ గురుకులాల్లోని విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో 1,150 గురుకుల జూనియర్, 85 డిగ్రీ, రెండు పీజీ కళాశాలలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రపంచంలో ఎక్కడైనా పోటీ పడాలంటే ఇంగ్లిష్ అవసరమని సీఎం భావించి 'మన ఊరు–మన బడి'కార్యక్రమంలో తెలంగాణవ్యాప్తంగా 26 వేల ప్రభుత్వ పాఠశాలలను మూడు విడతలుగా అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో క్రీడాప్రాంగణం నిర్మించామన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, నల్లగొండ జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ హెలికాప్టర్‌పై మావోల కాల్పులు

- తిప్పికొట్టిన బలగాలు.. ఛత్తీస్‌గఢ్‌లో ఘటన
- మావోల కీలక నేత హిడ్మా హతమయ్యాడంటూ పుకార్లు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో పోలీసులు ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌పైకి మావోయిస్టులు కాల్పులు జరిపారు. అప్రమత్తమైన బలగాలు ఎదురుకాల్పులు జరపడంతో మావోయిస్టులు తప్పించుకున్నట్లు సమాచారం. పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని దారెల్లి – మీనగట్ట గ్రామాల అటవీ ప్రాంతాల మీదుగా పోలీసు బలగాలతో ప్రయాణిస్తున్న హెలికాప్టర్ పైకి బుధవారం మావోయిస్టులు కాల్పులు జరిపారు. ఈ విషయాన్ని గుర్తించిన పైలెట్ హెలికాప్టర్‌ను పైకి లేపడంతో అందులో ఉన్న పోలీసులు కిందికి కాల్పులు జరిపారని తెలిసింది. అయితే మావోయిస్టు కీలక నేత, కేంద్రకమిటీ సభ్యుడు, దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యుడు మడవి హిడ్మా అలియాస్ సంతోష్ స్వగ్రామం సుకుమా జిల్లాలోని పువ్వర్తి కావడం, కాల్పుల జరిగిన ప్రాంతం ఆ గ్రామానికి సమీపంలో ఉండడంతో ఆ ప్రాంతంలో హిడ్మా ఉండవచ్చునని, ఈ క్రమంలోనే పోలీసులు హెలికాప్టర్‌లో వచ్చి కాల్పులు జరిపారని, కాల్పుల్లో హిడ్మా హతమయ్యాడనే పుకార్లు వ్యాపించాయి. కాల్పులు జరిగిన మాట వాస్తవమే అయినప్పటికీ హిడ్మా హతమయ్యాడని పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ఇవి పుకార్లేనని తేటతెల్లమైంది.

కొత్తగా 10 కరోనా కేసులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధవారం 5,112 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 10 మంది వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి ఐదుగురు కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 56 మంది ఐసోలేషన్ లేదా చికిత్స పొందుతున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు వెల్లడించారు. రాష్ట్రంలో బుధవారం 5,448 మందికి కరోనా వ్యాక్సిన్లు ఇచ్చారు. అందులో బూస్టర్ డోసు 4, 991 మందికి వేయగా, రెండో డోసు 281, మొదటి డోసు 176 మందికి వేసినట్లు ఆయన తెలిపారు.

గ్రేటర్‌పై చలి పంజా

- పలు ప్రాంతాల్లో 9.9 నుంచి 11 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్‌పై చలి పంజా విసురుతోంది. సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతుండడం, శీతల గాలులతో సిటీజన్లు గజగజలాడుతున్నారు. బుధవారం నగరంలో పలు చోట్ల 9.9 నుంచి 11 డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శివరాంపల్లిలో అత్యల్పంగా 9.9, మచ్చబొల్లారంలో 11.2, హస్తినాపురం 11.3, పటాన్‌చెరు 11.3, వెస్ట్ మారేడ్‌పల్లి 11.6, నాగోల్ 12.1, హయత్‌నగర్ 12.3 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరికొన్ని చోట్ల 12 నుంచి 14 డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో నగరంలో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశాలున్నట్లు బేగంపేట్‌లోని వాతావరణ శాఖ తెలిపింది. చలి నుంచి రక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమేనా?: ఎర్రబెల్లి

సాక్షి, మహబూబాబాద్: 'తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిలకు ముక్కు, మూతి తెలియదు. రాష్ట్ర అభివృద్ధిపై చర్చకు నేను సిద్ధమే. మీరు సిద్ధమేనా? నాది తప్పు అయితే మంత్రి పదవికి రాజీనామా చేస్తా. రాజకీయాల నుంచి తప్పుకుంటా'అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సవాల్ విసిరారు. మీరు తప్పు ఒప్పుకొని నోరు అదుపులో పెట్టుకుంటే సరిపోతుందన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తున్న నేపథ్యంలో బుధవారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతితో కలిసి విలేకరులతో ఎర్రబెల్లి మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో అభివృద్ధి ఎక్కడుందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు మళ్లిస్తున్నారని కిషన్‌రెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవమని అన్నారు. రాష్ట్రంపై కక్షగట్టి కేంద్రం నిధులు విడుదల చేయడం లేదని ఆరోపించారు. తెలంగాణలో అభివృద్ధి శూన్యమని చెబుతున్న కేంద్రమంత్రులకు తెలంగాణలోని గ్రామాలకు అవార్డులు వస్తున్న విషయం కన్పించడం లేదా? అని ఎర్రబెల్లి ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఎరువు..బరువు!

సర్కారు దన్ను ఉన్నా సాగు సంబురంగా మారని పరిస్థితి


- కష్టానికి తగ్గ ఫలితం ఉండటం లేదంటున్న రైతులు
- అత్యధికంగా ఎరువులు వాడుతున్న రాష్ట్రాల్లో ముందువరుసలో తెలంగాణ
- హెక్టారుకు దేశంలో 133, రాష్ట్రంలో 206 కిలోల వినియోగం
- మూడేళ్ల క్రితం మొదటి స్థానంలో నిలిచిన రాష్ట్రం
- తడిసి మోపెడవుతున్న వ్యయం.. భూములు నిస్సారం
- పంటల మార్పిడే పరిష్కారమంటున్న నిపుణులు



రైతులు, ఉన్న భూమి లెక్కలు ఇలా	
2.47 ఎకరాలలోపు	64.6 శాతం
2.48 – 4.94 ఎకరాలు	23.7 శాతం
4.95– 9.88 ఎకరాలు	9.5 శాతం
9.89 –24.77 ఎకరాలు	2.1 శాతం
24.79 కంటే ఎక్కువ	0.2 శాతం

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఎకరాకు పదివేల రూపాయల పెట్టుబడి సాయం.. ఉచితంగా నిరంతర విద్యుత్. పండిన పంటలను మద్దతు ధరతో కొనుగోలు.. వీటికి అదనంగా ఐదేళ్లకొక మారు పంట రుణమాఫీ. తెలంగాణలో వ్యవసాయాన్ని పండగలా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలివి. కానీ ఇక్కడ వ్యవసాయం రైతులకు పండగలా మారిందా? అంటే లేదనే అంటోంది మెజారిటీ రైతాంగం. సాగు విస్తీర్ణం, పంట దిగుబడి పెరిగినా.. తమ కష్టమంతా ఎరువులు, పురుగు మందులు, కూలీలు తదితర ఖర్చులకే సరిపోతోందని అంటున్నారు. దేశంలో అత్యధికంగా ఎరువులు వాడుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి వరసలో నిలవడం గమనార్హం. హెక్టారుకు సగటున 206 కిలోల ఎరువులు వాడుతున్నట్లు తాజా నివేదిక వెల్లడించింది. సారవంతమైన భూములు, చాలినన్ని సాగునీళ్లు ఉన్నా.. విపరీతంగా పెరిగిన ఎరువుల వాడకం, ఇతర ఖర్చుల వల్ల.. రైతుకు సాగు సంబురంగా మారడం లేదని ఆర్థిక వేత్తలు పేర్కొంటున్నారు. ప్రధానంగా ఎరువుల ఖర్చును తగ్గించుకుంటే ఎక్కువ ఫలితం దక్కుతుందని, పంటల మార్పిడితో ఎరువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు అంటున్నారు.

అత్యధికంగా ఎరువులు వినియోగించిన రాష్ట్రాలు



ఎరువుల వినియోగంలో టాప్

ఆహారోత్పత్తిని, మొక్కలకు పోషకాలు, భూసారాన్ని పెంచేందుకు రైతులు నత్రజని, భాస్వరం, పొటాషియం (ఎన్‌పీకే) భారీగా వినియోగిస్తున్నారు. తెలంగాణ 2018-19లో దేశంలోనే అత్యధిక ఎరువుల వినియోగంతో మొదటి స్థానంలో (హెక్టారుకు 245 కిలోలు) నిలవగా, 2019-20లో నాలుగో స్థానంలో (హెక్టారుకు 206 కిలోలు) నిలిచిందని ఫెర్టిలైజర్ అసోసియేషన్ వెల్లడించింది. అయితే దేశ సగటు వినియోగం 133.1 కిలోలు మాత్రమే కావడం గమనార్హం. అవసరానికి మించి ఎరువుల వాడకం వల్ల ఏకంగా 200 మండలాల్లోని భూముల్లో భారీగా భాస్వరం నిల్వలు పేరుకు పోయాయని జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ తాజా పరిశోధనలో తేల్చింది. పేరుకుపోయిన భాస్వరం నిల్వల నుంచి భూసార పరిరక్షణ చేపట్టేందుకు ప్రత్యేక కార్యాచరణను నిర్దేశించినా అది ఇంకా పంట పొలాలకు చేరువ కాలేదు.

ఇదీ సాగు లెక్క..

- రాష్ట్ర జనాభాలో 48.4 శాతం మందికి వ్యవసాయమే ఉపాధి.
- 2018 నుంచి రైతుబంధు కింద 63 లక్షల మందికి ఎకరానికి ఏటా రూ.10 వేల చొప్పున అందుతున్న పెట్టుబడి సాయం.
- బావులు, లిఫ్టులు, చెరువులు, చెక్‌డ్యామ్‌ల ద్వారా రాష్ట్రంలో సాగవుతున్న భూమి 1.36 లక్షల ఎకరాలు
- గడిచిన ఐదేళ్లలో వరి ఉత్పత్తి పెరిగింది. అత్యధిక ఎరువుల వినియోగం ఉన్నా.. నగటు ఉత్పత్తిలో పంజాబ్ కంటే వెనకే ఉంది.
- 25.92 లక్షల వ్యవసాయ మోటార్లకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ ఇస్తోంది.
- అత్యధికంగా మెదక్, జనగామ, నాగర్‌కర్నూల్, సిద్దిపేట జిల్లాల్లో వ్యవసాయ విద్యుత్ వినియోగం అవుతోంది.

ఎరువులు, మందులకే రూ.రూ.47,600 ఖర్చు



నాకున్న ఐదెకరాల భూమిలో పత్తి సాగు చేసిన. ఆదాయం చూస్తే పెట్టుబడి ఖర్చులు కూడా పూర్తిగా రాలా. ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అనుకున్నా. అధిక వర్షాల కారణంగా నాలుగు క్వింటాళ్లే వచ్చింది. క్వింటాకు రూ.8 వేల చొప్పున విక్రయిస్తే రూ.1.60 లక్షలు రాగా, రూ.1,61,450 పెట్టుబడి పెట్టా. ఇందులో యూరియా, క్రిమిసంహారక, పూత మందులకే రూ.47,600 ఖర్చయ్యాయి. దీంతో పడిన కష్టానికి ఫలితం లేకుండా పోయింది.

–బలరాం, పత్తి రైతు ఊగుల్, సిద్దిపేట జిల్లా

ఐదెకరాలు సాగు చేస్తే రూ.55 వేలే మిగిలింది



ఐదు ఎకరాల్లో వరి సాగు చేస్తే రెక్కల కష్టానికి తగిన ఫలితం కూడా మిగలలేదు. సాగు కోసం రూ.1.2 లక్షలు ఖర్చు పెడితే 100 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అమ్మితే రూ.2 లక్షలు వచ్చాయి. విత్తనాల ఖర్చు నుంచి, నాటు వరకు రూ.45 వేల ఖర్చు కాగా, ఎరువులకు రూ.18 వేలు అయ్యాయి. పంటకోత, ఆరబెట్టేందుకు రూ.14 వేలు, మోటార్ల మరమ్మతుకు రూ.4 వేలు, 3 మోటార్ల నిర్వహణకు, ఏడాది కరెంటు బిల్లు రూ. 2,250 అయింది. ఖర్చులు పోను రూ.80 వేలు మిగిలితే.. పెట్టుబడి వడ్డీలకు రూ.25 వేలు పోయింది, అర్నెల్ల పాటు భార్యభర్తలం ఇద్దరం కలిసి పనిచేస్తే రూ.55 వేలు మాత్రమే మిగిలింది.

–తొక్కల ఇంద్రసేనారెడ్డి, రైతు, దేవరుప్పుల, జనగామ జిల్లా

పంటల మార్పిడి తప్పనిసరి



తెలంగాణలో అత్యధికంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటల సాగు అవుతోంది. ఎరువులను అవసరానికి కంటే మించి వినియోగిస్తున్నారు. ఈ అంశం మా పరిశోధనల్లోనూ తేలింది. పంట మార్పిడితో ఎరువుల వినియోగానికి చెక్ పెట్టొచ్చు. వరికి ముందు పెసర, మినుము, నువ్వులను సాగు చేసి ఈ పంట చేతికి రాగానే అందులోనే తొక్కించాలి. ఇలా చేస్తే రెండేళ్లలో 25 శాతం ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. ఇంటిగ్రేటెడ్ న్యూట్రియెంట్ మేనేజ్‌మెంట్‌తో కూడా ఎరువుల వాడకాన్ని భారీగా తగ్గించవచ్చు. ఈ పద్ధతిని రైతుల వద్దకు చిత్తశుద్ధితో చేర్చి, నూతన సాగు పద్ధతులను అమలు చేయించే దిశగా తక్షణం చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ వి.ప్రవీణ్‌రావు, మాజీ వీసీ, వ్యవసాయ విశ్వవిద్యాలయం

వ్యయం తగ్గాలి.. మద్దతు పెరగాలి



పలు కారణాలతో పంట ఉత్పత్తి వ్యయం భారీగా పెరిగిపోయింది. ఈ మేర పంట మద్దతు ధర పెరగలేదు. దీంతో పిల్లల చదువులు, ఆరోగ్యం విషయాల్లో మిగిలిన సమాజంతో రైతులు పోటీ పడలేకపోతున్నారు. ప్రభుత్వం అనేక రకాలుగా చేయూతనిస్తున్నా.. ఫలితం ఉండటం లేదు. ఉత్పత్తి వ్యయం తగ్గించడంతో పాటు, రైతులకు ఇచ్చే మద్దతు ధరలు పెంచాల్సి ఉంది.

– ప్రొఫెసర్ కె.ముత్యంరెడ్డి, అధ్యక్షుడు, తెలంగాణ ఎకనమిక్ అసోసియేషన్



నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ అశోక్‌కుమార్. (ఇన్‌సెట్‌లో) వృద్ధురాలు మార్త

గోడు విని.. గూడు కట్టించి!

హనుమకొండ జిల్లాలో దాతల సహకారంతో ఇంటినిర్మాణం

ఎల్కతుర్తి: కన్నకూతురు కాదు పొమ్మన్నా కరుణామయులు ఓ వృద్ధురాలిని అక్కున చేర్చుకున్నారు. గూడు లేక గోడు వెళ్లబోసుకుంటున్న ఆమెకు చేయూతనిచ్చారు. నిలువ నీడలేక చలికి వణుకుతుండగా చేరదీసి ఇల్లు కట్టించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్‌కి చెందిన గొర్రె మార్త అనే వృద్ధురాలిని సొంత కూతురు సాకలేక రెండు నెలల క్రితం ఇంట్లో నుంచి బయటకు గెంటేసింది. దీంతో ఆ వృద్ధురాలు ఇందిరానగర్ బస్టాండ్‌లో చలికి వణుకుతూ పోలీసులకు కనిపించింది. కాజీపేట ఏసీపీ శ్రీనివాస్, స్థానిక సీఐ శ్రీనివాస్, ఎస్సై జక్కుల పరమేష్ ఆ వృద్ధురాలికి ఆశ్రయం కల్పించేందుకు చర్యలు చేపట్టారు. బస్టాండ్ పక్కనే ఉన్న స్థలంలో ఆమె కోసం ఇంటినిర్మాణం చేపట్టారు. ఏసీపీ ఆధ్వర్యంలో పలువురు దాతలు ముందుకు వచ్చి తోచిన సాయం చేశారు. పోలీసులు సైతం తమవంతుగా చేయూత నందించి ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. డీసీపీ అశోక్ కుమార్ చేతుల మీదుగా బుధవారం గృహప్రవేశం చేయించారు. డీసీపీ అశోక్ కుమార్ మాట్లాడుతూ పోలీసు లు శాంతిభద్రతల పరిరక్షణతోపాటు సామాజిక సేవలోనూ ముందుండాలని ఆకాంక్షించారు. కార్య క్రమంలో సీఐలు శ్రీనివాస్, రమేశ్, ఎస్సైలు జక్కు ల పరమేశ్, మానికరెడ్డి, ప్రవీణ్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవిందర్‌గౌడ్, సర్పంచ్ కడారి రమ, ఎంపీటీసీ బొంకూరి రజిత పాల్గొన్నారు.

తల్లి గర్భంలోనే శిశువు మృతి

- నరకయాతన పడ్డ గొత్తికోయ మహిళ
- పట్టించుకోని ప్రభుత్వ వైద్య సిబ్బంది
- గూడేనికి వచ్చేది లేదు.. ఆమెనే తీసుకురమ్మని హుకుం
- దాంతో ఆరు కిలోమీటర్లు బాలింతను సైకిల్‌పై తీసుకువెళ్లిన వైనం
- తీరా అక్కడకు వెళ్లిన తర్వాత పత్తా లేని వైద్య సిబ్బంది



అంబులెన్స్‌లో గొత్తికోయ మహిళను ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్న ఆశ వర్కర్లు

వెంకటాపురం(ఎం): పండంటి బిడ్డకు జన్మనిస్తున్నాను.. తల్లి అవుతున్నాననే ఆనందంలో ఆమె ఉంది. కానీ కడుపులో ఉన్న బిడ్డ వారం క్రితమే మృతి చెందిన విషయం ఆ అమాయక తల్లికి తెలియలేదు. ఈ క్రమంలో శరీరంలో మార్పులతో వాపు రావడమే కాకుండా దుర్వాసన వస్తుండటంతో రెండు రోజుల క్రితం ప్రసవించగా మృతశిశువు బయటకు వచ్చింది. ఆ తర్వాత కూడా శరీరంలో మార్పులతో నరకయాతన పడినా కనీసం ఆరోగ్య సిబ్బంది పట్టించుకోని ఘటన ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండల పరిధిలోని తొర్రి చింతలపాడు గొత్తికోయగూడేంలో చోటుచేసుకుంది.

– గూడేనికి చెందిన మడకం సోమక్క నిండు గర్భవతి. వారం రోజుల క్రితమే కడుపులో ఉన్న బిడ్డ మరణించినా.. ఆ విషయం తెలియక అనారోగ్యానికి గురవుతూ ఇబ్బందులు పడింది. ఈ క్రమంలో స్థానిక మహిళలు డెలివరీ చేయగా అప్పటికే శిశువు మృతి చెంది ఉన్నట్లు గొత్తికోయలు చెబుతున్నారు. అయితే ఆ తర్వాత కూడా ఆమె శరీరం నుంచి దుర్వాసన వస్తూ.. కాళ్లు, చేతులు, మొహం ఉబ్బుతుండటంతో బుధవారం వెంకటాపురంలోని ఆరోగ్య ఉపకేంద్ర సిబ్బందికి సమాచారం ఇచ్చారు. గూడేనికి చేరుకొని పరీక్షించాల్సిన వైద్యుడు, ఏఎన్ఎంలు కనీసంగా పట్టించుకోకుండా సదరు మహిళనే తీసుకురావాల్సిందిగా ఆదేశించారు.

ఆరు కిలోమీటర్లు సైకిల్‌పై..

దీంతో మండల కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న తొర్రి చింతలపాడు నుంచి సోమక్కను సైకిల్‌పై గొత్తికోయలు తీసుకురాగా.. తీరా అక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో లేరు. చివరికి ఆశ వర్కర్లు 108కు ఫోన్ చేసి సోమక్కను ములుగు ఏరియా ఆస్పత్రికి వైద్య చికిత్సల నిమిత్తం తరలించారు. పలు టెస్టుల కోసం రక్త నమూనాలు తీసుకొని ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యుల చెబుతున్నారు. కాగా.. సమాచారం అందించినా వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై గూడెం వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ప్రసవాల అనంతరం తల్లులు, వైద్యులు

24 గంటల్లో 25 ప్రసవాలు

- మెదక్ ఎంసీహెచ్‌లో రికార్డు

మెదక్‌జోన్: మెదక్ ఆస్పత్రి (ఎంసీహెచ్)లో వైద్యులు సరికొత్త రికార్డు సృష్టించారు. బుధవారం ఒక్క రోజే 25 ప్రసవాలు చేసి గతంలో ఉన్న రికార్డును తిరగరాశారు. ఇందులో 12 సాధారణ ప్రసవాలు, 13 సిజేరియన్‌లు ఉన్నాయి. ఆస్పత్రి విభాగాధిపతి గైనకాలజిస్ట్ డా.శివదయాళ్ పర్యవేక్షణలో గైనకాలజిస్ట్ డాక్టర్ వసుధ, అనస్థీషియా సాగరిక, పిల్లల వైద్య నిపుణుడు డా.చంద్రశేఖర్ రావు, స్టాఫ్ నర్సులు, నర్సులు, సహాయ వైద్యసిబ్బంది 24 గంటలు శ్రమించి కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రసవాలు చేశారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.చంద్రశేఖర్ తెలిపారు. ఆస్పత్రిలో మరింత మెరుగైన సేవలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. గతంలో ఒక్కరోజులో 23 ప్రసవాలు జరగడం ఆస్పత్రి రికార్డుగా పేర్కొన్నారు. అలాగే నవంబర్ నెలలో 407 ప్రసవాలు చేశామని వైద్యులు తెలిపారు.

ముగ్గులు వేసి.. రంగులు నింపి..



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సతీమణి డాక్టర్ సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు హాజరై ముగ్గుల్లో రంగులు నింపారు. – మహబూబాబాద్

కేంద్రమంత్రి దృష్టికి గల్ఫ్ కార్మికుల వెతలు

- ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమంలో ప్రస్తావించిన జేఏసీ ప్రతినిధులు
- సానుకూలంగా స్పందించిన విదేశాంగశాఖ సహాయమంత్రి మురళీధరన్



కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ గల్ఫ్ జేఏసీ ప్రతినిధులు

మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికుల సమస్యలు, పరిష్కారమార్గాలపై తెలంగాణ గల్ఫ్ జేఏసీ ప్రతినిధులు చేసిన సూచనలకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఈ నెల 8 నుంచి 10 వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ వేదికగా ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమం జరిగింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ, విదేశాంగ శాఖ సహాయమంత్రి వి.మురళీధరన్ ప్రసంగాలు ముగిసిన తరువాత సభికుల నుంచి ప్రశ్నలకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు స్వదేశ్ పరికిపండ్ల, ఒమాన్ ఎన్నారై, బీజేపీ మిడిల్ ఈస్ట్ కన్వీనర్ నరేంద్ర పన్నీర్‌లు గల్ఫ్ కార్మికుల అంశాలను ప్రస్తావించారు. ప్రవాసీ భారతీయ బీమా యోజన అనే రూ.10 లక్షల విలువైన ప్రమాద బీమా పాలసీని సహజ మరణానికి వర్తింపచేసేలా నిబంధనలు సవరించాలని విజ్ఞప్తి చేశారు. కరోనా వల్ల ఉద్యోగాలు కోల్పోయి తిరిగి వచ్చినవారికి జీతం బకాయిలు, పదవీ విరమణ ప్రయోజనాలు అందేలా న్యాయ సహాయం అందించాలని కోరారు.

పరిహారం చెల్లించేలా ఒప్పించాలి

ఖతర్‌లో జరిగిన ప్రపంచ ఫుట్‌బాల్ కప్ పోటీల కోసం క్రీడాప్రాంగణాలు, ఇతర నిర్మాణపనుల్లో ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన వలస కార్మికుల కుటుంబాలకు పరిహారం చెల్లించేలా అక్కడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని జేఏసీ ప్రతినిధులు విన్నవించారు. ప్రవాసులైన వారందరికీ ఆన్‌లైన్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని, యూఏఈ, సౌది అరేబియా, కువైట్ దేశాలను భారత ప్రభుత్వం దౌత్యపరంగా ఒప్పించి ఆయా దేశాల కాన్సుల్ కార్యాలయాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయించాలని కోరారు. జేఏసీ ప్రతినిధుల సూచనలను విదేశాంగ శాఖ పరిశీలిస్తుందని మంత్రి మురళీధరన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ గుగ్గిళ్ల రవిగౌడ్, ప్రతినిధులు చెన్నమనేని శ్రీనివాస్‌రావు, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, భోగ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



తెల్లకాగితం లాంటి మనసుతో అన్ని అత్యున్నత ఆదర్శాలను వెతుకు.
అత్యంత జ్ఞానోదయం కలిగించే ఆలోచనలను పరిగణించు.
తర్వాత నీ దారిని ఎంపిక చేసుకో.
– జరాతుష్ట్ర

సాక్షి

గురువారం, జనవరి, 12

దయనీయంగా దాయాది

చపాతీ ఇరవై, తందూరీ రోటీ పాతిక రూపాయలు. కిలో గోదుమ పిండి నూట పాతిక. బేకరీలో బ్రెడ్ సైతం సైజును బట్టి రూ. 70 నుంచి 200. పాడి సమృద్ధిగా ఉండే శీతకాలమైనా సరే రెండున్నర నెలల క్రితమే లీటర్ పాలు రూ. 118 నుంచి రూ. 200 అయింది. గోదుమలు ప్రధాన ఆహారమైన దేశంలో పది కిలోల బస్తా 1500 పలుకుతోంది. మార్కెట్‌లో గోదుమ పిండి ఖాళీ అయ్యేసరికి, బారులు తీరిన జనం... తిండి కోసం అల్లాడుతూ ఆహార గింజలకై కొట్టుకుంటున్న పరిస్థితులు... ఆర్మీ గార్డుల రక్షణలో గోదుమ ట్రక్కులు పంపాల్సిన అవస్థలు... బలూచిస్తాన్, సింధ్ ప్రావిన్స్‌లలో తొక్కిసలాటలు. ఇవీ అక్కడి దృశ్యాలు. రాత్రి 8.30 గంటలకే మార్కెట్లు మూసేయాలి. రాత్రి పదికి కల్యాణ మండపాలు కట్టేయాలి. ఆఫీసులో కరెంట్ వినియోగం కనీసం 30 శాతం తగ్గించాలి. తేయాకు దిగుమతి చేసుకొనేందుకు విదేశీ మారకం తగినంత లేనందున రోజూ తాగే టీ పైనా రెండు కప్పుల రేషన్. ఇదీ పాకిస్తాన్‌లో ప్రభుత్వ ఆదేశాలు. పాలకుల విధాన వైఫల్యం, ప్రకృతి ప్రకోపం కలసి కొద్దినెలలుగా కనివిని ఎరుగని ఆర్థిక, ఆహార సంక్షోభంలోకి దాయాదిదేశాన్ని నెట్టేశాయి.

పాకిస్తాన్‌లో ప్రస్తుత పరిస్థితికి ఇవన్నీ మచ్చుతునకలు. గత జూన్ నుంచి సగటున 31 శాతం ఆహార ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న దేశంలో ఆర్థికవ్యవస్థ సైతం సంక్షోభంలో ఉంది. ఎనిమిదేళ్ళలో ఎన్నడూ లేనట్టు విదేశీమారక ద్రవ్య నిల్వలు 450 కోట్ల అమెరికన్ డాలర్లకు పడిపోయాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలోనే ఏకంగా 800 కోట్ల డాలర్లకు పైగా అప్పులు తీర్చాలి. అంటే, రాను రానూ నిల్వలు మరింత క్షీణిస్తాయి. సరిగ్గా అయిదేళ్ళ క్రితం డాలర్ విలువ 110 రూపాయలున్న పాక్‌లో ఇప్పుడది రెట్టింపై, 228 చిల్లరకు చేరింది. తగ్గుతున్న ద్రవ్య నిల్వలు, బలహీనపడుతున్న రూపాయి, దెబ్బతింటున్న స్థూల ఆర్థిక అంశాలు... ఇలా అనేకం మన పొరుగు దేశాన్ని అడకత్తెరలో పెట్టాయి. కఠిన నిర్ణయాలు తీసుకోకుంటే సామాజిక, ఆరోగ్య రంగాల్లో సంక్షోభాలు అనివార్యం.

నిజానికి, గత ఏడాది 2.7 కోట్ల టన్నుల గోదుమలు పండించాలని పాక్ లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, నీటి కొరత వచ్చింది. పులి మీద పుట్రలా ఆర్థిక వ్యవస్థ బలహీనపడింది. జూన్‌లో వరదలతో వ్యవసాయ భూమి దెబ్బతిని, ఉత్పత్తి పడిపోయింది. రష్యా నుంచి లక్షల టన్నులు దిగుమతికి ఒప్పందం కుదుర్చుకోవాల్సి వచ్చింది. ఇవన్నీ ప్రకృతి శాపమనుకుంటే... ఎన్నడూ లేనంత ద్రవ్యోల్బణం, పెట్రోలియమ్ ధరల పెంపు, రూపాయి విలువలో క్షీణత, దేశమే దివాళా తీసే పరిస్థితి – పాలకుల విధాన వైఫల్యానికి నిలువుటద్దాలు. గద్దె మీది పెద్దల తప్పులకు పౌరులు కష్టాల పాలయ్యారు. చిక్కు సమస్యల నుంచి దేశాన్ని బయటకు తెచ్చే కృషి చేయాల్సిన అధికార పక్షాలు ఆర్థికంగానే కాదు... ఆలోచనల పరంగానూ దివాళా తీయడం విషాదం. తక్షణ కర్తవ్యం గురించి ఆలోచించక, ఎంతసేపటికీ గత ప్రభుత్వాలపై నిందారోపణలకే పరిమితం కావడం విడ్డూరం.

గత ఏప్రిల్‌లో అవిశ్వాస తీర్మానం ద్వారా పదవి కోల్పోయిన తొలి పాక్ ప్రధానిగా ఇమ్రాన్ రికార్డు కెక్కితే, ఆయన స్థానంలో ప్రతిపక్ష పీఎంఎల్–ఎన్‌కు చెందిన షహబాజ్ షరీఫ్ గద్దెనెక్కారు. ప్రభుత్వం మారిందే కానీ, పార్లమెంట్ నిస్తేజంగా మారింది. వివిధ ప్రావిన్స్‌ల అసెంబ్లీలు ఏ క్షణంలోనైనా రద్దయ్యే పరిస్థితిలో పడ్డాయి. తీవ్రవాదం మరోసారి పడగ విప్పింది. ఏ రోజుకారోజు రాజకీయ సంక్షోభం ముదిరి, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశాయి. దేశ ఆర్థిక పరిస్థితి దిగజారుతున్నా, రాజకీయ పెద్దలెవరూ నియమానుసారం నడుచుకొనే ప్రయత్నం చేయకపోవడం మరీ విడ్డూరం. ఇన్నేళ్ళుగా పాలనను పక్కనపెట్టి, భారత, అఫ్గాన్ గడ్డలపై తీవ్రవాదాన్ని పెంచి పోషించడమే వ్యూహాత్మక అస్త్రంగా భావించిన పాకిస్తాన్‌కు ఇప్పుడు అదే తీవ్రవాదం గుదిబండై కూర్చుంది. స్వయంకృత అపరాధాలను గుర్తించి, ఇకనైనా బుద్ధి మార్చుకోవాల్సిన సమయం వచ్చింది.

2011 నాటికి పాక్ అప్పులు ఆ దేశ జీడీపీలో 52.8 శాతం ఉంటే, గత ఏడాదికి 77.8 శాతానికి ఎగబాకాయి. అప్పులు తీర్చలేక, ఆహార సంక్షోభం నుంచి బయటపడలేక సతమతమవుతూ ఆ దేశం ఆపన్నహస్తం కోసం చూస్తోంది. దేశ ఆర్థికవ్యవస్థను పునర్నిర్మించడానికి అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) సాయం కోరుతూ పాక్ ప్రధాని జెనీవాకు వెళ్ళారు. ఆహారం, వైద్యసాయం, వ్యవసాయం, ప్రాథమిక వసతుల నిమిత్తం 10 కోట్ల డాలర్ల ఆర్థిక సాయం ఇస్తానంటూ అమెరికా మంగళవారం ప్రకటించింది. సౌదీ అరేబియా సైతం పాక్‌లో తమ పెట్టుబడిని వెయ్యికోట్ల డాలర్లకు పెంచాలని యోచిస్తోంది. వరద బాధిత పాక్ కోలుకోవడానికి సోమవారం నాటి జెనీవా దాతల సదస్సులో వెయ్యి కోట్ల మేర వాగ్దానాలు రావడం నైతికంగా ఉత్సాహజనకమే. కానీ, వివిధ సంస్థలతో రానున్న మూడేళ్ళలో అందే సాయం పాక్ తక్షణ డాలర్ ద్రవ్యసంక్షోభాన్ని పరిష్కరించలేదు. తక్షణ ద్రవ్యసాయంతో ఆర్థిక వ్యవస్థకు ఊపిరులూదాలి.

ఐఎంఎఫ్‌తో సమస్యాత్మక సంబంధాలున్న పాక్ ఇప్పటికైతే కఠిన షరతులు ఆపాలని కోరింది. ఊహించినదాని కన్నా మెరుగైన సాయం అందినందుకు ప్రధానమంత్రి, బృందం సంతోషిస్తున్నా, ఇది తాత్కాలిక ఊరటే. స్థూల ఆర్థిక సంస్కరణలు చేపడితేనే దేశానికి దీర్ఘకాలిక పునరుద్ధరణ సాధ్యం. స్వయంగా ఆ దేశ ప్రధానమంత్రే చెప్పినట్టు పర్వతం లాంటి సమస్యలను అధిగమించడానికి కాలంతో పోటీపడుతూ పాక్ పరుగులు తీయాలి. అయితే, మాటలు చెబితే చాలదు... చేతల్లో చూపెట్టాలి. ఆ బృహత్తర బాధ్యత దాయాది దేశపు విధాన నిర్ణేతలదే!

సందేహాలు తీరకుండా చర్యలెలా?

విశ్లేషణ



వైభవ్ చతుర్వేది

వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి చేపట్టే చర్యలకు కొన్ని వైరుధ్యాలు అడ్డుపడుతున్నాయి. ఉష్ణోగ్రతలను తక్కువ పెరిగేలా చూడాలంటే, శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాలి. కానీ పాశ్చాత్య దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆధారపడే బొగ్గును తగ్గించే అంశానికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. కాలుష్యానికి జరుగుతున్న నష్టాన్ని భర్తీ చేయాల్సిన బాధ్యత వాటిపైనే ఉండగా, ఆ దాతల జాబితాలోకి భారత్, చైనాలను కూడా చేర్చాలని డిమాండ్ చేస్తున్నాయి. భారత్‌కే ప్రత్యేకమైనది చైనాతో వ్యవహారం. చైనా తనకు అనుకూలంగా జీ77 + చైనా గ్రూపులో ఉంటూ వాతావరణ చర్చల్లో పాల్గొంటోంది. ఉద్గారాల్లో యూరప్, అమెరికాను మించనున్నందున దాతల జాబితాలోకి చైనా చేరేలా భారత్ ఒత్తిడి తేవాలి.

వాతావరణం విషయంలో గత ఏడాది ఎన్నో వైపరీత్యాలను చూశాం. ఉత్తర భారతం అసాధారణ వడగాడ్పులతో అట్టుడికింది. పాకిస్తాన్‌లో కనీవినీ ఎరుగని రీతిలో వరదలు జనావాసాలను ముంచెత్తాయి. యూరప్, చైనా కరవును చవిచూశాయి. వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో భాగంగా కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ప్రపంచం ఇప్పటికే చాలా చర్యలు చేపట్టింది. అయినా సరే... గత ఏడాది మానవాళి ఐదు కీలకమైన వైరుధ్యాలను ఎదుర్కొంది. వీటిని తొలగించుకోకుంటే, ప్రకృతి వైపరీత్యాలు ఈ ఏడాదీ మనల్ని పలకరించక మానవు!

వైరుధ్యాల్లో మొట్టమొదటిది 'శిలాజ ఇంధనాలు వర్సెస్ బొగ్గు' అన్న అంశం నుంచి పుట్టుకొచ్చింది. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు భూమి సగటు ఉష్ణోగ్రతలను వీలైనంత తక్కువ పెరిగేలా చూడాల్సిన అవసరముంది. అయితే అభివృద్ధి చెందిన దేశాలు దీన్ని 1.5 డిగ్రీలకు పరిమితం చేయాలని అనుకుంటున్నాయి. ఈ అంశంపై ఇతర దేశాల మధ్య ఏకాభిప్రాయం సాధించే ప్రయత్నం చేస్తున్నాయి. వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి శాస్త్రీయ మదింపు ప్రకారం, ఈ లక్ష్యాన్ని సాధించేందుకు శిలాజ ఇంధనాల వాడకాన్ని గణనీయంగా తగ్గించాల్సి ఉంటుంది. అయితే ఈజిప్టులో గత ఏడాది జరిగిన 27వ కాప్ సమావేశాల్లో పాశ్చాత్య దేశాలు బొగ్గు వాడకం తగ్గిద్దామనే అంశానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో అత్యధికం చమురు, సహజవాయువుల ప్రధాన ఎగుమతిదారులు లేదా ఎక్కువ మోతాదుల్లో వినియోగించేవారు కావడం ఇక్కడ ప్రస్తావనార్హం!

ఇక రెండో వైరుధ్యం గురించి: కాప్–27 సమావేశాల్లో ఇది వ్యక్తమైంది. ఆర్థికాంశాలపై చర్చలో 'లాస్ అండ్ డ్యామేజ్' అంశంలో ఈ వైరుధ్యం ఏమిటన్నది తెలిసింది. వాతావరణ కాలుష్యానికీ, భారీ కర్బన ఉద్గారాలకూ అభివృద్ధి చెందిన దేశాల బాధ్యతే ఎక్కువ. కాబట్టి జరుగుతున్న నష్టాన్ని భర్తీ చేయాల్సిన బాధ్యత కూడా వాటిపైనే ఉంది. కర్బన ఉద్గారాలను తగ్గించుకునేందుకు ఇతర దేశాలు చేస్తున్న ప్రయత్నాలకు తగిన ఆర్థిక వనరులను సమకూర్చాల్సి ఉంది కూడా. ఇందుకోసం ఏటా సుమారు వెయ్యి కోట్ల డాలర్ల అవసరముండగా... ఇప్పటికి సమకూర్చింది పిసరంతే. ఎందుకిలా అన్న ప్రశ్నకు అభివృద్ధి చెందిన దేశాలు విచిత్రమైన వాదన చేస్తున్నాయి. దాతల జాబితాలోకి భారీ ఆర్థిక వ్యవస్థలున్న దేశాల (భారత్, చైనా అని)ను చేర్చాలని డిమాండ్ చేస్తున్నాయి. అకస్మాత్తుగా పుట్టుకొచ్చిన ఈ కొత్త వాదన... ఇప్పటివరకూ నిర్ణయించిన విషయాలకు భిన్నం.

మూడో వైరుధ్యం కాప్–27 తీర్మానం తుది ప్రతిలో 'జస్ట్ ట్రాన్సిషన్', 'జస్ట్ ఎనర్జీ ట్రాన్సిషన్ పార్టనర్‌షిప్' (జేఈటీపీ) అన్న



పదాలను చేర్చడంతో ఉత్పన్నమైంది. ఈ రెండు పదాలూ చూసేందుకు ఒకేలా అనిపిస్తాయి. కానీ వీటి అర్థాలు చాలా భిన్నం. 'జస్ట్ ట్రాన్సిషన్' అనేది సంప్రదాయేతర ఇంధన వనరుల వాడకానికి మళ్లేందుకు ఒక్కో దేశానికి కావాల్సిన అంశాలకు సంబంధించినది కాగా, జేఈటీపీ అనేది అభివృద్ధి చెందిన దేశాల్లో బొగ్గు వాడకాన్ని నిలిపివేసేందుకు జీ7 దేశాలు అమలు చేస్తున్న అజెండాకు సంబంధించిన విషయం. భారత్ సహా, ఇండోనేషియా, దక్షిణాఫ్రికా బొగ్గుపై ఆధారపడ్డ దేశాలు. వీటిని జేఈటీపీలోకి చేర్చేందుకు జీ7 దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఏతావాతా... కాప్–27 తుది తీర్మానంలో జస్ట్ ట్రాన్సిషన్ అనే మాట చేరిక ఆహ్వానించదగ్గదైతే... జేఈటీపీ మాత్రం అనుమానించదగ్గది.

నాలుగో వైరుధ్యం విషయానికి వద్దాం. కార్బన్ మార్కెట్లపై జరిగిన చర్చల్లో ఇది బయటపడింది. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ కార్బన్ మార్కెట్లను (క్యోటో ప్రొటోకాల్‌లో భాగంగా ఏర్పాటైన క్లీన్ డెవలప్‌మెంట్ మెకనిజమ్స్; క్లుప్తంగా 'సీడీఎం') ఆర్థిక వనరులను సమకూర్చుకునే సాధనంగా చూస్తూవచ్చాయి. అభివృద్ధి చెందిన దేశాల దృక్పథం దీనికి పూర్తిగా భిన్నం. తక్కువ ఖర్చుతో కర్బన ఉద్గారాలను తొలగించుకునేందుకు సీడీఎంను వాడుకోవచ్చునని ఈ దేశాలు భావిస్తున్నాయి. క్యోటో ప్రొటోకాల్, ప్యారిస్ అగ్రిమెంట్ల రెండింటిలోనూ కార్బన్ మార్కెట్ల ప్రస్తావన ఉన్నప్పటికీ వాటి సేవధ్యాలు మాత్రం వేర్వేరు. మొదటిదాని ప్రకారం దేశాలకు నిర్దిష్టమైన కర్బన ఉద్గార తగ్గింపు లక్ష్యాలు లేవు. ప్యారిస్ ఒప్పందం ప్రకారం 'నేషనల్లీ డిటర్మైండ్ కంట్రిబ్యూషన్స్' (ఎన్‌డీసీ) ఉన్నాయి. కర్బన ఉద్గారాల తగ్గింపునకు ఆయా దేశాలు చేసే ప్రయత్నాలే ఈ 'ఎన్‌డీసీ'. భారతదేశం క్లైమేట్ ఫైనాన్స్ కోసం ఇతర దేశాలకు కార్బన్ క్రెడిట్స్ అమ్మితే, అవి ఉద్గారాల తగ్గింపు జాబితాలోకి చేరవు. దీనివల్ల మనం ఎన్‌డీసీలో వెనుకబడిపోతాం. కార్బన్ క్రెడిట్స్ అమ్ముకుని వాతావరణ మార్పులను తట్టుకునేందుకు అవసరమైన నిధులు సమకూర్చుకోవడం... ఆయా దేశాలు కర్బన ఉద్గారాలపై ఇచ్చిన మాటను పూర్తి చేసిన తరువాతే సాధ్యమవుతుందన్నమాట.

చిట్టచివరి... ఐదవ వైరుధ్యం గురించి. ఇది భారతదేశం తనకుతాను సమాధానం ఇచ్చుకోవాల్సిన ప్రశ్న. వాతావరణానికి సంబంధించిన రాజకీయాల్లో చైనాతో ఎలా వ్యవహరించాలి? తన ఆర్థిక బలంతో రాజకీయాలు చేస్తున్న చైనా విదేశాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోంది. బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు వీటిల్లో ఒకటి మాత్రమే. ఫలితంగా కర్బన ఉద్గారాలు ఎన్నో రెట్లు ఎక్కువయ్యాయి. మన మంత్రులు ఈ విషయాలను ఇప్పటికే పలుమార్లు ప్రపంచం దృష్టికి తీసుకొచ్చారు. కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్(సీఈఈడబ్ల్యూ) అంచనా ప్రకారం చైనా గత, భవిష్యత్తు ఉద్గారాలు అమెరికా, యూరప్‌లను కూడా మించిపోతాయి (2060 నాటికి శూన్యస్థాయికి తేవాలన్న లక్ష్యంతో చైనా ఉంది). అంటే అమెరికా, యూరప్‌ల మాదిరిగానే చైనాను కూడా అభివృద్ధి చెందిన దేశాల జాబితాలోకి చేర్చాలన్నమాట. కానీ చైనా తనకు అనుకూలంగా ఉండేలా జీ77 + చైనా గ్రూపులో ఉంటూ వాతావరణ చర్చల్లో పాల్గొంటోంది. ఈ విషయంలో భారత్ ఒక స్పష్టత ఏర్పరచుకోవాలి. చైనా పాత్ర ఎలా ఉండాలో కచ్చితంగా చెప్పాల్సి ఉంటుంది.

ఈ ఏడాది భారతదేశం జీ20 సమావేశాల అధ్యక్ష స్థానంలో ఉంది. దీని ఆసరాతోనైనా భారత్ ప్రపంచ వాతావరణ మార్పుల చర్చల్లో అగ్రస్థానాన్ని మరింత పదిలపరచుకోవాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రతినిధిగానూ స్థిరపడాలి. ప్రపంచవ్యాప్తంగా బొగ్గు వాడకం మాత్రమే కాకుండా... అన్ని శిలాజ ఇంధనాలను దశలవారీగా తగ్గించేలా ప్రపంచాన్ని ఒప్పించాలి. శిలాజ ఇంధనాల నుంచి సంప్రదాయేతర ఇంధన వనరుల వాడకం వైపు మళ్లేందుకు కావాల్సిన అంశాల ఆధారంగా జేఈటీపీ ఉండేలా... జీ7 దేశాల పెత్తనం మాదిరిగా కాకుండా చూసుకోవాలి. చైనా అపరిమిత ఉద్గారాల విషయంలో భారత్ విస్పష్టంగా వ్యవహరించాలి. దాతల జాబితాలోకి చైనా కూడా చేరేలా ఒత్తిడి తేవాలి. కార్బన్ మార్కెట్లను అవకాశంగా తీసుకుని మరింత పర్యావరణ హితమైన టెక్నాలజీలను అందరికీ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేయాలి.

ఇప్పటివరకూ ప్రస్తావించిన ఐదు వైరుధ్యాలు పరిష్కారమవుతాయా? లేక అలాగే కొనసాగుతాయా? అన్నది ఇంకోదఫా వాతావరణ మార్పుల చర్చలు జరిగినప్పుడే తెలుస్తుంది. కాకపోతే ఈ ఐదు అంశాలు ప్రపంచం, మరీ ముఖ్యంగా భారతదేశం వాతావరణ మార్పుల విషయంలో ఈ ఏడాది ఎలా వ్యవహరించాలో నిర్దేశిస్తాయనడంలో సందేహం లేదు.

వ్యాసకర్త ఫెలో, 'కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్'
('ద హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల మనసులోని మాటలు తాజాగా ఇలా...!

తగిన గెలుపు



ఎం.ఎం.కీరవాణి, ఎస్.ఎస్.రాజమౌళి, ఆర్ఆర్ఆర్ సినిమా బృందం... మీకు శుభాభినందనలు. మీ అందరి కఠిన శ్రమకు ఇది బహు యోగ్యమైన గెలుపు.

– ఇళయరాజా, సంగీత దర్శకుడు

హోరెత్తిన పాట



ఆర్ఆర్ఆర్ ప్రదర్శన సమయంలో 'నాటు నాటు' పాటకు ప్రేక్షకులు లేచి డ్యాన్స్ చేశారు. రాజమౌళితో పనిచేయడాన్ని ఎన్టీ రామారావు జూనియర్, రామ్‌చరణ్ 'అందమైన హింస'గా అభివర్ణించారు.

– కోర్ట్‌నీ హోవార్డ్, సినీ విమర్శకురాలు

ఇదేనా బెస్ట్?



ఇవ్వాళే మొదటిసారి ఈ 'నాటు నాటు' పాట విన్నాను. అట్టే తెలిసిపోయేంతటి ఒక అతి మామూలు పాటకు మన అత్యుత్తమమైనదిగా తీర్పురావడం అనేది ఎంత విషాదం! (గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ 2023: ఆర్ఆర్ఆర్ సినిమా)

– నిఖిల్ ఇనామ్‌దార్, జర్నలిస్ట్

సమర్థించకూడదు



తాజా పాలు, పూర్ణ గోదుమలకు (హోల్ వీట్) బిస్కెట్లు ప్రత్యామ్నాయం కాగలవని ఒక వ్యాపార ప్రకటనలో అమితాబ్ బచ్చన్ చెబుతున్నారు. తీవ్రంగా ప్రాసెస్ చేసిన జంక్ ఫుడ్‌ను పిల్లలకు మార్కెట్ చేయడాన్నీ, దానికి సెలబ్రిటీల సమర్థననూ ఆపాల్సిన సమయం ఇది.

– సాయంతన్ బేరా, పోషణాంశాల పాత్రికేయుడు

ప్రతి చర్యా విలువైనదే



నీటి నెలవుల్లోకి నిర్లక్ష్యంగా విసిరే ప్లాస్టిక్ జీవరాశికి ఊపిరాడకుండా చేయడమే కాదు, ప్రాణం పోయేలా కూడా చేస్తుంది. 'రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్' (తగ్గించడం, తిరిగి వాడటం, రీసైకిల్ చేయడం) ఒక్క మనిషి చేసినా ఆ చర్య పర్యావరణానికి ఎంతగానో తోడ్పడుతుంది.

– మోహన్ పర్గాయియెన్, ఐఎఫ్ఎస్ అధికారి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇలాంటి స్ఫూర్తి కావాలి

'ప్రజల మనోఫలకాలపై రూపుదిద్దుకున్న వివేకానంద అనే ఆ మహనీయుని చిత్తరువు ఎప్పటికీ చెరిగిపోదు' అన్నారు ఓ రష్యన్ చింతనాశీలి. జీవితంలో సమస్యలనేవి ప్రతీ వ్యక్తికీ ఉండేవే. ఆ వ్యక్తి విద్యార్థి కావచ్చు, కార్మికుడు కావచ్చు, రైతు కావచ్చు, పారిశ్రామికవేత్త కావచ్చు, గృహిణి కావచ్చు, మరెవరైనా కావచ్చు. సమస్యలనేవి సర్వసాధారణమైతే, సమస్యను అవగాహన చేసుకొనే ప్రయత్నం చేయడానికి కావలసిన సామర్థ్యం పెంచుకుంటే సమస్యలు పరిష్కరించడం పెద్ద విశేషం కాదని వివేకానందుడు అన్న మాటలు సదా స్మరణీయం.



స్వామి వివేకానంద

ప్రపంచంలో ఏ గొప్ప వ్యక్తి చెప్పిన వాక్యాలు విన్నా ఆలోచింపజేస్తాయి. కాని స్వామి వివేకానందుడు చెప్పిన అమృత వాక్యాలు మాత్రం యువతను ప్రేరేపించి, ఆచరింపజేస్తున్నాయి.

ఇద్దరు వ్యక్తుల ఆదర్శాలు ఒకేలా ఉండకపోవచ్చు. కాని ఆ ఇద్దరు వ్యక్తులు ఒకే వ్యక్తి ఆదర్శాన్ని స్వీకరించి గొప్ప నేతలుగా ఎదగవచ్చనేది మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్‌లు నిరూపించారు. ఆ ఒక్క వ్యక్తి వివేకానందుడే నని వేరే చెప్పనవసరం లేదు. గాంధీజీ, బోస్‌బాబులు విభిన్న వ్యక్తిత్వాలు, భిన్న ఆదర్శాలు కలిగి ఉన్నవారని చరిత్రకారుల వాదనల సారాంశం. 'నేను స్వామి వివేకానందుడి రచనలు చదవడం ద్వారా నాలో వెయ్యి రెట్లు దేశ భక్తి పెరిగింది' అని గాంధీజీ అంటే... సుభాష్ చంద్రబోస్ 'స్వామి వివేకానందుని రచనలు చదువుతుంటే నా ఒంట్లో రక్తం ఉప్పొంగుతుంది కదా! ఆయనను విన్నవారు ఇంక ఎంత అనుభూతిని పొంది ఉంటారో? ఆయన బ్రతికి ఉన్నట్లయితే పాదాల చెంత కూర్చొని ఆయన ఏమి చెబితే అది చేసేవాణ్ణి' అన్నారు. ఈ మహానేతలు వివేకానందుని మాటలకు ఎంతగా ప్రభావితులు అయ్యారో ఈ మాటలే తెలియజేస్తాయి. ఇవ్వాళ దేశానికి కావలసింది ఇలాంటి ప్రభావ వంతమైన స్ఫూర్తి ప్రదాతలే.

విద్య పట్ల వివేకానందుని అభిప్రాయాలు అత్యున్నతమైనవి. విద్యా వ్యవస్థను ఆయన భావాలకు అనుగుణంగా రూపొందించగలిగితే కాబోయే భారత పౌరులందరూ జాతి రత్నాలుగానే భాసిస్తారు. అప్పుడు తాము పుట్టిన ఊరినే కాదు, దేశాన్నీ, ప్రపంచాన్నీ ఉద్ధరించగల మహానుభావులు ప్రపంచానికి అందుతారు.

– డా॥ నెమలిపురి సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్
(నేడు వివేకానందుని జయంతి, జాతీయ యువజన దినోత్సవం)

జాతీయత కొరవడిన పార్టీ


అభిప్రాయం



కిశోర్ పోరెడ్డి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమర్థ సారథ్యంలో అప్రతిహతంగా పురోగమిస్తున్న భారత్ కీర్తి బావుటా విశ్వ వినీలాకాశంలో ఇప్పుడు మరింత పైఎత్తున ఎగురుతోంది. మొట్ట మొదటి సారిగా జీ–20 అధ్యక్ష హోదా చేపట్టి విశ్వవేదికపై తన సత్తాను భారత్ మరో మారు చాటి చెప్పింది. ఐరోపా యూనియన్ సహా 19 దేశాలు సభ్యులుగా ఉన్న గొప్ప వేదిక ఇది. ప్రపంచ జీడీపీలో 90 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 80 శాతం, ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతులు జీ–20 దేశాలవే. ప్రపంచ ఆర్థిక వ్యవహారాల్లో జీ–20 పాత్ర ఏమిటో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.

ఇతర దేశాల తలరాతను శాసిస్తూ లాభార్జనే ధ్యేయమైన రెండు ఆర్థిక నమూనాలు ఇప్పుడు ప్రపంచంలో కొనసాగుతున్నాయి. ఆధిపత్యం చలాయిస్తూనే తమ ఉత్పత్తులతో విదేశాలను ముంచెత్తే పాశ్చాత్య నమూనా ఒక వైపు, ఆర్థికంగా బలహీనంగా ఉన్న దేశాలకు అప్పుల వలవేసి దివాలా తీయించే చైనా నయా వలసవాద నమూనా మరొక వైపు ఉన్నాయి. దీనికి పూర్తి భిన్నంగా విశ్వ మానవ సౌభ్రాతృత్వ స్ఫూర్తితో భారత్ ముందుకు సాగుతోంది. కోవిడ్ కష్ట కాలంలో ప్రపంచాన్ని భారత్ ఆదుకున్న తీరే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. ఇటువంటి భారత్ జీ–20కి నాయకత్వ స్థానంలో ఉండి చేయగలిగింది ఎంతో ఉంది.



డిసెంబర్ ఒకటో తేదీన జీ–20 అధ్యక్ష హోదా స్వీకరించిన భారత్, వచ్చే 12 నెలల కాలంలో దేశవ్యాప్తంగా 200 పైగా సమావేశాలు నిర్వహించాలని నిశ్చయించింది. అందుకోసం రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులకు డిసెంబర్ 5న ఒక సన్నాహక సమావేశానికి కేంద్రం ఆహ్వానం పలికింది. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, డీఎంకే అధినేత స్టాలిన్ సహా దాదాపు అన్ని పార్టీల అధ్యక్షులు హాజరైన ఆ సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం డుమ్మా కొట్టారు. దేశాన్ని ఉద్ధరిస్తానని 'భారాస'గా పేరుమార్చుకున్న తెరాస అధ్యక్షుడు యావత్ దేశానికి గర్వకారణమైన ఒక కీలక సమావేశాన్ని బహిష్కరించి దేశం పట్ల తన చిత్తశుద్ధిని చాటుకున్నారు.

జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాల విషయంలో ఆ పార్టీ నిబద్ధత ఏ పాటిదో ఆదిలోనే అర్థమయ్యింది. దేశ హితం కన్నా కేవలం స్వార్థ రాజకీయ ప్రయోజనానికే పెద్దపీట వేయడం ఇందుకు కారణం. వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో జరగనున్న జీ–20 దేశాల శిఖరాగ్ర సమావేశానికి వ్యూహాలపై చర్చలు జరిపేందుకు, సూచనలు స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి హాజరుకాని కేసీఆర్, అందుకు కారణాలేమిటో చెప్పగలరా? సొంత లాభాపేక్ష తప్ప తెలంగాణ ప్రజానీకం బాగోగుల గురించి ఆయనకు ఏమాత్రం పట్టింపులేదని దీనివల్ల స్పష్టంగా తెలియడం లేదా? కేంద్ర ప్రభుత్వం ఆయనను ఆహ్వానించినప్పటికీ, సమావేశానికి కావాలనే హాజరు కాకపోవడం... జాతీయ రాజకీయాల్లో కీలక, క్రియాశీలక పాత్ర పోషించాలనుకుంటున్న కేసీఆర్‌కు ఎంత మాత్రం తగని పని. జాతీయ రాజకీయాల్లో రాణించడానికి కావలసిన కలుపుగోలుతనం ఇదేనా? చారిత్రక అవకాశాలను ఇలా చేజేతులా వదిలేసుకోవడం కేసీఆర్‌కు అలవాటైన పనే.

జీ–20 సమావేశాలు రాష్ట్ర ప్రభుత్వాల ముందు అనేక అవకాశాల తలుపులు తెరవబోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వంతో కలిసి తమ రాష్ట్రాల్లో తాజా పెట్టుబడులకు బాటలు వేయడానికి మంచి అవకాశం లభిస్తోంది. తెలంగాణకు చెందిన అనేకమంది సౌదీ అరేబియాలో ప్రవాసం ఉంటున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్‌లో దౌత్య కార్యాలయం ఏర్పాటు చేయాల్సిందిగా సౌదీ అరేబియాను తెలంగాణ ప్రభుత్వం అభ్యర్థించింది. కేంద్ర ప్రభుత్వంతో కలిసి సౌదీ అరేబియా రాజకీయ నాయకత్వంతో చర్చలు జరిపి సానుకూల ఫలితం రాబట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ఈ వేదికను ఉపయోగించుకునే అవకాశం ఉంది. జీ –20 అధ్యక్ష హోదా భారత్‌కు దక్కడంతో ఎంతో స్ఫూర్తి పొందిన సిరిసిల్ల పట్టణానికి చెందిన హరిప్రసాద్, స్వయంగా జీ–20 లోగో నేసి ప్రధానమంత్రికి పంపించారు. హరిప్రసాద్ వంటి వారి నుంచి స్ఫూర్తి పొంది తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ దేశ హితం కోసం కాకపోయినా... రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యానైనా కేంద్రంతో కలిసి ముందడుగు వేస్తారా?

వ్యాసకర్త తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి

గోదాస్తుతి

ధనుర్మాసం (మార్గళి) వచ్చీ రాగానే శ్రీవైష్ణవుల ఇళ్ళల్లో శ్రీఆండాళ్ అని ప్రేమగా పిలుచుకొనే గోదాదేవి కొలువులు భక్తితత్పరతతో ప్రారంభమౌతాయి. గోదాదేవి భూదేవి అవతారం. ఆమె రూపవిలాసంలో భూదేవి, గుణవైభవంలో శ్రీదేవి.

గోదాస్తుతిలోని మొదటి నాలుగు శ్లోకాలలో తీయని పలుకులను (పద మాధుర్యాన్ని) అనుగ్రహించమని దేశికులు ఆమెను వేడుకున్నారు. కరుణ, ఓరిమి అనే రెండు సల్లక్షణాల వల్ల గోదాదేవిని స్తుతించకుండా ఏ భక్తుడూ నిలువలేడు.

స్తుతించటానికి గోదామాత అనుమతి తీసుకొన్న తరువాత ఆమెను మూడం చెలలో దేశికులు స్తుతించారు. భగవానులు రంగనాథునితో ఆమె వివాహం జరగటానికి ముందు ఆమె గుణాలను ఐదవ శ్లోకం నుండి పన్నెండవ శ్లోకం వరకు వర్ణించారు. ఐదవ శ్లోకంలో అప్పటివరకూ గోదా అని పిలిచిన దేశికులు ఆమెను దేవి అని సంబోధిస్తారు. భగవానుని కొరకు ఉద్దేశించిన మాలను తాను ధరించిన భగవతిని వర్ణించినట్లుగా దీనిని పండితులు భావిస్తారు.

'రెండు సూత్రాలు' భగవానుని గోదాదేవి బంధించే గుణాలు. మొదటి సూత్రం ఆమె భగవానుని కొరకు ఉద్దేశించి తాను ధరించిన పూలమాలలో ఒదిగి ఉండే దారం. అది భగవానుని శిరస్సును అలంకరించింది. రెండవది ఆ మాలను కూర్చేటప్పుడు అమ్మ పాడిన మధురమైన 'పాశుర'మాల. ఇది ఆయన హృదయాన్నే అలంకరించింది. ఇందువల్ల అద్భుత ఫలితం ఒనగూడిందని దేశికులు మురిసిపోతారు. 'మానవులు యుగయుగాలుగా పాపాలు చేస్తూనే ఉన్నారు (అపకృతా చిరదీక్షితానామ్). అందుచేత భగవంతుడు వారి వైపు తలతిప్పి చూడటానికి ఇష్టపడటం లేదు. కానీ నీవు ధరించిన పూమాలను స్వీకరించి తాను ధరించగానే, నీవు పాడిన పాశురాలు వినగానే, అమ్మా! ఆయన దృక్కోణం మారింది. మాకు ముక్తి ప్రసాదించారు. ఇది కేవలం నీ సూత్ర నియంత్రణ మాహాత్మ్యమే సుమా!'



ఆరవ శ్లోకం బహు సుందరమైనది. ఇందులో దేశికులు ఎన్నో పవిత్ర నదులను పేర్కొంటారు. ఆయా నదుల విశిష్ట గుణాలను గోదాదేవిలో ఆపాదించి చూపుతారు. ఏడవ శ్లోకంలో వాల్మీకి కవితా మాహాత్మ్యాన్ని వర్ణించారు. ఆ తరువాతి ఎనిమిది శ్లోకాలలో తన తండ్రి పెరియాళ్వారుతో పాటుగా ఇతర ఆళ్వారులపై గోదాదేవి చూపిన ప్రభావాన్ని వర్ణించారు. అటుపై గోదాదేవి, రంగనాథుల వివాహ వైభవ వర్ణన కొనసాగింది. గోదామాత రంగనాథుని భర్తగా వలచినది మొదలు ఆయన శరీర వర్ణాన్నే మార్చివేస్తూ, ఆయనలో లీనమయ్యే వరకు ఆ వర్ణన సాగింది.

– శ్రీదేవి మురళీధర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: బ.పంచమి ప.1.01 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: పుష్య ఉ.11.35 వరకు, తదుపరి ఉత్తర, వర్జ్యం: రా.7.15 నుండి 8.55 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.17 నుండి 11.03 వరకు, తదుపరి ప.2.43 నుండి 3.25 వరకు, అమృతఘడియలు: తె.5.26 నుండి ఉ.7.08 వరకు (తెల్లవారితే శుక్రవారం); రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు: సూర్యోదయం 6.38 : సూర్యాస్తమయం 5.39.

'దళితబంధు'వులను తేల్చేదెలా..!

ఇప్పటికీ వెలువడని దళితబంధు పథకం మార్గదర్శకాలు

- ఎమ్మెల్యేల సిఫార్సుతో ఎంపిక కుదరదని స్పష్టం చేసిన హైకోర్టు
- ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తుకు ప్రతిపాదించిన ఎస్సీ కార్పొరేషన్



సాక్షి, హైదరాబాద్: దళితబంధు పథకం అమలు మార్గదర్శకాలపై సందిగ్ధత వీడలేదు. 2022–23 ఆర్థిక సంవత్సరం చివరి దశకు వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో ఎస్సీ కార్పొరేషన్‌లో అయోమయం నెలకొంది. వీలైనంత త్వరగా మార్గదర్శకాలు జారీ చేయాలని ఇప్పటికే ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వం 2022–23 బడ్జెట్‌లో దళితబంధు పథకానికి రూ.17,700 కోట్లు కేటాయించింది. ఈ లెక్కన ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 1,500 యూనిట్లు చొప్పున మంజూరు చేస్తూ కేటాయింపులు చూపింది. కానీ తొలుత ఒక్కో నియోజకవర్గానికి 500 యూనిట్లు మంజూరు చేయాలంటూ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో లబ్ధిదారుల ఎంపిక చేపట్టేందుకు ఎస్సీ కార్పొరేషన్ చర్యలు మొదలుపెట్టగా న్యాయపరమైన చిక్కులు తలెత్తడంతో ప్రక్రియ నిలిచిపోయింది. లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేల సిఫారసును హైకోర్టు ఆక్షేపించింది. అర్హులైన వారిని ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేయాలని సూచించడంతో లబ్ధిదారుల ఎంపికకు ఇప్పటివరకు అనుసరించిన విధానాన్ని నిలిపివేయాలని స్పష్టం చేసింది.

జాడలేని మార్గదర్శకాలు

ఎమ్మెల్యేల సిఫారసు ద్వారా కాకుండా లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేస్తామని ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు సూచించింది. ఈ క్రమంలో ఎంపిక విధానానికి సంబంధించిన పలు సూచనలను అధికారులు ప్రతిపాదించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ, అర్హతలు, ఎంపిక ప్రక్రియ తదితర అంశాలతో కూడిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించారు. మరోవైపు దళితబంధు అమలుకు ప్రత్యేకంగా యాప్, వెబ్‌పోర్టల్‌ను సైతం అధికారులు రూపొందించారు. పథకం అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిన వెంటనే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయలేదు. ప్రస్తుతం 2022–23 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం కొనసాగుతోంది. మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఆలోగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి నిధులు విడుదల చేయాలి. ఇప్పటికిప్పుడు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ లబ్ధిదారుల ఎంపికకు కనిష్టంగా 2 నెలల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈక్రమంలో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టకుంటే ఈ ఏడాది దళితబంధు లబ్ధిదారుల ఎంపిక కష్టమని అంటున్నారు.

భద్రాద్రి రామాలయంలో త్రిసభ్య కమిటీ విచారణ

- లడ్డూల తయారీ, మిగులును పరిశీలించిన అధికారులు
- నేడూ కొనసాగనున్న విచారణ

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో లడ్డూలు తయారు చేసే వంటశాలలో దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ బుధవారం విచారణ చేపట్టింది. ఆలయంలో ఇటీవల బూజుపట్టిన లడ్డూలను విక్రయించడం, దీనిపై భక్తుల ఆందోళన, భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నీలిమ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కూరాకుల జ్యోతి, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవి, భద్రాచలం ఆర్డీఓ రత్నకల్యాణి ఆలయానికి చేరుకుని లడ్డూ తయారీలో వినియోగించే వస్తువుల నాణ్యతను పరిశీలించారు. లడ్డూ బరువు, విక్రయాల తీరుతో పాటు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ముక్కోటి ఉత్సవాల సందర్భంగా తయారు చేసిన లడ్డూలెన్ని? ఎన్ని విక్రయించారు? ఎన్ని లడ్డూలు మిగిలాయి? వంటి అంశాలను ఈఓ శివాజీ, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాలపరిమితి ముగిసిన లడ్డూలను భక్తులకు విక్రయించారా, పక్కన పెట్టారా అని సిబ్బందిని ప్రశ్నించారు. కాగా, విచారణపై కూరాకుల జ్యోతిని వివరణ కోరగా...స్వామి వారి లడ్డూ ప్రసాదాల విక్రయాల్లో నెలకొన్న వివాదంపై ఉన్నతాధికారుల ఆదేశం మేరకు విచారణ చేస్తున్నామని, గురువారం కూడా కొనసాగుతుందని, అనంతరం నివేదికను కమిషనర్‌కు అందజేస్తామని వెల్లడించారు.



కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు



జగిత్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

రైతుల ఆందోళన ఉధృతం

- కామారెడ్డి, జగిత్యాల మున్సిపల్ కార్యాలయాల ఎదుట ఆందోళన
- మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని డిమాండ్. న్యాయం జరిగేదాకా పోరు ఆపేది లేదని వెల్లడి
- మద్దతు తెలిపిన బీజేపీ, కాంగ్రెస్

సాక్షి, జగిత్యాల/కామారెడ్డి: మున్సిపల్ అధికారులు ఇటీవల విడుదల చేసిన మాస్టర్‌ప్లాన్‌పై ఎక్కడికక్కడ రైతుల ఆందోళనలు మిన్నంటుతున్నాయి. మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల, కామారెడ్డి మున్సిపల్ కార్యాలయాల ఎదుట బుధవారం రైతులు ఆందోళనలకు దిగారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కె.వెంకటరమణారెడ్డి నేతృత్వంలో కామారెడ్డి మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న రైతులు అక్కడే బైఠాయించారు. రైతుల ఆందోళన నేపథ్యంలో భారీ ఎత్తున అక్కడ పోలీసులను మోహరించారు. పోలీసులు ఎవ్వరినీ మున్సిపల్ కార్యాలయం లోపలికి అనుమతించలేదు. పోలీసులు ముందుగానే వివిధ గ్రామాల్లో పలువురు బీజేపీ, రైతు నాయకులను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కొద్దిసేపటి తర్వాత వదిలిపెట్టారు. అనంతరం రమణారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ...పంట భూములను పారిశ్రామిక జోన్, హరిత జోన్‌లుగా చూపడాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. రైతులు చేస్తున్న ఉద్యమం న్యాయమైందని, దీనికి అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తుందని తెలిపారు. రైతులను కనీసం సంప్రదించకుండా వారి భూములను గుంజుకుంటామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కొందరు నాయకులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చేందుకే రైతుల భూములను లాక్కునేందుకు రోడ్లపేరుతో కుట్రపన్నారని ఆరోపించారు. కొత్త మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేసేంతవరకూ ఆందోళనను విరమించేది లేదని తేల్చిచెప్పారు. కాగా, రైతు ఆందోళనలో అటు బీజేపీనేతలతోపాటు ఇటు కాంగ్రెస్ పార్టీనేతలు కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి సుభాష్‌రెడ్డి, ముఖ్య నాయకులు పాల్గొని వారికి మద్దతు తెలిపారు. అదేవిధంగా కామారెడ్డి న్యాయవాద జేఏసీ ప్రతినిధులు జి.జగన్నాథం, క్యాతం సిద్దరాములు, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొని ఈ ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

జగిత్యాలలోనూ..

మాస్టర్‌ప్లాన్‌కు వ్యతిరేకంగా జగిత్యాలలో కూడా రైతులు కూడా ఆందోళన నిర్వహించారు. జగిత్యాల సమీపంలోని హస్నాబాద్, నర్సింగాపూర్, అంబారిపేట, లింగంపేట, తిప్పన్నపేట తదితర గ్రామాలకు చెందిన రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు బుధవారం భారీగా జిల్లా కేంద్రానికి చేరుకుని తొలుత తహసీల్, ఇందిరాగాంధీ చౌరస్తాల్లోనూ, అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని అక్కడ ఆందోళన చేశారు. అయితే, పరిస్థితి చేయి దాటిపోతోందని భావించిన జగిత్యాల డీఎస్పీ ప్రకాశ్..తన సిబ్బందితో రంగంలోకి దిగి ఆందోళనకారులతో మాట్లాడి నిరసన కార్యక్రమాలను విరమింపజేశారు.

మాస్టర్ ప్లాన్‌పై ఇప్పటికిప్పుడు ఏమీ కాదు

'కామారెడ్డి' కేసులో స్పష్టం చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి టౌన్ ప్లానింగ్ విషయంలో ఇప్పటికిప్పుడు ఏమీ కాదని హైకోర్టు స్పష్టంచేసింది. హైదరాబాద్, వరంగల్ మాస్టర్ ప్లాన్ విషయంలో ఏళ్ల తరబడి ఊగిసలాట కొనసాగుతోందని.. అనుకున్నవి అనుకున్నట్లు జరిగితే దేశం ఎప్పుడో బాగుపడేదని అభిప్రాయపడింది. కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌పై దాఖలైన కేసులో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మాస్టర్ ప్లాన్‌పై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. మాస్టర్ ప్లాన్‌ను వ్యతిరేకిస్తూ 2వ వార్డు రామేశ్వరపల్లికి చెందిన 40 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. తమను సంప్రదించకుండానే భూములను రిక్రియేషన్ జోన్‌గా ప్రకటించారని, తమకు న్యాయం చేయాలని దాఖలుచేసిన రిట్ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. కాగా, మాస్టర్‌ప్లాన్‌పై ప్రజల నుంచి అభ్యంతరాలు తీసుకుంటున్నామని అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ తెలిపారు. తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేశారు.

సకాలంలో నాణ్యమైన వైద్యం అందాలి

- ఆసుపత్రుల్లో వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండాలి
- టీచింగ్ ఆసుపత్రుల పనితీరుపై సమీక్షలో మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: వైద్య రంగానికి కావాల్సిన ప్రతీది ప్రభుత్వం సమకూర్చుతుందని, ప్రజలకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందేలా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ మార్గనిర్దేశనంలో తెలంగాణ వైద్యారోగ్య రంగం దేశంలో మూడో స్థానానికి చేరుకుందని, మొదటి స్థానం కోసం పోటీపడాలని చెప్పారు. హరీశ్‌రావు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీచింగ్ ఆసుపత్రుల పనితీరుపై అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. త్వరలో 1,147 అసిస్టెంట్ ప్రొఫెసర్స్, మెడికల్ కాలేజీల్లో 201 ట్యూటర్ల పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో స్పెషాలిటీ సేవలు అందాలన్న లక్ష్యం కోసం వీరిని ఎక్కువగా జిల్లాలకు కేటాయించామన్నారు. ఆసుపత్రుల్లో వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండాలని, రోగులు ఏ సమయంలో వచ్చినా చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. రోగులను అవసరమైతే తప్ప రెఫరల్ ఆసుపత్రులకు పంపకూడదన్నారు.

బ్రెయిన్ డెడ్ డిక్లరేషన్ జరిగే దిశగా ప్రయత్నం

టీచింగ్ ఆసుపత్రుల్లో బ్రెయిన్ డెడ్ డిక్లరేషన్ జరిగే దిశగా ప్రయత్నాలు చేయాలని హరీశ్‌రావు చెప్పారు. డిశ్చార్జ్ అయిన పేషెంట్లకు ఉచితంగా మందులు ఇచ్చి పంపాలని, ఈ విషయం పేషెంట్లకు తెలిసేలా బోర్డ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన ఆసుపత్రుల్లో రాత్రి వేళల్లో పోస్టుమార్టం జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 56 టిఫా స్కానర్లను అందుబాటులోకి తెచ్చామని, అన్ని వైద్య పరికరాలు పనిచేసేలా చూసుకోవాలని ఆదేశించారు. గర్భిణులకు నిరంతరం సేవలు అందాలని, కొత్త మెనూ ప్రకారం డైట్ అందుతోందా అన్నది నిత్యం చెక్ చేయాలన్నారు. ఈ సమీక్షలో ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, కుటుంబ సంక్షేమ కమిషనర్ శ్వేతా మహంతి, డీఎంఈ రమేష్‌రెడ్డి, డీపీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బస్సు, లారీ ఢీ

- ఏపీకి చెందిన లారీ డ్రైవర్ మృతి
- బస్సు ఇంట్లోకి దూసుకెళ్లడంతో ఇద్దరికి గాయాలు



ఇంట్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

వైరా రూరల్/ బోనకల్: ఎదురెదురుగా వస్తున్న లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందగా, బస్సు అదుపుతప్పి ఓ ఇంటి పైకి దూసుకెళ్లడంతో బస్సు డ్రైవర్, ప్రయాణికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని పాలడుగు – బోనకల్ మండలం సీతానగరం మధ్య ఈ ఘటన చోటు చేసుకుంది. బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి 15 మంది ప్రయాణికులతో మధిర వెళ్తున్న మధిర డిపోకు చెందిన సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు, మధిర నుంచి వైరా వైపు వస్తున్న లారీ పాలడుగు సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏపీలోని గోకవరానికి చెందిన లారీ డ్రైవర్ జట్ల శ్రీనివాస్‌యాదవ్ (40) లారీ క్యాబిన్‌లోనే ఇరుక్కుని మరణించాడు. బస్సు అదుపు తప్పి పాలడుగులోని కొత్తపల్లి నాగేశ్వరరావు ఇంట్లోకి దూసుకెళ్లడంతో చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన బస్సు డ్రైవర్ బి.తిరుమలేసు, ప్రయాణికుడు వేమిరెడ్డి భరత్ బస్సు క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్రంగా గాయపడ్డారు. బస్సు దూసుకెళ్లడంతో ఆ ఇల్లు పూర్తిగా కూలిపోయే స్థితికి చేరింది. వైరా, బోనకల్ ఎస్‌ఐలు శాఖమూరి వీరప్రసాద్, కవిత ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

తల్లీబిడ్డా మృతిపై హైకోర్టు సీరియస్

వివరాలు ఇవ్వాలని అధికారులకు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లాలో వైద్యం అందక తల్లీబిడ్డా మృతిచెందిన ఘటనపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఘటన పూర్తి వివరాలు అందజేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీలతో కూడిన ధర్మాసనం బుధవారం అధికారులకు నోటీసులు జారీ చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం వంకేశ్వరం గ్రామానికి చెందిన స్వర్ణకు గత నెల 26 రాత్రి 8:30 గంటల సమయంలో పురిటినొప్పులు రావడంతో ప్రైవేటు వాహనంలో ఆమెను పదర పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ కిందిస్థాయి సిబ్బంది మాత్రమే ఉండటంతో భయపడిన కుటుంబ సభ్యులు... అమ్రాబాద్ పీహెచ్‌సీకి తరలించారు. అయితే అక్కడ కూడా వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో అచ్చంపేట ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడికి చేరుకునే సరికి అర్ధరాత్రి 2.30 గంటలైంది. 3.30 గంటలకు వైద్యులు సాధారణ ప్రసవం చేశారు. కాసేపటికే తల్లి శిశువు మృతి చెందారు. దీనిపై పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది.

చైనా మాంజా రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేస్తాం

అటవీశాఖ హెచ్చరిక

- కొనుగోలు, నిలువ, రవాణాపై సమాచారం అందించాలంటూ టోల్‌ఫ్రీ నంబర్లు ఇచ్చిన అటవీ శాఖ

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి సందర్భంగా చైనా మాంజా రవాణా చేస్తే ఆ వాహనాలను సీజ్ చేస్తామని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. ఈ పండుగ సీజన్‌లో నిఘా కోసం ప్రత్యేకంగా ఐదు టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ పండుగ సందర్భంగా ఎగురవేసే..పతంగుల వల్ల పర్యావరణం, పక్షులకు హాని జరగకుండా చూడాలని అటవీ శాఖ కోరింది. పతంగులతో పాటు పక్షులనూ ఎగరనిద్దాం అనే నినాదంతో పండుగ జరుపుకోవాలని పిలుపునిచ్చింది. నైలాన్, సింథటిక్ మాంజా (చైనీస్ మాంజా) వాడకం వల్ల అనర్థాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని బుధవారం ఓ ప్రకటనలో కోరింది. పతంగులను ఎగురవేసేందుకు ఉపయోగించే చైనీస్ మాంజా (చైనా దారం)వల్ల తీవ్ర అనర్థాలు జరుగుతున్నందున కేంద్ర పర్యావరణ చట్ట ప్రకారం చైనీస్ మాంజా వినియోగాన్ని నిషేధించినట్లు అటవీ శాఖ తెలిపింది.

అమ్మినా ఐదేళ్ల జైలు

ఈ పండుగ సీజన్‌లో దేశవ్యాప్తంగా జరిగే సంఘటనల్లో చైనీస్ మాంజా బారినపడి మరణాలు నమోదవుతున్న విషయాన్ని అధికారులు గుర్తు చేశారు. పోలీసులతో పాటు ఇతర శాఖల సమన్వయంతో మాంజా వాడకాన్ని అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చైనా మాంజా అమ్మినా, నిల్వ, రవాణా చేసినా ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష దాకా జరిమానా ఉంటుందని, మాంజా వినియోగంతో మనుషులకు, పక్షులకు హాని జరిగితే 3 నుంచి 7 ఏళ్ల దాకా జైలు శిక్ష రూ.10 వేల జరిమానా విధిస్తామని చెప్పారు. కొన్నేళ్లుగా రూ.28 లక్షల విలువైన 1,391 కిలోల దాకా చైనీస్ మాంజా సీజ్ చేశామని అధికారులు తెలిపారు. చైనా దారం అమ్మకం, నిలువ, రవాణా గురించి వివరాలు తెలిస్తే అటవీ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు 040 – 23231440, 1800 4255 364 తెలియజేయాలని కోరారు.

మొదలైన ఉచిత బియ్యం పంపిణీ

సాఫ్ట్‌వేర్‌లో సవరణల వల్లనే రేషన్ పంపిణీలో జాప్యం

- అదనపు బియ్యం కోటా సవరణల భాగంగానే మార్చి వరకు ఐదు కిలోల ఉచిత బియ్యం
- ఏప్రిల్ నుంచి యథాతథంగా 6 కిలోలు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్



సాక్షి, హైదరాబాద్: చౌకధరల దుకాణాల ద్వారా ఈనెల బియ్యం పంపిణీ బుధవారం నుంచి ఆరంభించినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. గతంలో ఉచిత బియ్యం పంపిణీ కింద ప్రతి యూనిట్‌కు అదనంగా ఇచ్చిన 3 కిలోల బియ్యంను సర్దుబాటు చేస్తూ మార్చి వరకు ఒక్కొక్కరికి 5 కిలోల బియ్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ నుంచి రాష్ట్రంలోని కార్డులకు యథాతథంగా తలసరి 6 కిలోల చొప్పున పంపిణీ చేయనున్నట్లు ఒక ప్రకటనలో వివరించారు.

బియ్యం పంపిణీకి వినియోగించే ఈపోస్ సాఫ్ట్‌వేర్‌లో స్వల్ప సవరణల కారణంగా రేషన్ పంపిణీలో కొంత ఆలస్యం జరిగిందని, పండుగ లోపు ప్రతి కార్డు దారుడికి బియ్యం పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. గత డిసెంబర్ వరకు కేంద్రం ఇచ్చిన ఐదు కిలోల బియ్యానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 5 కిలోలు కలిపి పది కిలోలను ఉచితంగా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ జనవరి నుంచి కేంద్ర నిర్ణయం ప్రకారం ప్రతి ఒక్కరికీ 5 కిలోల చొప్పున ఇవ్వడానికి సాఫ్ట్‌వేర్ మాడిఫికేషన్ చేయాల్సి వచ్చిందని తెలిపారు. గతంలో పీఎంజీకేఏవై కింద 2022 డిసెంబర్ వరకు 20 నెలల కాలానికి ఒక్కో యూనిట్‌కు 200 కేజీలకు బదులు 203 కేజీలు అదనంగా ఇచ్చినట్లు తెలిపారు. తద్వారా 2021 మే, 2022 మే, జూన్ మాసాలలో రాష్ట్రం అదనంగా పంపిణీ చేసిన ఒక్కో కిలోని సర్దుబాటు చేయడంతో భాగంగా మార్చి వరకు ఒక్కో యూనిట్‌కు ఐదు కిలోలు ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి గంగుల తెలిపారు. ఏప్రిల్ నుంచి యథాతథంగా ఒక్కో యూనిట్‌కు 6కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వివరించారు. రాష్ట్రం స్థిరంగా అందజేసే ఒక్కో యూనిట్‌కు 6కిలోలను కుటుంబ సభ్యుల పరిమితితో సంబంధం లేకుండా కోటా ప్రకారమే పంపిణీ చేస్తున్నామని మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు.

బీజేపీ నేతల మాటలు హాస్యాస్పదం

ఓ వైపు పెట్రో ధరలను భారీగా పెంచి కేంద్రం పేదల నడ్డి విరుస్తుండగా, బీజేపీ నేతలు ఉచిత బియ్యంపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని గంగుల విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో కేవలం 54 లక్షల 48 వేల కార్డులకు మాత్రమే 5కిలోల చొప్పున బియ్యం అందిస్తుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ రూ. వందల కోట్ల భారం భరిస్తూ మరో 35 లక్షల కార్డులలోని 92 లక్షల మందికి 6 కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

2.49 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.564.08 కోట్లు

సాక్షి, హైదరాబాద్: రైతుబంధు నిధుల జమ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం 2.49 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.564.08 కోట్లు జమ చేశామని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. ఈ నిధులు 11.28 లక్షల ఎకరాలకు సంబంధించిన రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు 59.08 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.5318.73 కోట్లు జమ చేసినట్టు వివరించారు.

ముగ్గురు జవాన్ల దుర్మరణం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో కుప్వారా జిల్లాలోని నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ) వద్ద మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. మాచిల్ సెక్టార్‌లో పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ముగ్గురు సైనికులు నాయబ్ సుబేదార్ పరిశోత్తమ్ కుమార్, హవల్దార్ అమ్రిక్ సింగ్, సిపాయి అమిత్ శర్మ ప్రమాదవశాత్తూ లోయలో పడిపోయారు. ఈ దుర్ఘటనలో ముగ్గురూ మృతిచెందారని ఉన్నతాధికారులు బుధవారం వెల్లడించారు. మృతుల్లో ఒక జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్(జేసీఓ) కూడా ఉన్నాడని తెలియజేశారు. మృతదేహాలను వెలికి తీస్తున్నట్లు ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

క్లుప్తంగా..

పారిస్ రైల్వే స్టేషన్లో బ్లేడు దాడి

పారిస్: ఫ్రాన్స్‌లోని పారిస్ రైల్వే స్టేషన్‌లో ఓ దుండగుడు బ్లేడుతో దాడులకు తెగబడ్డాడు. ఈ దాడిలో ఒక పోలీసు అధికారి సహా ఆరుగురికి గాయాలయ్యాయి. ఉదయం 6.43 గంటల ప్రాంతంలో బాగా రద్దీగా ఉండే గారె డు నార్డ్ రైల్వే స్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. దీంతో రంగంలోకి దిగి పోలీసులు దుండగుడ్ని అదుపు చెయ్యడానికి అతనిపై కాల్పులు జరిపారు. ప్రస్తుతం అతను ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని పోలీసు అధికారి గెరాల్డ్ డార్మానిన్ తెలిపారు. బ్లేడుతో దాడి జరిగిన సమయంలో పోలీసు అధికారి బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించడంతో అతను అతి పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నారని చెప్పారు. బాధితుల్లో ఒకరి మెడకి తీవ్రంగా గాయం కావడంతో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. దుండగుడు ఈ దాడికి ఎందుకు తెగబడ్డాడో కారణాలు మాత్రం తెలియలేదు.

మూడు రాష్ట్రాలు, 50 ప్రాంతాలు.. ఎఫ్‌సీఐ ఆఫీసుల్లో సోదాలు



న్యూఢిల్లీ: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో అవినీతి ఆరోపణలపై పంజాబ్, హరియాణా, ఢిల్లీల్లోని 50 ప్రాంతాల్లో సీబీఐ బుధవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించింది.లో డీజీఎం ర్యాంకు అధికారిని అరెస్ట్ చేసింది. టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల దాకా 74 మందిని నిందితులుగా ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. రైస్ మిల్లు యజమానులు, దళారీలు, అధికారులు సిండికేట్‌గా ఏర్పడి చేస్తున్న అవినీతిపై సీబీఐ ఆర్నెల్లుగా అండర్ కవర్ ఆపరేషన్ నిర్వహిస్తోంది. రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎఫ్‌సీఐ డిప్యూటీ జీఎం రాజీవ్ కుమార్ మిశ్రాను అరెస్ట్ చేసినట్టు తెలిపింది.

లఖీంపూర్ ఖేరి కేసు విచారణకు ఐదేళ్లు పడుతుంది: సెషన్స్ కోర్టు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో అమాయకులైన రైతులు సహా ఎనిమిది మంది ప్రాణాలను బలిగొన్న లఖింపూర్ ఖేరి హింసా కాండ కేసు విచారణ పూర్తి కావడానికి అయిదేళ్లు పడుతుందని సుప్రీంకోర్టుకు బుధవారం సెషన్స్ కోర్టు విన్నవించింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా నిందితుడిగా ఉన్న ఈ కేసులో 208 మంది సాక్షులు, 171 డాక్యుమెంట్లు, 27 ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరెటరీ (ఎఫ్ఎస్ఎల్) నివేదికలు ఉన్నాయని సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సుప్రీంకోర్టుకి తెలిపారు. ఈ కేసు విచారణ పూర్తి కావడానికి ఎన్ని రోజులు పడుతుందని గత నెలలో సుప్రీం అడిగిన ప్రశ్నకు సెషన్స్ కోర్టు ఒక నివేదికను సుప్రీంకు సమర్పించింది.

అధికారంలోకి వస్తే 200 యూనిట్ల ఉచిత విద్యుత్

కర్ణాటకలో కాంగ్రెస్ తొలి ఎన్నికల హామీ

చిక్కోడి(కర్ణాటక): కర్ణాటకలో అధికారంలోకొస్తే గృహాలకు 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్ అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. మేలో అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో బుధవారం ప్రజాధ్వని పేరిట బస్సు యాత్ర ప్రారంభించింది. ఈ సందర్భంగా గృహ జ్యోతి యోజన పథకాన్ని పీసీసీ చీఫ్ డి.కె. శివకుమార్ ప్రకటించారు. "ఇది మా హామీల్లో మొదటిది. కాంగ్రెస్ అధికారంలోకొస్తే రాష్ట్రంలో ఇళ్లన్నీ విద్యుత్ వెలుగులతో నిండుతాయి" అన్నారు.

సేంద్రియ ఉత్పత్తుల కోసం 3 కొత్త మల్టీ స్టేట్ సొసైటీలు

న్యూఢిల్లీ: సేంద్రియ విత్తనాలు, ఉత్పత్తుల ఎగుమతుల ప్రచారం కోసం జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మల్టీ స్టేట్ కోపరేటివ్ సొసైటీస్ (ఎంఎస్‌సీఎస్) చట్టం, 2002 కింద జాతీయ స్థాయిలో సహకార సేంద్రియ సంఘం, సహకార విత్తన సంఘం, సహకార ఎగుమతుల సంఘాలను రిజిస్టర్ చేయనుంది. ఈ మేరకు బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ అఫైర్స్ (సీసీఈఏ)లో నిర్ణయం తీసుకున్నారు. సహకార్ సే సమృద్ధి అన్న విజన్‌తో తాము ఈ నిర్ణయాలు తీసుకున్నట్లుగా మోదీ ఒక ట్వీట్‌లో వెల్లడించారు. దేశాన్ని ఆర్థికంగా పరిపుష్టం చేయడానికి, గ్రామీణాభివృద్ధిని పరుగులు పెట్టించడానికి సహకార సంఘాల పాత్ర అత్యంత కీలకమైనదని మోదీ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. కేబినెట్ నిర్ణయాలను విలేకరులకు వెల్లడించిన కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్, గ్రామీణ భారతంలో సహకార సంఘాలు అత్యంత ముఖ్యమన్నారు. 35 ఏళ్ల తర్వాత మల్టీ కోపరేటివ్ సొసైటీల ఏర్పాటు జరగడం అత్యంత కీలకమైన నిర్ణయమని చెప్పారు.

చిక్కుల్లో బైడెన్



అయన ఆఫీసులో రహస్య పత్రాలపై దుమారం

- దేశద్రోహమంటూ దుమ్మెత్తిపోస్తున్న ప్రత్యర్థులు
- నాకేం తెలియదు, పూర్తిగా సహకరిస్తున్నా: బైడెన్
- క్రిమినల్ విచారణపై త్వరలో ఏజీ నిర్ణయం

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చిక్కుల్లో పడ్డారు. ఆయన కార్యాలయంలో రహస్య పత్రాలు బయటపడ్డ ఉదంతం క్రమంగా చినికి చినికి గాలివానగా మారుతోంది. ఆ పత్రాల్లో బ్రిటన్, ఉక్రెయిన్, ఇరాన్‌లకు సంబంధించిన పలు సున్నితమైన అంశాలున్నట్టు వస్తున్న వార్తలు మరింత దుమారానికి దారి తీస్తున్నాయి. బరాక్ ఒబామా హయాంలో బైడెన్ ఉపాధ్యక్షునిగా ఉన్నప్పటి సదరు పత్రాలు ఆయన పదవి నుంచి తప్పుకున్నాక ఉపయోగించిన ప్రైవేట్ కార్యాలయంలో గత నవంబర్లో బయటపడ్డాయి. ఈ అంశం సోమవారం వెలుగులోకి వచ్చింది. వాటి ఉనికిని కనిపెట్టింది బైడెన్ తరఫు లాయర్లేనని, వెంటనే వారు నేషనల్ ఆర్కైవ్స్‌కు సమాచారమిచ్చారని ఆయన వర్గం సమర్థించుకున్నా విపక్షాలు ఇప్పటికే దీనిపై దుమ్మెత్తిపోస్తున్నాయి. 2022 ఆగస్టులో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నివాసంలోనూ ఇలాగే భారీ సంఖ్యలో రహస్య పత్రాలను నేషనల్ ఆర్కైవ్స్ స్వాధీనం చేసుకోవడం తెలిసిందే. ఈ విషయమై ట్రంప్‌పై దర్యాప్తు, క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ కూడా జరుగుతున్నాయి. అదే కోవలో బైడెన్ కూడా విచారణ ఎదుర్కొక తప్పదంటున్నారు. దీనిపై అటార్నీ జనరల్ మెరిక్ గార్లండ్‌కు ఇప్పటికే ప్రాథమిక నివేదిక అందింది. నేషనల్ ఆర్కైవ్స్, రికార్డ్స్ అడ్మినిస్ట్రేషన్ ఈ విషయాన్ని తనకు నివేదించగానే దీనిపై విచారణ బాధ్యతలను షికాగో అటార్నీ జాన్ లాష్ జూనియర్‌కు గార్లండ్ అప్పగించారు. ఆయన నుంచి ఇప్పటికే అన్ని వివరాలూ తెప్పించుకున్నారు. బైడెన్‌పై పూర్తిస్థాయి నేర విచారణ ప్రారంభించాలా, వద్దా అన్న కీలక అంశంపై గార్లండ్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ట్రంప్ రహస్య డాక్యుమెంట్లకు సంబంధించి ఆయన ఫ్లోరిడా ఎస్టేట్‌లో ఎఫ్‌బీఐ సోదాలతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది గార్లండే కావడం విశేషం! అధ్యక్షుల నిజాయితీకి అత్యంత ప్రాధాన్యమివ్వడమే గాక వారి ప్రవర్తన విషయంలో అత్యంత పట్టింపుగా ఉండే అమెరికాలో చివరికిది బైడెన్ పదవికి ఎసరు పెడుతుందా అన్నది చూడాలి.

ఏం జరిగింది?

బైడెన్ వద్ద పలు రహస్య పత్రాలు బయట పడ్డట్టు సోమవారం అమెరికా మీడియాలో వార్తలొచ్చాయి. దాంతో వైట్‌హౌస్ దీనిపై అధికారిక ప్రకటన చేసింది. 2022 నవంబర్ 2న వాషింగ్టన్ డీసీలోని పెన్ బైడెన్ సెంటర్లో ఉన్న బైడెన్ ప్రైవేట్ కార్యాలయాన్ని ఖాళీ చేస్తున్న సందర్భంగా అందులో పలు రహస్య పత్రాలను ఆయన లాయర్లు కనుగొన్నట్టు పేర్కొంది. అవన్నీ ఒబామా అధ్యక్షునిగా, బైడెన్ ఉపాధ్యక్షునిగా ఉన్నప్పటివని, అంటే 2013–16 నాటివని చెబుతున్నారు. ప్రెసిడెన్షియల్ రికార్డ్స్ యాక్ట్ పరిధిలోకి వచ్చే పలు పత్రాలు కూడా వీటిలో ఉన్నాయి! అవి రహస్య పత్రాలని తెలియగానే తన లాయర్లు వెంటనే నేషనల్ ఆర్కైవ్స్‌కు సమాచారమిచ్చి వాటిని అప్పగించారని బైడెన్ చెప్పుకొచ్చారు. ఉపాధ్యక్షునిగా పదవీకాలం ముగిశాక 2017 నుంచి మూడేళ్లపాటు ఆయన ఈ కార్యాలయాన్ని వాడుకున్నారు.

ఆ పత్రాల్లో ఏముంది?

బైడెన్ ఆఫీసులో దొరికినవి మామూలు రహస్య పత్రాలేనంటూ తొలుత వార్తలు వచ్చాయి. అయితే వాటిలో బ్రిటన్, ఇరాన్, ఉక్రెయిన్‌లకు సంబంధించి అమెరికా నిఘా వర్గాలు సేకరించిన అత్యంత రహస్య సమాచారం ఉందని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ సీఎన్ఎన్ తదితర వార్తా సంస్థలు తాజాగా వెల్లడించడం సంచలనం రేపుతోంది.

కావాలనే ఆలస్యంగా బయట పెట్టారా?

రహస్య పత్రాలు ప్రైవేట్ కార్యాలయంలో దొరకడం ఒక ఎత్తైతే, దాన్ని ఇంతకాలం దాచి ఉంచడం బైడెన్‌కు మరింత ఇబ్బందికరంగా మారేలా కన్పిస్తోంది. 2022 నవంబర్ 2న ఈ పత్రాలు వెలుగు చూసినప్పటికి అమెరికాలో కీలకమైన మధ్యంతర ఎన్నికలు మరో వారంలోపే ఉన్నాయి. పత్రాల విషయం అప్పుడే బయటికొస్తే ఆ ఎన్నికల్లో డెమొక్రాట్లకు పెద్ద ఎదురుదెబ్బ తగిలేది. అందుకే దీన్ని దాచి ఉంచినట్టు తేలితే బైడెన్‌కు మరింత తలనొప్పిగా మారడం ఖాయం. మధ్యంతరంలో ప్రతినిధుల సభలో విపక్ష రిపబ్లికన్లకు స్వల్ప మెజారిటీ లభించడం తెలిసిందే.

రాజకీయ వేడి

బైడెన్ కార్యాలయంలో రహస్య పత్రాలు దొరకడం అధికార డెమొక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య దుమారానికి దారి తీస్తోంది. ట్రంప్ ఎస్టేట్ మాదిరిగా బైడెన్ ఇల్లు, కార్యాలయాల్లో ఎఫ్‌బీఐ ఎప్పుడు సోదాలు చేస్తుందంటూ రిపబ్లికన్ నేతలు ప్రశ్నాస్త్రాలు సంధిస్తున్నారు. ట్రంప్ అయితే మరో అడుగు ముందుకేసి, రహస్య పత్రాలను కాపాడలేకపోయినందుకు వైట్‌హౌస్‌లో కూడా ఎఫ్‌బీఐ సోదాలు చేయాలన్నారు! ప్రతినిధుల సభలో రహస్య పత్రాల వ్యవహారాలను చూసే శక్తిమంతమైన ఓవర్‌సైట్ కమిటీ సారథి అయిన రిపబ్లికన్ సభ్యుడు జేమ్స్ కోమర్ ఇప్పటికే దీనిపై పూర్తి సమాచారమివ్వాలంటూ నేషనల్ ఆర్కైవ్స్‌కు, వైట్‌హౌస్ కౌన్సెల్ కార్యాలయానికి లేఖలు రాశారు. – సాక్షి, నేషనల్ డెస్క్

ట్రంప్ పత్రాల గొడవ

ట్రంప్ అమెరికా అధ్యక్షునిగా తప్పుకున్నాక పలు రహస్య పత్రాలను వైట్‌హౌస్ నుంచి తన ఫ్లోరిడా ఎస్టేట్‌కు తీసుకెళ్లారన్న వార్తలు సంచలనం సృష్టించాయి. 2022 ఆగస్టులో ఆయన ఎస్టేట్లో ఎఫ్‌బీఐ సోదాల్లో వందలాది డాక్యుమెంట్లు దొరికాయి. తనకేమీ తెలియదని, ఇదంతా రాజకీయ కుట్ర సాధింపని ట్రంప్ ఎదురు దాడికి దిగారు. దొరికినవన్నీ తన వ్యక్తిగత పత్రాలేనంటూ బుకాయించారు. దీనిపై ఇప్పటికే ఆయనపై సివిల్, క్రిమినల్ విచారణలు జరుగుతున్నాయి. మొత్తం 3,000కు పైగా డాక్యుమెంట్లను వైట్‌హౌస్ నుంచి తరలించినట్టు ట్రంప్‌పై అభియోగాలు నమోదయ్యాయి.



నాకు తెలియదు: బైడెన్


వాషింగ్టన్: తన కార్యాలయంలో రహస్య పత్రాలు బయటపడ్డట్టు తెలిసి ఆశ్చర్యపోయానని బైడెన్ అన్నారు. 'ఆ పత్రాల గురించి, ఉపాధ్యక్షునిగా నేను తప్పుకున్న తర్వాత నా కార్యాలయంలోకి అవెలా వచ్చాయో నాకు తెలియదు. వాటిల్లో ఏముందో కూడా తెలియదు. వీటిపై జరుగుతున్న విచారణకు పూర్తిగా సహకరిస్తున్నా. ఇలాంటి అంశాలను నేనెంత సీరియస్‌గా తీసుకుంటానో అందరికీ తెలుసు' అన్నారు. మెక్సికో పర్యటనలో ఉన్న ఆయన మీడియా ప్రశ్నించడంతో ఈ అంశంపై తొలిసారిగా స్పందించారు.

ఇవీ తేడాలు...

బైడెన్ పేపర్స్

- 10 డాక్యుమెంట్ల దాకా దొరికాయి.
- వీటిలో కొన్ని మాత్రమే టాప్ సీక్రెట్ తరహావి.
- వీటిపై దర్యాప్తుకు సహకరిస్తున్నట్టు బైడెన్ చెబుతున్నారు.
- బైడెన్ ఆఫీసులో రహస్య పత్రాలున్నాయంటూ ఆయన లాయర్లే ఆర్కైవ్స్‌కు సమాచారమిచ్చారు.

ట్రంప్ పేపర్స్



- ట్రంప్ ఎస్టేట్లో కనీసం 325 డాక్యుమెంట్లు దొరికాయి.
- వీటిలో కనీసం 60 దాకా టాప్ సీక్రెట్ డాక్యుమెంట్లున్నాయి.
- దర్యాప్తును అడ్డుకున్నందుకు ట్రంప్‌పై విచారణ జరుగుతోంది
- ట్రంప్ ఎస్టేట్లోని రహస్య పత్రాలన్నింటినీ ఆయన లాయర్లు అప్పగించారని ఆర్కైవ్స్ వర్గాలకు నమ్మకం కుదరలేదు. ఎస్టేట్‌పై ఎఫ్‌బీఐ ఆకస్మిక సోదాలు జరపగా మరెన్నో డాక్యుమెంట్లు లభ్యమయ్యాయి.

లక్షద్వీప్ ఎంపీకి పదేళ్ల ఖైదు



కవరత్తి: హత్యాయత్నం కేసులో లక్ష ద్వీప్ ఎంపీ, ఎన్సీపీ నేత మహమ్మద్ ఫైజల్ సహా నలుగురికి జిల్లా కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. వారికి పదేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా విధిస్తూ సెషన్స్ కోర్టు జడ్జి కె.అనిల్‌కుమార్ తీర్పు చెప్పారు. 2009 లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి పీఎం సయీద్ అల్లుడైన పదాంత సాలిహ్‌ను హత్య చేయడానికి ఫైజల్ మరో ముగ్గురు ప్రయత్నించినట్టు కేసు నమోదైంది. రాజకీయ కక్షలతోనే సాలిహ్‌ను హత్య చేయడానికి కుట్ర పన్నారని, అయితే అందులో వారు విఫలమయ్యారని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు నేపథ్యంలో ఎంపీ ఫైజల్ సహా దోషులు నలుగురిని కేరళలోని కన్నూర్ సెంట్రల్ జైలుకి తరలించారు. ఈ తీర్పుతో ఫైజల్ రాజకీయ భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎన్సీపీకి చెందిన నేత ఫైజల్ క్రిమినల్ కేసులో దోషిగా తేలడంతో ఆయనపై అనర్హత వేటు పడుతుందని న్యాయనిపుణులు చెబుతున్నారు. మరోవైపు ఈ కేసు రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని ఫైజల్ ఆరోపించారు. తీర్పును హైకోర్టులో సవాల్ చేస్తున్నట్టు చెప్పారు. 2009లో ఫైజల్ మరి కొంత మందితో కలిసి పదునైన ఆయుధాలతో సాలిహ్‌పై దాడి చేశారు. కత్తులు, కటారులు, కర్రలు, ఐరన్ రాడ్లతో కలిసి అతనిని వెంబడించి కొట్టారు. తీవ్రంగా గాయపడిన సాలిహ్‌ని ప్రత్యేక హెలికాప్టర్‌లో ఎర్నాకులం ఆస్పత్రికి తరలించడంతో ఆయన ప్రాణాలు నిలవగలిగారు.

జిలేబీ బాబాకు 14 ఏళ్ల జైలు



చండీగఢ్: తనను తాను దేవుడిగా ప్రచారం చేసుకుంటూ అరాచకాలు సాగించిన జిలేబీ బాబా అలియాస్ అమర్‌వీర్ అలియాస్ బిల్లూ అలియాస్ అమర్‌పురి (63) పాపం పండింది. 100 మందికి పైగా మహిళలపై అత్యాచారం చేసి, వీడియోలు తీసినట్లు అతడిపై ఆరోపణలున్నాయి. ఓ బాలికపై రెండు సార్లు అత్యాచారం చేసిన కేసులో పోక్సో చట్టం సెక్షన్ 6 కింద అతనికి 14 ఏళ్ల జైలు శిక్ష విధిస్తున్నట్లు హరియాణాలోని ఫతేహాబాద్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు అదనపు జిల్లా జడ్జి బల్వంత్‌సింగ్ బుధవారం ప్రకటించారు. జిలేబీ బాబాను హరియాణా పోలీసులు 2018లో అరెస్టు చేశారు. అతడి ఫోన్‌లో 120కి పైగా అశ్లీల వీడియో క్లిప్పింగ్‌లను గుర్తించారు. జిలేబీ బాబా హరియాణాలోని తోహన్ పట్టణంలో బాబా బాలక్‌నాథ్ మందిరం అధినేతగా ప్రాచుర్యం పొందాడు. మహిళలకు మాదకద్రవ్యాలిచ్చి అత్యాచారం చేయడం, ఆ దురాగతాన్ని వీడియోలో చిత్రీకరించడం, వాటిని చూపి బ్లాక్‌మెయిల్ చేసి బాధితుల నుంచి డబ్బులు గుంజడం అతని స్టైల్.

అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ వేగుచుక్క

ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సులో మోదీ

- ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనే సత్తా మనకే అధికం
- గత ఎనిమిదేళ్లలో సంస్కరణల వేగం మరింత పెంచాం
- పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా భారత్



ఇండోర్: ప్రపంచ వాణిజ్యంలో భారత్‌ను ఒక వేగుచుక్కగా అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) పరిగణిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఆర్థిక సంక్షోభం తలెత్తితే సమర్థంగా ఎదుర్కొనే సత్తా ఇతర దేశాలకంటే భారత్‌కే అధికంగా ఉందని సాక్షాత్తూ ప్రపంచ బ్యాంక్ చెబుతోందని గుర్తుచేశారు. మన దేశ ప్రాథమిక ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండడమే ఇందుకు కారణమని వివరించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో బుధవారం ప్రపంచ పెట్టుబడిదారుల 7వ సదస్సులో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. గత ఎనిమిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం సంస్కరణల వేగాన్ని మరింత పెంచిందని పేర్కొన్నారు. పెట్టుబడుల విషయంలో ఎన్నో అవరోధాలను తొలగించిందని వెల్లడించారు. నరేంద్ర మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే..

నంబర్ వన్ స్థానంలో భారత్

"నేటి నూతన భారతదేశం ప్రైవేట్ రంగ బలంపై ఆధారపడుతూ వేగంగా ముందుకు సాగుతోంది. రక్షణ, గనులు, అంతరిక్షం వంటి కీలక వ్యూహాత్మక రంగాల్లో ప్రైవేట్ రంగం ప్రవేశానికి ద్వారాలు తెరిచాం. మల్టీ మోడల్ మౌలిక సదుపాయాల వల్ల దేశంలో పెట్టుబడులకు అవకాశాలు భారీగా పెరిగాయి. బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థ, యువ జనాభా అధికంగా ఉండడం, రాజకీయ స్థిరత్వం మన దేశ ప్రగతికి చోదక శక్తులు. మన బలాలే పెట్టుబడిగా సులభతర జీవనం, సులభతర వాణిజ్యాన్ని పెంపొందించడానికి త్వరితంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. 5జీ నెట్‌వర్క్‌ను విస్తరింపజేస్తున్నాం. ఆప్టికల్ ఫైబర్ వ్యవస్థ గ్రామీణ ప్రాంతాలకు సైతం చేరుకుంటోంది. ప్రపంచంలో స్మార్ట్‌ఫోన్ డేటా వినియోగంలో భారత్ నంబర్ వన్ స్థానంలో ఉంది. రికార్డు స్థాయిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) ఆకర్షించింది.

అది ప్రతి భారతీయుడి ఆశయం

అభివృద్ధి చెందిన దేశ నిర్మాణంలో మధ్యప్రదేశ్ పాత్ర చాలా కీలకంగా మారింది. ఆధ్యాత్మికం, టూరిజం, వ్యవసాయం, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధిస్తోంది. పెట్టుబడులకు స్వర్గధామంగా మారింది. పెట్టుబడిదారులకు తగిన ప్రతిఫలం అందించడంలో మధ్యప్రదేశ్ రెండు అడుగులు ముందే ఉంటుందని నమ్మకంగా చెప్పగలను. అభివృద్ధి చెందిన భారత్ అనేది కేవలం నోటిమాట కాదు, ప్రతి భారతీయుడి ఆశయం. కోవిడ్–19 వ్యాప్తి సమయంలోనూ సంస్కరణలను ఆపలేదు. 2014 నుంచి 'సంస్కరణ, మార్పు, నిర్వహణ' అనే మార్గంలో భారత్ ముందుకు సాగుతోంది. ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ వల్ల దేశంలో అభివృద్ధి వేగం పుంజుకుంది. పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారింది.


న్యూ ఇండియా గుర్తింపు చిహ్నాలు

"జాతీయ రహదారుల నిర్మాణ వేగాన్ని ఎనిమిదేళ్లలో రెండింతలు చేశాం. ఎయిర్‌పోర్టుల సంఖ్య రెట్టింపైంది. ఓడరేవుల సామర్థ్యాన్ని, ఆదాయాన్ని ఎన్నో రెట్లు పెంచాం. సరుకు రవాణా కారిడార్లు, పారిశ్రామిక కారిడార్లు, ఆధునిక ఎక్స్‌ప్రెస్ రహదారులు, లాజిస్టిక్(సరుకు నిల్వ) పార్కులు నూతన భారతానికి గుర్తింపు చిహ్నాలుగా మారాయి. మౌలిక సదుపాయాల నిర్మాణం కోసం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ పేరిట దేశంలో తొలిసారిగా ఒక జాతీయ వేదికను ఏర్పాటు చేశాం. అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణం కోసం అంతా చేతులు కలుపుదాం. కలిసి పనిచేద్దాం. రాబోయే నాలుగైదేళ్లలో భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది. మోర్గాన్‌స్టాన్లీ సంస్థ ఈ మేరకు పేర్కొంది. ఇది భారతదేశ దశాబ్దం కాదు, శతాబ్దమని మెకిన్సీ సీఈఓ చెప్పారు" అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

ఓజోన్ పొర స్వయం చికిత్స

2066 నాటికి పూర్తిగా పూడుకుపోనున్న రంధ్రం

వాషింగ్టన్: వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, తద్వారా ప్రకృతి విపత్తులతో అల్లాడిపోతున్న ప్రపంచానికి ఇదొక శుభవార్త. భూగోళంపై ఉష్ణోగ్రతలను నియంత్రించడంలో అత్యంత కీలకమైన ఓజోన్ పొర స్వయం చికిత్స చేసుకుంటోంది. ఓజోన్ పొరకు ఏర్పడిన రంధ్రం క్రమంగా పూడుకుపోతోంది. క్లోరో ఫ్లోరో కార్బన్ల ఉద్గారాలు క్రమంగా తగ్గుముఖం పడుతుండడమే ఇందుకు కారణం. ఐక్యరాజ్యసమితికి చెందిన సైంటిఫిక్ అసెస్‌మెంట్ ప్యానెల్ ఈ విషయాన్ని ఒక నివేదికలో వెల్లడించింది. ప్రతి నాలుగేళ్లకోసారి ఈ నివేదిక విడుదల చేస్తారు. ఓజోన్ పొర పూడుకుపోవడం 2022లో మొదలైందని నివేదికలో తెలిపింది. ఓజోన్ రంధ్రం 2022 సెప్టెంబర్ 7 నుంచి అక్టోబర్ 13 మధ్య సగటున 23.2 మిలియన్ చదరపు కిలోమీటర్ల వైశాల్యానికి కుంచించుకుపోయింది. క్లోరో ఫ్లోరో కార్బన్ల ఉద్గారాలు ఇదే క్రమంలో తగ్గిపోతే 2066 నాటికి పూర్తిగా పూడుకుంటుందని పేర్కొన్నారు. మాంట్రియల్ ప్రోటోకాల్ సత్ఫలితాలు ఇస్తున్నట్లు భావిస్తున్నామని తెలిపారు. ఓజోన్ పొరకు రంధ్రం ఏర్పడినట్లు తొలిసారిగా 1980లో గుర్తించారు. మరో నాలుగు దశాబ్దాల్లో 1980 నాటి స్థాయికి ఓజోన్ పొర చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు నిపుణులు స్పష్టం చేశారు. ఉష్ణోగ్రత 2100 నాటికి 0.3 నుంచి 0.5 డిగ్రీల సెల్సియస్ తగ్గేలా హైడ్రో ఫ్లోరో కార్బన్ల ఉత్పత్తి, వినియోగాన్ని తగ్గించుకోవాలని మాంట్రియల్ ప్రోటోకాల్ నిర్దేశిస్తోంది.





కాస్త కదిలినా చాలు శరీరాన్ని ఛిద్రంచేసే గ్రనేడ్ ఒంట్లోకి దూసుకుపోయి అచేతనంగా ఉన్న ఉక్రెయిన్ సైనికుడికి వెంటనే శస్త్రచికిత్స చేసి ఛాతిలోని గ్రనేడ్‌ను తీసేసిన డాక్టర్ ఇతను. పేరు యాండ్రీ వెర్బా. సంక్లిష్ట ఆపరేషన్లను ప్రశాంతంగా చేసే డాక్టర్‌గా ఇతనికి పేరుంది. ఎలక్ట్రోకోవాగ్యులేషన్(రక్తస్రావం ఆపే ప్రక్రియ) లేకుండానే ఈ ఆపరేషన్ చేయడం విశేషం. రష్యా సైన్యం అసాల్ట్ రైఫిల్‌కు బిగించిన గ్రనేడ్ లాంచర్‌తో దీనిని ప్రయోగించింది.

'ఎయిరిండియా' మిశ్రాకు బెయిల్ నిరాకరణ



న్యూఢిల్లీ: న్యూయార్క్–న్యూఢిల్లీ ఎయిర్ ఇండియా విమానంలో సహ ప్రయాణికురాలిపై మూత్రవిసర్జన చేసిన శంకర్ మిశ్రాకు ఢిల్లీలోని పటియాలా కోర్టు బుధవారం బెయిల్ నిరాకరించింది. తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ అతడు దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. శంకర్ మిశ్రాను ఢిల్లీ పోలీసులు శుక్రవారం బెంగళూరులో అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపర్చగా నిందితుడిని 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు. తనను చట్టవిరుద్ధంగా అరెస్టు చేశారని శంకర్ మిశ్రా ఆరోపించాడు. తనకు గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదని, సాక్ష్యులను ప్రభావితం చేసే స్థాయిలో లేనని, అందుకే బెయిల్ ఇవ్వాలని కోరాడు.

ఐక్యత, సౌభ్రాతృత్వాలే.. భారత మూలమంత్రం

అందుకే జోడో యాత్ర విజయవంతం: రాహుల్

ఫతేగఢ్ సాహిబ్ (పంజాబ్): అధికార బీజేపీ దేశంలో హింసాద్వేషాలను వ్యాప్తి చేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మరోసారి దుయ్యబట్టారు. "కానీ మన దేశం ఎప్పుడూ ఐక్యతకు, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచింది. అందుకే భారత్ జోడో యాత్ర ఇంతగా విజయవంతమవుతోంది" అని అభిప్రాయపడ్డారు. ఆయన యాత్ర బుధవారం పంజాబ్‌లోకి ప్రవేశించింది. ఫతేగఢ్ సాహిబ్ గురుద్వారాను సందర్శించిన అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. బీజేపీ, ఆరెస్సెస్ మతాలను, కులాలను పరస్పరం ఎగదోస్తూ దేశ వాతావరణాన్నే కలుషితం చేశాయంటూ ధ్వజమెత్తారు. అందుకే దేశానికి ప్రేమ, ఐక్యతలతో కూడిన మరో దారి చూపాలనే యాత్ర మొదలు పెట్టినట్టు చెప్పారు. మీడియా కూడా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి పెను సమస్యలను పక్కన పెట్టి 24 గంటలూ ప్రధాని మోదీని చూపించడానికే పరిమితమవుతోందంటూ చురకలంటించారు.



ఫతేగఢ్ సాహిబ్ వద్ద యాత్రలో రాహుల్

21 పార్టీలకు ఆహ్వానం

భారత్ జోడో యాత్ర జనవరి 30న జమ్మూ కశ్మీర్లోని శ్రీనగర్‌లో ముగియనుంది. ఈ సందర్భంగా జరిపే ముగింపు సభలో పాల్గొనాలని కోరుతూ 21 పార్టీల అధ్యక్షులకు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే లేఖలు రాశారు.

అఫ్గాన్‌లో పేలుడు.. 20 మంది మృతి

కాబూల్: అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్‌లో విదేశాంగ శాఖ కార్యాలయం సమీపంలో బుధవారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. కాబూల్ ఈ ఏడాదిలో ఇది రెండో అతిపెద్ద పేలుడు. ఈ ఘటనలో 20 మందికిపైగా జనం మృతి చెందారు. అయితే, పేలుడుకు పాల్పడింది ఎవరన్నది ఇంకా తెలియరాలేదు. కానీ, అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐసిస్)కు అనుబంధ సంస్థయైన 'ఇస్లామిక్ స్టేట్ ఇన్ ఖొరాసన్ ప్రావిన్స్' 2021 ఆగస్టులో తాలిబాన్ పాలన మొదలయ్యాక అఫ్గాన్‌లో వరుసగా దాడులకు పాల్పడుతోంది.

సాక్షి
కరీంనగర్
గురువారం । 12 । జనవరి । 2023



కుదార్తై, నోము ఉత్సవాలు
ఇల్లందకుంట: ధనుర్మాస ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో కుడార్తై ఉత్సవం, అమ్మవారి నోములు నిర్వహించారు.



తగ్గిన పత్తి ధర
జమ్మికుంట: పత్తి ధరలు తగ్గుతున్నాయి. రెండు రోజుల్లో రూ.250 తగ్గగా.. బుధవారం క్వింటాల్ గరిష్టంగా రూ.8,150 పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
30.0/13.0

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. చలి తీవ్రత కొనసాగుతుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

శ్యాంప్రసాద్ లాల్‌కు తెలంగాణ కీర్తి సాహితీ పురస్కారం



సప్తగిరికాలనీ(కరీంనగర్): కళాశ్రీ సంస్థ ఆధ్వర్యంలో జగిత్యాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కరీంనగర్ అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్‌లాల్‌కు తెలంగాణ కీర్తి సాహితీ పురస్కారాన్ని సంస్థ నిర్వాహకులు గుండేటి రాజు ప్రదానం చేశారు. అధికారిగా సేవలందిస్తూ, సాహితీ సృజన చేస్తూ కవులను, కళాకారులను ప్రోత్సహిస్తున్నారని వక్తలు కొనియాడారు. పురస్కార గ్రహీత శ్యాం ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ ఈ పురస్కారం తనపై మరింత బాధ్యత మోపిందని, ఇకముందు క్రమం తప్పకుండా కవిత్వం రాస్తుంటానని చెప్పారు.

మత్స్యకారులు బీమా పత్రాలు తీసుకోండి

- జిల్లా మత్స్యశాఖ అధికారి దేవేందర్



కరీంనగర్ అర్బన్: మత్స్యకారులు ఇన్సూరెన్స్ పత్రాలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి దేవేందర్ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల కోసం రూ.5 లక్షల ప్రమాద బీమాను కల్పిస్తోందని తెలిపారు. బుధవారం జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో ఇన్సూరెన్స్ పత్రాలను మత్స్యకారులకు పంపిణీ చేశారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు పెసరు కుమారస్వామి, మత్స్య శాఖ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, తెలంగాణ ముదిరాజ్ మహాసభ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోలకాని నరసయ్య, జిల్లా నాయకులు గూడెల్లి రాజకుమార్, మాల కనకయ్య, రాయణవేణి శ్రావణి, సైదాపూర్ మండల యువత అధ్యక్షుడు నీర్ల నరేష్ పాల్గొన్నారు.

మార్కెట్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కరీంనగర్ సిటీ: సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కిసాన్‌నగర్ బీట్ మార్కెట్, కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ ఎదురుగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వరరావు, మున్సిపల్ డీఈఈ మసూద్ అలీ, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



సాక్షి స్పందన

కరీంనగర్ సిటీ: కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 32వ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలపై 'ఆక్రమణలకు అడ్డుకట్టేది' 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న వాటిని పరిశీలించారు. నిబంధనల ప్రకారం లేని వాటిని కూల్చివేశారు. మరికొందరికి నోటీసులు జారీ చేశారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని.. నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులు సూచించారు.

రేషన్ పంపిణీ షురూ



సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్ అర్బన్: రేషన్ పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం నుంచి జిల్లాలోని రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే మూమెంట్ పూర్తవగా యూనిట్‌కు 5 కిలోల చొప్పున ఇస్తున్నారు. ఈ నెల 10న 'సాక్షి'లో 'రేషన్ బియ్యం ఎప్పుడిస్తరో' శీర్షికన కథనం ప్రచురితమైంది. మంత్రి గంగుల కమలాకర్ ప్రత్యేక చొరవ చూపి పంపిణీకి మార్గం సుగమం చేశారు.

యువ 'కలం'..

- రచయితలుగా రాణిస్తున్న మన యువత
- కలంపట్టి గళమెత్తుతున్న కవులు
- యువజన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు

'ఉక్కు నరాలు వజ్ర సంకల్పమున్న యువతను నాకు ఇస్తే.. ఈ దేశాన్ని మారుస్తా' అని స్వామి వివేకానంద సూక్తి. వివేకానందుడి ఆశయాలను కొనసాగిస్తూ సమాజ మార్పునకు ఉక్కునరాలు పిడికిలెత్తాయి. యువ కలాలు సమాజ హితానికి గళమెత్తాయి. మార్పును కోరుతూ రచనలు చేస్తున్నాయి. వాళ్ల కలం నుంచి జాలువారిన.. జాలువారుతున్న ఒక్కో సిరాచుక్క ఎంతో మందిని ప్రభావితం చేస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా యువత అక్షరాలు, సాహితీ తోటలు వికసిస్తున్నాయి. సుగంధాలు పంచుతున్నాయి. కవిత, పాట, కథ ఇలా ప్రక్రియ ఏదైనా.. పైచేయి తమదే అంటున్న సాహితీ సేద్యకులపై వివేకనందుడి జయంతి సందర్భంగా ప్రత్యేక కథనాలు..

– సాక్షి, కరీంనగర్ డెస్క్



ఈ 'రవీంద్రుడు'.. కవీంద్రుడు



ఓదెల మండల కేంద్రానికి చెందిన బ్రాహ్మణపల్లి రవీంద్రాచారి వృత్తిరీత్యా ఆర్టిస్ట్. ఓ వైపు బొమ్మలేస్తూనే.. మరోవైపు సాహిత్యంలో రాణిస్తున్నారు. కంటితో చూసిన దృశ్యానికి చిత్ర రూపం ఇస్తూ మనసులో మెదిలినభావాలను అక్షరబద్ధం చేస్తున్నారు. 2002 నుంచి కవితలు రాస్తున్నారు. వివిధ సంకలనాల్లో ఆయన రాసిన కవితలు ప్రచురితమయ్యాయి. భగవంతుని స్వరూపం కవిత రాసినందుకు గాను డాక్టర్ సి.నారాయణరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2015లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఓదెల మండల ఉత్తమ సాహితీ వేత్తగా అవార్డుతోపాటు రూ.10 వేలు చెక్కు అందుకున్నారు. 2020 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై పుట్టిన రోజును పురస్కరించుకుని కరోనాపై కవితల పోటీలో పాల్గొన్నారు. గవర్నర్ చేతుల మీదుగా కన్సోలేషన్ అవార్డ్, రెండు వేల రూపాయల చెక్కు అందుకున్నారు. అంతేకాదు జానపద సినీ గీతాల రచనలోనూ రవీంద్రచారి ప్రతిభ కనబరుస్తున్నారు. సినిమాలకు జానపద సాహిత్యం అందించడమే తన ధ్యేయమని ఆయన చెబుతున్నారు.

భావానికి ఆత్మ.. 'పాళీ'

సిరిసిల్లలో పుట్టిన చిందం మల్లేశం డిగ్రీ వరకు చదివారు. ప్రస్తుతం గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేటలో మెడికల్ షాప్ నిర్వహిస్తున్నారు. కవిత్వంపై మక్కువతో 'పాళీ' అనే కలం పేరుతో కవిత్వాన్ని రాస్తున్నారు. చిన్నతనంలో సిరిసిల్ల నేత కార్మికుల బతుకు వ్యథలను చూసిన ఆయన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని వాళ్ల బతుకుచిత్రంపై ఎన్నో కవితల్ని రాశారు. స్వతహాగా నేసిన అనుభవంతో నేతన్నల జీవన శైలిని తన కవితా వస్తువుగా చేసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో పలు ప్రశంసలు అవార్డులు అందుకున్నారు. 'అక్షరం అమ్మయితే ఆవేదన నాన్న..' వీటి సంతానమే సాహిత్యం అని ఆయన భావన. సమాజాన్ని అద్దంలో చూపించాలంటే కేవలం సాహిత్యంతోనే సాధ్యమని తన అడుగులను సాహిత్యం వైపు వేస్తున్నారు. ఇప్పటివరకు వెయ్యికి పైగా కవితలు రాశారు. కరోనా సమయంలో 'మాస్క్ పెట్టు.. మావా మాస్క్ పెట్టు' రాసిన పాట, ఇటీవల పోలీసులపై రాసిన పాటలు ఆయనకు ఎంతో పేరును తెచ్చిపెట్టాయి.

'మా ఊరి చెరువులో చేపలు బతుకుతాయి..
మనుషులు చస్తారు
ఎముకలపై చలి అత్యాచారం చేస్తుంటే..
చెమటలు చలి చీమలవలె కొరికేస్తుంటే..
మగ్గంపై మొగ్గయింది తెల్లని బట్ట..
అయినా.. మాకిది చీమల పుట్ట'
అంటూ వారి చేతికందని బట్ట గురించి ఎంతో లోతుపాతుగా కవిత్వాన్ని రాశారు.



మరో కవితలో...
'ఇక్కడి దేహాలు బొక్కల్ని దాచుకునే అలమరాలు
శవాల్ని ముద్దాడే గులకరాళ్లు'
అంటూ నేతన్నల ఆత్మహత్యల గురించి తనదైన శైలిలో కలాన్ని విదిలించారు.

పేదరికం గురించి రాస్తూ..
'విశ్వానికి ఒకడే సూరీడు
తడకల ఇంటికి లెక్కపెట్టలేనన్ని సూర్యుళ్లు
నాన్న గొంతులోకి దిగిన కల్లె చుక్కలు
నా గుండెల్యాబ్‌లో మారిన కన్నీటి చుక్కలు
ఎంత లోతో జీవితం కాలికి గుచ్చిన ముల్లునడుగు..
ఎంత ఎరుపో జీవితం కడుపులో మండుతున్న సూర్యున్నడుగు
ఎంత నలుపో జీవితం చేతికి అందిన కందెననడుగు..'
అంటూ వచన కవిత్వంతోపాటు మినీ కవిత్వాన్ని కూడా రాశారు.

సాహిత్యంలో 'మెరుగు'



మెరుగు ప్రవీణ్‌ది రామడుగు మండలంలోని గోలి రామయ్యపల్లి. కరీంనగర్ జిల్లాలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. తండ్రి లక్ష్మినారాయణ తబలా వాయిద్యకారుడు కావడంతో ప్రవీణ్‌కు చిన్నప్పటి నుంచి కళలపై ఆసక్తి ఏర్పడింది. కళలపై ఇష్టంతో సాహిత్యంలో రాణిస్తున్నారు. పాటలు రాసి పాడుతూ యూట్యూబ్‌లో రిలీజ్ చేస్తున్నారు. ఎస్సారార్ కళాశాల వలంటీర్ ఆర్గనైజేషన్ స్థాపించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సేవా రంగంలో ఇప్పటివరకు అనేక అవార్డులు అందుకున్నారు. సమాజ మార్పును ఆశించే కవిత్వం రాస్తూ ప్రముఖుల మన్ననలు పొందుతున్నారు. 'జీవన ప్రయాణం', 'మేల్కొనండి' పేరిట రెండు కవితా సంపుటాలను ప్రచురించారు.

'సౌమ్య'మైన కవిత్వం



ఈడెపు సౌమ్యది రాజన్న సిరిసిల్ల జిల్లా. సౌమ్య సిరిపూర్‌లో ఆరో తరగతి చదువుతున్నప్పుడు అందుడైన ఉపాధ్యాయుడు శ్రీధర్ స్వామి సాహిత్యం ఆకట్టుకుంది. తెలుగు టీచర్ జానకి పాఠాలు సాహిత్యం వైపు నడిపించాయి. అప్పట్నుంచి అలవోకగా సౌమ్య కవితలు అల్లుతూ వస్తున్నారు. వందల కొద్ది కవితలు రాశారు. 'సౌమ్య అలలు' పేరుతో కవితల పుస్తకాన్ని తీసుకొచ్చారు. ఈనాటి యువతరాన్ని చైతన్య పరిచేలా కవితలు రాస్తూ ముందుకు సాగుతున్నారు. 'మానేటి ఒడ్డున పుట్టి పెరిగినందున ఆ నదితో ఉన్న అనుబంధమే ఇప్పుడు నన్ను కవయిత్రిని చేసింది' అని ఆమె చెబుతున్నారు.

నిజాన్ని నిర్భయంగా చెప్పే సుగుణ కలం



బెజ్జంకి మండలం గూడెం గ్రామంలో పుట్టిన మాంకాలి సుగుణ పీజీ, బీఎడ్ పూర్తి చేశారు. ప్రస్తుతం బెజ్జంకి మోడల్ స్కూల్‌లో గెస్ట్ ఫ్యాకల్టీగా తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. డిగ్రీ చదువుతున్నప్పటి నుంచి కవిత్వం రాస్తున్నారు. అమ్మ మల్లవ్వ స్ఫూర్తితో, తాను చూసిన పేదకుటుంబాల గురించి... రైతులు.. స్త్రీల గురించి అద్భుతమైన కవిత్వం రాస్తున్నారు. సుగుణ దివ్యాంగురాలైనప్పటికీ తనలాంటి వారి కష్టాలను బాధలను పాటలు, కవితల రూపంలో అక్షరీకరిస్తున్నారు.

'కారు మబ్బులు
కమ్మిన కటిక చీకటి
రేయి పగలు కనిపించని
న్యాయ దేవతలే
అడుగు తీసి అడుగులే వేయలేని నడకలే
విధి వైపరీత్యాలే వెక్కిరింతలై
ఎవ్వరికి ఏమని చెప్పని జీవితాలు
మానవత్వ విలువలకు ప్రతిరూపాలు'

అంటూ.. దివ్యాంగుల బాధలను వారు వైకల్యంతో ప్రతిక్షణం మానసికంగా కుంగిపోతున్న విధానాన్ని పాట రూపంలో రాశారు. ఇలా ఇప్పటివరకు 480 కవితలు 80 పాటలు, పలు కథలు రాసి రాష్ట్ర స్థాయిలో అవార్డులు అందుకున్నారు. దివ్యాంగురాలైనప్పటికీ ఆమెకున్న ఆత్మస్థైర్యం నేటి యువతకు ఆదర్శం.

వృత్తి వ్యాపారం.. ప్రవృత్తి సాహిత్యం



దొమ్మటి శంకర్ ప్రసాద్‌ది కరీంనగర్ జిల్లా కేంద్రం. వృత్తిరీత్యా వ్యాపారి. ఆకట్టుకునే రచనలు చేస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచి శ్రీశ్రీ, తిలక్, ఠాగూర్ కవిత్వానికి ఆకర్షితుడై కవిత్వం రాస్తున్నారు. కరీంనగర్ సాహితీ పెద్దలు ఆయనకు మరింత ప్రోత్సాహమిచ్చారు. ప్రస్తుతం తెలంగాణ రచయితల సంఘం కరీంనగర్ శాఖకు ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆయన ఇప్పటివరకు అనేక అవార్డులు సన్మానాలు అందుకున్నారు. సాహిత్యంలో పీహెచ్‌డీ చేయాలనేది శంకర్ కల. 'ఫిట్టర్ కొమురయ్య కథలు' పుస్తకాలను ఆయన త్వరలోనే ఆవిష్కరించనున్నారు.

దోపిడీ సమాజాన్ని ప్రశ్నించే 'కర్ణాకర్'



జమ్మికుంటకు చెందిన రామగుండం కర్ణాకర్ పరిశోధక విద్యార్థి. ఇప్పటివరకు 500లకు పైగా కవితలు రాశారు. వ్యవస్థీకృతమైన దోపిడీ సమాజపు రూపాన్ని నగ్నంగా చూపిస్తూ.. అందులో సమిధలవుతున్న అభాగ్యులకు ఆయన అక్షరాలను అందించేందుకు చిరు ప్రయత్నం చేస్తున్నారు. 'కలం ఖాండ్రించి ఉమ్మితోంది' అనే పుస్తకాన్ని రాశాడు.

'ఒరేయ్... పప్పు నోట్ల
అక్షరవన బిచ్చపోళ్లారా...
ఈ కలంలోని సిరా
ఖాండ్రించి ఉమ్మితోందిరా..
మనసులోని నిజాయితీ
పొరలు పొరలుగా నిగ్గదీసి
అడుగోతోందిరా...
నిస్సిగ్గుగా సిగ్గునొదిలేసినా
సిరాబతుకుల
బజారులో అక్షరాలమ్ముకొంటూ
లక్షల కోట్ల రంగురంగు
తెరలపై రాజభోగమనుభవిస్తోన్న
పప్పు నోట్లకూ కుమ్మక్కైనవద్ద
కలం కుదుప్పుదులజూసి
ఈ కలం మీ మొహంపై
ఖాండ్రించి ఉమ్మితోందిరా'
అంటూ కలంతో ఎండగడుతున్నారు.

యూపీ టూ కరీంనగర్!



పీడీయాక్టు ఉత్తర్వులు అందిస్తున్న పోలీసులు



ఉత్తరప్రదేశ్ నుంచి తెచ్చిన తపంచాలు, తూటాలు

- తుపాకులు దిగుమతి చేస్తున్న నిందితులు
- ఇటీవల యజమానులను చంపేందుకు గన్ తెచ్చిన వైనం
- పీడీ యాక్టు అమలు చేసిన కరీంనగర్ పోలీసులు
- గతంలో హుజూరాబాద్ నియోజకవర్గంలో గన్‌ల వాడకంపై విమర్శలు
- అక్రమ ఆయుధాల సరఫరాపై పోలీసుల నజర్

కరీంనగర్‌క్రైం: ఉత్తరప్రదేశ్ నుంచి తుపాకులు కరీంనగర్‌కు దిగుమతి అవుతున్నాయి. ఇటీవల జరిగిన ఓ ఘటననే ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. ఓ నిందితుడు తాను పనిచేసిన సంస్థ యజమానులను చంపేందుకు ఉత్తరప్రదేశ్ నుంచి రెండు దేశవాళీ తపంచాలు, బుల్లెట్లు కొనుగోలు చేశాడు. చంపే ప్రయత్నంలో వారు లేకపోవడంతో కార్యాలయంలో ఉన్న వారిని గన్‌తో బెదిరించి రూ.34 వేల వరకు దోచుకెళ్లారు. అంతేగాకుండా 280 గ్యాస్ సిలిండర్లు ఎత్తుకుపోయాడు. తన యజమానులను బెదిరింపులకు గురిచేశాడు. మానకొండూర్ పోలీసులు ఇటీవల ఈ నిందితుడిపై పీడీయాక్టు అమలు చేసి చర్లపల్లి జైలుకు తరలించారు.

హుజూరాబాద్ నియోజకవర్గంపై పోలీసుల దృష్టి

హుజూరాబాద్ నియోజకవర్గంలో గన్‌ల విషయంలో పలు విమర్శలు వస్తున్నాయి. కొందరు రాజకీయ నాయకులు గన్‌ల వాడకం, కనిపించేలా పెట్టుకొని తిరగడంపై అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ విషయం సీపీ సత్యనారాయణ దృష్టికి వెళ్లింది. దీంతో ఆ నియోజకవర్గంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అయితే.. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఇద్దరికి లైసెన్స్ గన్‌లు ఉన్నాయని.. మావోయిస్టుల భారీ నుంచి ముప్పు ఉండడంతో వారికి లైసెన్సులు ఇచ్చామని పోలీసులు చెప్పారు. కాగా.. కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా 100కు పైగా గన్ లైసెన్సులు కలిగి ఉన్నట్లు సమాచారం.

ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి

ఉత్తరప్రదేశ్‌తోపాటు వివిధ రాష్ట్రాల నుంచి కరీంనగర్ కమిషనరేట్‌కు దిగుమతి అవుతున్నట్లు తెలుస్తోంది. గ్యాస్ సంస్థకు సంబంధించిన ఘటనలో నిందితుడు గతంలో అందులోనే పనిచేశాడు. అతడిని పనిలో నుంచి తీసివేసినందుకు కక్ష కట్టి యూపీకి వెళ్లి రెండు తపంచాలు, 7 బుల్లెట్లు కొనుగోలు చేశాడు. సాధారణ వ్యక్తి యూపీ వెళ్లి గన్స్ తీసుకురావడం అందరినీ విస్మయానికి గురిచేసింది. గ్యాస్ సిలిండర్‌ల దొంగతనం కేసులో నిందితుడిగా ఉండడంతో పోలీసులు విచారించగా.. అప్పుడు నిందితుడు గన్స్ తెచ్చాడు. పోలీసులు జనవరి 6న సదరు నిందితుడు పీడీయాక్టు అమలు చేశారు. కాగా.. జిల్లాకు అక్రమమార్గంలో తుపాకులు వస్తున్నాయా అన్న విషయంలో పోలీసులు నిఘా పటిష్టం చేశారు.

గన్ లైసెన్సులపై ప్రత్యేక దృష్టి..



లైసెన్సు గన్స్ అనుమతి విషయంలో ప్రత్యేక దృష్టి సారించాం. మావోయిస్టులతో ప్రాణహాని ఉన్న వారికి హుజూరాబాద్ నియోజకవర్గంలో ఇద్దరికి మాత్రమే లైసెన్సులు జారీ చేశాం. బయటి నుంచి అక్రమంగా వస్తున్న గన్స్ విషయంలో సీరియస్‌గా నిఘా పెట్టాం. ఇటీవల ఉత్తరప్రదేశ్ నుంచి తపంచాలు తీసుకొచ్చిన వ్యక్తిపై పీడీయాక్టు అమలు చేశాం. అక్రమంగా ఆయుధాలు తీసుకురావడం, సరఫరా చేయడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవు.

– వి.సత్యనారాయణ, కరీంనగర్ సీపీ

మా దారి దొడ్డిదారి..!

- జిల్లా ఆసుపత్రిలో రెండు నర్సు పోస్టుల భర్తీ
- లక్షల్లో వసూళ్లు.. లక్షణంగా వంపకాలు
- నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు



జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రి

కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో దొడ్డిదారి నియామకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. రెండు నర్సుపోస్టులను ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే భర్తీ చేసినట్లు తెలిసింది. ఇందులో ఒకరు జాయిన్ కాగా, మరొకరు నేడో, రేపో జాయిన్ అయ్యేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. గతేడాది సెప్టెంబర్‌లో ఇవే పోస్టులకు ఆసుపత్రిలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ వేలం పాట నిర్వహించి రూ.3.5 లక్షలకు ఒప్పందం కుదిర్చినట్లు తెలిసింది. అయితే.. ఆ సమయంలో 'సాక్షి' దినపత్రికలో అక్రమ నియామకాల ప్రయత్నంపై కథనం రావడంతో మూడు నెలల పాటు కిమ్మనకుండా ఉండి ప్రస్తుతం ఆ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తిచేసినట్లు విశ్వసనీయ సమాచారం.

నోటిఫికేషన్ లేకుండా..

జిల్లా ఆసుపత్రిలో ఒక్క పోస్టు భర్తీ చేసినా నోటిఫికేషన్ ఇచ్చి.. ఇంటర్వ్యూ పద్ధతిలో నియామకం చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ రెండు పోస్టులకు ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే దొడ్డిదారిన భర్తీ చేయడం చూస్తుంటే నిరుద్యోగుల అవసరాన్ని అసరాగా చేసుకుని అందినకాడికి దండుకునేందుకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో చేపట్టిన రెండు నర్సు పోస్టుల నియామకం కోసం నిబంధనలను గాలికొదిలేయడం పలు విమర్శలకు తావిస్తోంది. నోటిఫికేషనే లేకుండా చేస్తున్న నియామకం వెనుక లక్షలు చేతులు మారినట్లు ఆసుపత్రి సిబ్బందే బాహాటంగా చర్చించుకుంటున్నారు.

ఆసుపత్రిలో ఏం జరుగుతోంది..

దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలనే ఆత్రుత ఆసుపత్రి వర్గాల్లో కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రి మరికొద్ది రోజుల్లో కరీంనగర్ మెడికల్ కళాశాలగా మారనుంది. కళాశాల నిర్వహణ కోసం ఇప్పటికే స్టాఫ్ రిక్రూట్‌మెంట్ జరుగుతోంది. వచ్చే నెలలో ప్రిన్సిపాల్, ఆఫీస్ సిబ్బంది పోస్టులు భర్తీ కానున్నాయి. కళాశాల స్టాఫ్ వస్తే ఆసుపత్రి ఉద్యోగుల ప్రాతినిధ్యం తగ్గుతుంది. ఈ క్రమంలోనే పోస్టులను సృష్టించి భర్తీ చేసేస్తే స్వామికార్యం, స్వకార్యం రెండు పూర్తవుతాయనే ఉద్దేశంతో నిబంధనలు తుంగలో తొక్కి పోస్టుల భర్తీకి అడ్డదారిని ఎంచుకున్నట్లు సమాచారం. ఎన్‌సీయూ విభాగంలో రెండు పోస్టులను అక్రమ మార్గంలోనే భర్తీ చేసినట్లు తెలుస్తోంది. అర్హులైన వారికి కాకుండా అడ్డదారిలో వచ్చే వారినే అందలం ఎక్కించడం చూస్తుంటే కంచే చేను మేసిన చందంగా ఆసుపత్రి మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రైవేటు ఏజెన్సీ ద్వారా నియామకం..

ఔట్ సోర్సింగ్ పద్ధతిని పోస్టుల భర్తీ చేసేందుకు ప్రైవేటు ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించాం. వారు ఏ పద్ధతిలో ఇద్దరిని ఎంపిక చేశారో తెలియదు. పోస్టుల భర్తీలో ఆసుపత్రి ప్రమేయం లేదు.

– డాక్టర్ రత్నమాల, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్ ఉద్యోగులు

కరీంనగర్‌క్రైం: ప్రొహిబిషన్, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను డిప్యూటీ కమిషనర్ కేవీబీ శాస్త్రి బుధవారం ఎక్సైజ్ భవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి సూపరింటెండెంట్లు పి.శ్రీనివాస్, పంచాక్షరి, శ్రీధర్, మహిపాల్ రెడ్డి, టీఎస్జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి దారం శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ డైరీ..



డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి ఈశ్వర్, నాయకులు

కరీంనగర్: పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన డైరీని రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌టీయూ డైరీ ముఖచిత్రం రాష్ట్ర నూతన సచివాలయం చిత్రంతో ఆకర్షణీయంగా ఉందని, ఇందులో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉపయోగపడే చాలా విషయాలు ప్రింట్ చేయించారని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వల్లెపాటి వేణుగోపాల్‌రావులు మాట్లాడుతూ.. టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా బాధ్యులు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, భూపతి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రేషన్ పంపిణీ చేయలేని దుస్థితిలో ప్రభుత్వం'

కరీంనగర్‌టౌన్: నిరుపేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేయలేని దుస్థితిలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందించే బియ్యాన్ని కూడా ఇప్పటివరకు లబ్ధిదారులకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. సంక్రాంతికి పేదలను పస్తులు ఉంచుతారా? అని ప్రశ్నించారు. 6 కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉండగా 5 కిలోలే ఇచ్చేందుకు నిర్ణయించిందన్నారు. వాటిని కూడా సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర కోటా బియ్యాన్ని తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గోదావరిలో దూకిన మహిళ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి గోదావరి బ్రిడ్జి పైనుంచి బుధవారం ఓ మహిళ నదిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. టూటౌన్, రివర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యైటింక్లయిన్‌కాలనీకి చెందిన మహిళ బుధవారం గోదావరి బ్రిడ్జి వద్దకు వెళ్లింది. రివర్ పోలీసులు గమనించి, దగ్గరకు వెళ్లగా ఆమె కొంత దూరం పరిగెత్తి, నదిలో దూకింది. పోలీసులు ఆమెను కాపాడి, ఒడ్డుకు చేర్చారు. బాధితురాలికి స్వల్ప గాయాలవడంతో 108 వాహనంలో గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఆమె ఆత్మహత్యాయత్నానికి ఓ డాక్టర్ కారణమని సమాచారం.

కొత్త మహిళా సంఘాలకు కసరత్తు

- దివ్యాంగులు, వృద్ధుల సంఘాల ఏర్పాటుకూ అవకాశం
- ఓటరు జాబితా ఆధారంగా అర్హుల వివరాల సేకరణ



సమావేశమైన మహిళా సంఘం సభ్యులు (ఫైల్)

కరీంనగర్ అర్బన్: కొత్తగా మహిళా సంఘాల ఏర్పాటుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కసరత్తు ప్రారంభించింది. దివ్యాంగులు, వృద్ధుల సంఘాలనూ ఏర్పాటు చేయనుండగా తదనుగుణంగా క్షేత్రస్థాయిలో చర్యలు ప్రారంభమయ్యాయి. ఓటరు జాబితా, ఇంటింటి సర్వే ఆధారంగా సంఘాల్లోని లేనివారిని గుర్తించి, సభ్యత్వం ఇవ్వనున్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఉపాధి రంగాల్లో రాణించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మహిళా సంఘాలను ఏర్పాటు చేసిన విషయం విధితమే. ఈ క్రమంలో మహిళలకు ఆర్థిక చేయూతనిస్తూ స్వయం ఉపాధికి చేయూతనిస్తోంది. ఈ మేరకు గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. స్వయం సహాయక సంఘాల్లో మహిళలను సభ్యులుగా చేర్పించాలని నిర్ణయించింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 18 ఏళ్లు దాటిన మహిళలను గుర్తించేందుకు ఓటరు జాబితా కొలమానంగా తీసుకున్నారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి, అర్హులను గుర్తిస్తున్నారు.

బ్యాంకు లింకేజీ రుణాలు..

జిల్లాలో మహిళా సంఘాల్లోని సభ్యులకు బ్యాంకులు చేయూతనివ్వడంతో ఆర్థిక సాధికారత సాధిస్తున్నారు. కొత్త సంఘాల ఏర్పాటుతో గ్రామాల్లోని మహిళలందరూ సభ్యులుగా చేరనున్నారు. అధికారులు ఓటరు జాబితాలోని అర్హుల వివరాలు సేకరిస్తున్నారు. 18 ఏళ్లు నిండిన వివాహితలు అర్హులు. మహిళా సంఘాలు క్రమం తప్పకుండా పొదుపు సొమ్ము జమ చేయాల్సి ఉంటుంది. 6 నెలల తర్వాత సంఘం పొదుపుతో బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తారు. అనంతరం వాయిదా పద్ధతిలో కిస్తీలు చెల్లిస్తే ఏటా రుణ మొత్తాన్ని పెంచుతున్నారు. రూ.5 లక్షల వరకు రుణ వెసులుబాటు కల్పిస్తున్నారు. మహిళలు బ్యాంకు రుణాలతోపాటు పావలా వడ్డీతో స్త్రీనిధి రుణాలు పొందుతున్నారు.

జిల్లాలో మొత్తం సంఘాలు:	12,468
సభ్యులు:	1,36,536 మంది
వీవో సంఘాలు:	527
మండల సమాఖ్యలు:	16
జిల్లా సమాఖ్య:	1
కొత్తగా నమోదైన సంఘాలు:	1,280
సభ్యులు:	11,187 మంది

వివరాల సేకరణ

గ్రామాల్లో బీఎల్‌వోల సహకారంతో ఓటరు జాబితా పరిశీలిస్తున్నారు. సంఘాల్లో లేని సభ్యుల వాస్తవ పరిస్థితిని తెలుసుకుంటున్నారు. వలస వెళ్లారా, మరణించారా, 58 ఏళ్లు పైబడిన వారా, అవివాహితులా, రెండేసి చోట్ల ఓటు ఉందా, సంపన్నవర్గమా, ఉద్యోగస్తులా, మానసిక రుగ్మతలున్నాయా, మనుగడలేని సంఘాల్లో ఉన్నారా, ఇలా పలు రకాల ప్రశ్నలతో వివరాలు తెలుసుకుంటున్నారు. గ్రామైక్య సంఘాల ప్రతినిధులు, వీవోఏలు, సీసీలు ఓటరు జాబితా వడబోస్తున్నారు.

పేర్లు నమోదు చేసుకోండి



కొత్తగా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నాం. ఏ సంఘంలో నమోదు కాని మహిళలు గ్రామంలో ఉండే వీవోఏ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలి. దివ్యాంగులు, వృద్ధుల సంఘాలనూ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీలతారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

జిల్లాలో 8 వేల మంది వరకు నమోదయ్యే అవకాశం

కొత్తగా వీలైనన్ని సంఘాలు ఏర్పాటు చేయాలని సెర్ప్ అధికారులు నిర్దేశించారు. జిల్లాల వారీగా వివరాల జాబితా పంపించారు. 58 ఏళ్లు దాటి వృద్ధాప్య పింఛన్ పొందుతున్నవారితో పాటు దివ్యాంగులను గుర్తించనున్నారు. జిల్లాలో మహిళా ఓటర్లు అధికంగా ఉండగా మరో 8 వేల మంది వరకు సభ్యులుగా నమోదయ్యే అవకాశాలున్నాయి.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి

- చైల్డ్ రైట్స్ కమిషన్ మెంబర్ శోభారాణి



విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారులు

ఇల్లందకుంట(హుజూరాబాద్): కొత్తపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను చైల్డ్‌రైట్స్ కమిషన్ మెంబర్ శోభారాణి జిల్లా సంక్షేమాధికారి సబిత, డీఈవో జనార్దన్‌రావులతో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలల హక్కులు, జువైనల్ జస్టిస్ యాక్ట్, బాల కార్మికుల వ్యతిరేకతకు సంబంధించిన చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా రక్షణను పొందే అవకాశం ఉంటుందన్నారు. బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆపద సమయంలో 1098 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. బాలల హక్కులు, చట్టాలు సక్రమంగా అమలయ్యేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజికవేత్తలు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థినుల హాస్టల్‌ను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. అలాగే కొత్తగా నిర్మిస్తున్న కేజీబీవీని పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గర్ల్ చైల్డ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ కృపారాణి, డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ ఆంజనేయులు, చైల్డ్ వెల్ఫేర్ కమిషనర్ శాంతకుమారి, పాఠశాల ఎస్‌వో రమాదేవి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్



మొక్కలు పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వాసిరెడ్డి శ్రీధర్ అన్నారు. కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్‌లో వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖలు, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులు సాయిని రమేశ్, కటుకం స్వాతిలు 4 ఎకరాల్లో, చెర్లభూత్కూర్‌లో పెంతల రాజిరెడ్డి 2 ఎకరాల్లో బుధవారం ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో మొక్కను రూ.20 చొప్పున రైతులకు అందిస్తున్నారని, 90 శాతం సబ్సిడీపై డ్రిప్ సౌకర్యం ఉందన్నారు. మొక్కలు నాటిన మూడేళ్ల అనంతరం దిగుబడి ప్రారంభమై, 30 సంవత్సరాల వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ టి.లక్ష్మయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు పి.లలిత, సర్పంచులు మంజుల, రమణారెడ్డి, శ్రీనివాస్, ఉపసర్పంచు శ్రీకాంత్, ఏవో బి.సత్యం, ఏఈవో ప్రణయ్, ఉద్యాన అధికారి స్వాతి, ఆత్మ చైర్మన్ శ్రీనివాస్, ఆర్‌బీఎస్ జిల్లా సభ్యుడు ఎం.తిరుపతి, లోహియా కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేడు అలిశెట్టి సాహిత్య పురస్కార సభ

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో అలిశెట్టి ప్రభాకర్ రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కార సభ గురువారం సాయంత్రం 6.30 గంటలకు నగరంలోని ఫిలింభవన్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రచార కార్యదర్శి మెరుగు ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది పురస్కారాన్ని దివంగత సాహితీవేత్త నిజాం వెంకటేశంకు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ అవార్డును ఆయన కుటుంబసభ్యులకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమానికి అలిశెట్టి ప్రభాకర్ అభిమానులు, కవులు, రచయితలు తరలివచ్చి, విజయవంతం చేయాలని ప్రవీణ్ కోరారు.

కాంట్రాక్ట్ కార్మికులను వేధించడం సరికాదు

- ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి మేరుగు రాజయ్య

గోదావరిఖని(రామగుండం): కాంట్రాక్టు కార్మికులకు ఎంవీటీసీ అధికారులు లంచాల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి మేర్గు రాజయ్య ఆరోపించారు. అతితక్కువ వేతనాలున్న వారిని వేధించడం సరికాదన్నారు. బుధవారం గోదావరిఖనిలో ఆయన మాట్లాడారు. బొగ్గు గనుల వృత్తి శిక్షణ కేంద్రాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు 21 రోజుల శిక్షణనిచ్చిన అనంతరం మూడు రోజులు ఆన్ ది జాబ్(ఫీడ్ బ్యాక్) ట్రైనింగ్ ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. ఒక్కొక్కరి నుంచి రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. వృత్తి శిక్షణ కేంద్రాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు వేతనంతో కూడిన శిక్షణనివ్వాలని డిమాండ్ చేశారు. చట్టపరం అన్ని ఆర్థిక ప్రయోజనాలను కల్పించాలన్నారు.

వ్యక్తిపై కేసు

బోయినపల్లి(చొప్పదండి): మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా మంగళవారం కొదురుపాక వద్ద పెట్రోలింగ్ చేస్తున్న ఏఎస్సై చంద్రమౌళి విధులకు ఆటంకం కలిగించిన మండలంలోని నీలోజిపల్లికి చెందిన కొండం శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. తనను శ్రీనివాసరెడ్డి అడ్డుకుని విధులకు ఆటంకం కలిగించినట్లు ఏఎస్సై ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ముగిసిన పశువైద్యాధికారుల ప్రత్యేక శిక్షణ



శిక్షణ అనంతరం అధికారులతో పశువైద్యులు

కరీంనగర్ అర్బన్: పశువైద్యాధికారులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ బుధవారం ముగిసింది. 15 జిల్లాల అధికారులకు కరీంనగర్‌లోని ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణ కేంద్రంలో శిక్షణనిచ్చారు. 10 రోజులపాటు క్షేత్రస్థాయితోపాటు తరగతి గదిలో కాలానుగుణ వైద్యాన్ని వివరించారు. రిటైర్డ్ జేడీ డా.జి.విజయ్‌కుమార్, రిటైర్డ్ డీడీ డా.శర్మ, ఏడీలు డా.ఎస్.పి.రెడ్డి, డా.రాజిరెడ్డి శిక్షణనిచ్చారు.

జాతీయ జంబోరీలో మనోళ్ల సత్తా



జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్: స్కౌట్స్ అండ్ గైడ్స్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 11 వరకు 18వ జాతీయ జంబోరీ కార్యక్రమం రాజస్థాన్‌లో జరిగింది. జిల్లా నుంచి 15 మంది స్కౌట్స్, 13 మంది గైడ్స్ పాల్గొని, ప్రతిభ కనబరిచినట్లు జిల్లా కార్యదర్శి కంకణాల రాంరెడ్డి తెలిపారు. జాతీయస్థాయి కలర్ పార్టీ, మార్చ్ ఫాస్ట్‌లో ఆకాంక్ష, అద్వైత, సహస్ర, శ్రీహర్షలు సత్తా చాటినట్లు పేర్కొన్నారు. పీసెంటి షోలో యశ్వంత్, పిరమిడ్ ప్రదర్శనలో సూర్యతేజ, లోహిత్, ప్రణయ్ చంద్ర, యోగి నవీన్, రవితేజలు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను జిల్లా ట్రైనింగ్ కమిషనర్ షరీఫ్, లక్ష్మీనారాయణ, స్టేట్ ట్రైనింగ్ కమిషనర్ పరమేశ్వర్, భగవంతరావు తదితరులు అభినందించారు.

వాటర్ ట్యాంకు ఎక్కి రైతు నిరసన



ట్యాంకు ఎక్కిన సదానందం

ఇల్లంతకుంట(మానకొండూరు): మండలంలోని తిప్పాపూర్‌కు చెందిన రైతు మొద్దుల సదానందం బుధవారం గ్రామంలోని వాటర్‌ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపాడు. తన వ్యవసాయ భూమి డి–1 కెనాల్, అదనపు టీఎంసీ పైపులైన్ నిర్మాణాల్లో పోయిందన్నాడు. పరిహారం పూర్తిగా రాలేదని, తనకు ఇంకా భూమి ఉండాల్సి ఉంటుందని పేర్కొన్నాడు. సమస్య పరిష్కరించే వరకు దిగేది లేదని తేల్చిచెప్పాడు. విషయం తెలుసుకున్న ఎస్సై మహేందర్, సర్పంచ్ దమ్మని లక్ష్మి సంఘటన స్థలానికి చేరుకున్నారు. నచ్చజెప్పడంతో కిందికి దిగాడు. అనంతరం అతన్ని తహసీల్దార్ వద్దకు తీసుకెళ్లగా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సీసీ కెమెరాలతో పెరిగిన భరోసా

- ఏసీపీ కరుణాకర్‌రావు



మాట్లాడుతున్న ఏసీపీ కరుణాకర్‌రావు

చిగురుమామిడి(మానకొండూర్): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో ప్రజల్లో భరోసా పెరిగిందని, ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానమని కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు అన్నారు. బుధవారం కొండాపూర్‌లో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల భద్రత కోసం ఇలాంటి సాంకేతిక సాధనాలు ఎంతో అవసరమన్నారు. ప్రతీ గ్రామంలో కెమెరాల ఏర్పాటుకు ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్న చిగురుమామిడి ఎస్సై దాససుధాకర్, పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్త వినీత, జెడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్, ఎంపీడీవో నర్సయ్య, సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, సర్పంచు పెద్దపల్లి భవాని, పంచాయతీ కార్యదర్శి రాంకీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్ నాయక్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీల్లో ప్రతిభ



గవర్నర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న అస్మా జబీన్

శాతవాహన యూనివర్సిటీ(కరీంనగర్): ఇండియా అధ్యక్షతన జీ–20 సదస్సు అనే అంశంపై హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీల్లో ఎస్సారార్ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ తెలిపారు. ఉపన్యాస పోటీల్లో అస్మా జబీన్ ద్వితీయ స్థానం సాధించగా గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ చేతులమీదుగా వెండి పతకం, ప్రశంసా పత్రం, రూ.4,500 నగదు పురస్కారం అందుకుందని అన్నారు. తెలుగు విభాగంలో బి.అనూష, హిందీ విభాగంలో సర్దార్ సతీందర్ పాల్ సింగ్ ప్రోత్సాహక ప్రశంసాపత్రం, రూ.1000 పొందాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వి.వరప్రసాద్‌లను బుధవారం అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్ కళాశాల సలహాదారులు కె.సురేందర్ రెడ్డి, స్టాఫ్ సెక్రటరీ శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు చంద్రమౌళి, డీడీ నాయుడు, బి.సురేష్, బి.శారద, ఎన్‌సీసీ అధికారి పి.రాజు, అకాడమిక్ కో–ఆర్డినేటర్ టి.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు డెయిరీ యూనిట్లు తీసుకోవాలి



రంగవల్లులు వేస్తున్న విద్యార్థినులు



బహుమతి అందిస్తున్న డెయిరీ చైర్మన్, అతిథులు

- భారతీయ ఆగ్రో ఇండస్ట్రీస్ ఫౌండేషన్ చైర్మన్ భరత్
- కరీంనగర్ డెయిరీలో రంగవల్లుల పోటీలు

కరీంనగర్ అర్బన్: ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా రైతులందరూ డెయిరీ యూనిట్లు తీసుకోవాలని భారతీయ ఆగ్రో ఇండస్ట్రీస్ ఫౌండేషన్ చైర్మన్ భరత్ కకడే అన్నారు. బుధవారం కరీంనగర్ డెయిరీలో ముందస్తు సంక్రాంతి వేడుకల్లో భాగంగా రంగవల్లుల పోటీలు నిర్వహించారు. సహజ, సంప్రదాయ వ్యవసాయాన్ని చేపట్టడంలో డెయిరీ రైతుకు సహాయపడుతుందని అన్నారు. ఆవు పేడ, మూత్రాన్ని ఎరువులుగా ఉపయోగించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. రాష్ట్రంలోనే కరీంనగర్ డెయిరీ చైర్మన్ సీహెచ్ రాజేశ్వరరావు నేతృత్వంలో జీరోస్థాయి నుంచి నంబర్‌వన్ స్థాయికి చేరిందని పేర్కొన్నారు. కరీంనగర్ డెయిరీ తన ఉత్పత్తులను హైదరాబాద్ నగరంతోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో విక్రయిస్తూ మార్కెట్‌ను విస్తరింపచుకుంటోందని డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు తెలిపారు. 34 బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ల వారీగా నిర్వహించిన రంగోలి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, సీఏఐఎంఎస్ చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు, డెయిరీ ఎండీ పి.శంకర్ రెడ్డి, సలహాదారు వి.హనుమంత రెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనలు చేయాలి

- సౌతాఫ్రికా ప్రొఫెసర్ శ్రీకాంత్‌బాబు



శ్రీకాంత్‌బాబును సన్మానిస్తున్న అధ్యాపకులు

శాతవాహన యూనివర్సిటీ(కరీంనగర్): పరిశోధనలతోనే ప్రగతి సాధ్యమని సౌతాఫ్రికా క్వాజులు నటల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జొన్నలగడ్డ శ్రీకాంత్ బాబు అన్నారు. శాతవాహన యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన కెమిస్ట్రీ సదస్సుకు గెస్ట్ లెక్చరర్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠ్యాంశాలు విని, పరీక్షలు రాయడమే కాకుండా లోతైన పరిశోధనలు చేయాలని సూచించారు. రసాయన శాస్త్రంలోని పలు అంశాలను విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జయంతి, అధ్యాపకులు నమ్రత, సరసిజ, రాజు, విజయ్‌కుమార్, గణేశ్‌కుమార్, ఆర్.మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు

- ఫిబ్రవరి 15లోగా దరఖాస్తు చేసుకోవాలి
- సహాయ కార్మిక కమిషనర్ కోటేశ్వర్లు



సహాయ కార్మిక కమిషనర్ కోటేశ్వర్లు

కరీంనగర్: కార్మికుల పిల్లలు ఉపకార వేతనాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సహాయ కార్మిక కమిషనర్ కోటేశ్వర్లు సూచించారు. బుధవారం తన చాంబర్‌లో ఉపకార వేతనాల వివరాలను వెల్లడించారు. 2021–22 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన వారు ఫిబ్రవరి 15లోపు పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత కార్మిక శాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ చదివే వారికి రూ.1,000, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.1,500, ఇంజినీరింగ్, మెడిసిన్, లా, బీఎస్సీ (అగ్రికల్చర్, వెటర్నరీ, నర్సింగ్), బీఎస్సీ (హార్టికల్చర్), బీసీఏ, ఎంసీఏ, బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, బీబీఏ, ఎంబీఏ, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్, పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్ విద్యార్థులకు రూ.2,000 అందజేస్తారని తెలిపారు. మే 31 నాటికి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 94925 55245 నంబర్‌లో లేదా సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: జవహర్ నవోదయ విద్యాలయ చొప్పదండిలో 2023–24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్, విద్యాలయ చైర్మన్ ఆర్‌వీ కర్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని విద్యార్థులకు ఏప్రిల్ 29న పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. www.navodaya.gov.in వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. 5వ తరగతి ప్రస్తుతం ఏ జిల్లాలో చదువుతున్నారో ఆ జిల్లాలోనే దరఖాస్తు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94402 00220, 94903 95216, 99667 59402, 96662 55088 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సెమీస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలి

రామగిరి(మంథని): సింగరేణిలో పని చేస్తున్న బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. సెంటినరీకాలనీలోని జీఎం కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి బుధవారం ధర్నా చేపట్టారు. బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను సింగరేణి యాజమాన్యం దోచుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒప్పందం మేరకు సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా సెమీస్కిల్డ్ వేతనాలివ్వడంతో పాటు ఉచితంగా ఏఎంఈ, పీఎంఈ, చట్టబద్ధ హక్కులు అమలు చేయాలన్నారు. లేకపోతే సింగరేణి వ్యాప్తంగా బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులందరూ సమ్మెకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తోకల రమేశ్, ఉపాధ్యక్షుడు బి.అశోక్, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కుడార్లై ఉత్సవం



ధనుర్మాసోత్సవాల్లో భాగంగా కరీంనగర్‌లోని పలు ఆలయాలు, శ్రీవైష్ణవ సాంప్రదాయుల గృహాల్లో కుడార్లై వేడుకను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాయసాన్ని వండి నివేదన చేసి పాశురాన్ని అనుసంధానం చేశారు. భక్తులకు పాయస పాత్రలను వితరణ చేశారు. సప్తగిరికాలనీ రామాలయంలో అర్చకుడు కలకుంట్ల రామాచార్యులు, ఆలయ చైర్మన్ కె.గౌతమరావు, చాడగొండ బుచ్చిరెడ్డి, రామయ్య, రవీందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, వెంకటరెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు. మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయంలో పేచర్ల నరసింహాచార్యులు, పేచర్ల రామాచార్యులు, చైర్మన్ పిట్టల శ్రీనివాస్, ఈఈ. నాగారపు శ్రీనివాస్ పాల్గొన్నారు. - కరీంనగర్ కల్చరల్

చిత్ర కథ

మెకానిక్ సర్పంచ్



కరీంనగర్ మండలం ఫకీర్‌పేట గ్రామ సర్పంచ్ కటకం నందయ్య బుధవారం బోరు మరమ్మతు చేసే మెకానిక్‌గా మారారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి తాగునీటిని సరఫరా చేసే బోరు నాలుగు రోజుల నుంచి పనిచేయడం లేదు. తాగునీటి కోసం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు సర్పంచ్ నందయ్య దృష్టికి తీసుకొచ్చారు. స్వతహాగా మోటారు మెకానిక్ అయిన నందయ్య బుధవారం పంచాయతీ సిబ్బందితో కలిసి బోరు నుంచి పైపులను పైకి తీశారు. ఫుట్‌బాల్ చెడిపోవడంతో కొత్తది అమర్చి నీళ్లు పోయించడంతో ఉపాధ్యాయులు సర్పంచ్ నందయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. - కరీంనగర్‌రూరల్

అటెన్షన్ ప్లీజ్

చెత్త వేసేదెలా..



నగరంలోని కోర్టు నుంచి వావిలాలపల్లి వెళ్లే మార్గంలో నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన చెత్తకుండీలు ఇలా డ్రైనేజీలు పడేసి ఉన్నాయి. వీటిలో చెత్త ఎలా వేయాలని స్థానికులు అంటున్నారు. చెత్త కుండీలను సరిచేసి ఉపయోగపడేలా చూడాలని కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ప్రశ్నించాల్సిన అధికారి: ఇస్లావత్ సేవా, మున్సిపల్ కమిషనర్
సెల్ నంబర్: 98493 05876

వ్యాసరచన పోటీల్లో 'అల్ఫోర్స్' విద్యార్థినికి బహుమతి



గవర్నర్ తమిళసై నుంచి బహుమతి అందుకుంటున్న ఫిరదౌస్

కొత్తపల్లి: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జీ20 ఇండియా ప్రెసిడెన్సీ రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీల్లో శాతవాహన యూనివర్సిటీ తరఫున కరీంనగర్ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థిని శాహిస్తా ఫిర్దౌస్ పాల్గొని ప్రతిభ కనబర్చి చాన్స్‌లర్, గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతి అందుకున్నట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌యూ నోడల్ ఆఫీసర్ శ్రీవాణి, కళాశాల ప్రిన్సిపల్ గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో బుధవారం వికాస తరంగిణి ఆధ్వర్యంలో చల్మెడ ఆనందరావు ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి ప్రారంభించిన వైద్యశిబిరంలో 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్‌తో పాటు పలువురు వార్డుసభ్యులు, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.


సర్వవైదికసంస్థానం మేనేజింగ్ ట్రస్టీగా వరప్రసాద్



వరప్రసాద్

కరీంనగర్ కల్చరల్: నగరంలోని శ్రీపురంలో బుధవారం జరిగిన సర్వవైదిక సంస్థానం ట్రస్టు సర్వసభ్య సమావేశంలో మేనేజింగ్ ట్రస్టీగా శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులుగా నరెడ్ల బాబయ్య, కొదుమగుళ్ల సుగుణాకరాచార్య, కల్యాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీభాష్యం విజయసారథి నెలకొల్పిన ట్రస్టు, యజ్ఞవరాహక్షేత్ర ఔన్నత్యం మరింత పెంచేందుకు, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని సభ్యులు ప్రమాణం చేశారు. విజయసారథి స్మృత్యర్థం అనేక కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు.

మృతుల కుటుంబాలకు సాయం



ఆర్థికసాయం అందిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుమ్మరి లక్ష్మయ్య, సిరిసిల్ల లక్ష్మయ్య కుటుంబాలకు బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బియ్యంతోపాటు ఆర్థికసాయం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు చింతల కిషన్, పురుమల్ల శ్రీనివాస్, చక్రాధర్, రాంరెడ్డి, నర్సింహారెడ్డి, పూర్ణచందర్, సుధాకర్, షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో గ్రామీణ యువత

- పనిచేస్తూనే మరోవైపు సేవాకార్యక్రమాలు

కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన పలువురు యువకులు సామాజిక సేవలో తమ ప్రత్యేకతను చాటుతున్నారు. ఒకవైపు పనిచేస్తూనే మరోవైపు సేవాకార్యక్రమాలతో యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. - కరీంనగర్‌రూరల్

చిరంజీవి స్ఫూర్తిగా..



ఎంబీఏ చదివిన కపిల్ మాధవ్‌కు సినిమా హీరో చిరంజీవి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు స్ఫూర్తినిచ్చాయి. కపిల్ ఫౌండేషన్ స్థాపించి పలువురికి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు. కోవిడ్ సమయంలో ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు చెందిన వలస కూలీలకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించాడు. కూలీలకు ఉచితంగా బియ్యం, కూరగాయాలను పంపిణీ చేశారు. సొంతంగా ఏవేల మాస్కులను ఉచితంగా ప్రజలకు అందించాడు.

జంతుప్రేమికుడు సుమన్..



బొమ్మకల్ లయన్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న ఆసిరి సుమన్ మనుషులతోపాటు జంతువులకు సేవలను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ప్రమాదకరమైన పాములను పట్టి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడం, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన పశువులకు వైద్యసేవలందిస్తున్నాడు. వివాహాలు, ఇతర శుభకార్యాల్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలను సేకరించి పేదలకు అందించి ఆకలి తీర్చుతున్నారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

అనాథ ఆశ్రమంతో వృద్ధులకు ఆశ్రయం..



ఆర్‌ఎంపీగా పనిచేస్తున్న మంచికట్ల శ్రీనివాస్ సామాజిక సేవా చేయాలనే లక్ష్యంతో స్పందన యువసేన స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేశారు. ఆపదలో ఉన్న రోగులకు సకాలంలో రక్తదానం చేయాలనే ఉద్దేశ్యంతో రక్తదాతలతో కూడిన వాట్సప్‌గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి మందులు అందించారు. అనాథలైన వృద్ధులు, కొడుకులు పోషించలేని తల్లిదండ్రులకు ఆశ్రయం కల్పించేందుకు రామడుగు మండలం వెలిచాలలో ఇటీవల అనాథ ఆశ్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఆశ్రమంలో పదిమంది ఆశ్రయం పొందుతున్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు



కొత్తపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలత

కరీంనగర్ సిటీ: ప్రజల కంటి సమస్యలు దూరం చేయాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ చేపట్టిన కంటి వెలుగును విజయవంతం చేయాలని మేయర్ సునీల్‌రావు అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కంటి వెలుగుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. కంటి వెలుగుకు ఏర్పాటు చేయాల్సిన సదుపాయాలు, పరీక్షలు నిర్వహించే సెంటర్లు, వైద్యబృందాలు, వాటి పనితీరు, పరీక్షల ప్రణాళిక తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈనెల 18 నుంచి మే 25వ తేదీ వరకు డివిజన్ల వారీగా నిర్ణయించిన తేదీల్లో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నగరంలో 13 బృందాలను నియమించి సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. కమిషనర్ సేవా ఇస్లావత్, డిప్యూటీ మేయర్ స్వరూపరాణి, 60 డివిజన్ల కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నగరపాలక సంస్థ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్ అన్నారు. బుధవారం కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు సన్నాహక సమావేశంలో మాట్లాడారు. కంటి వెలుగు విజయవంతానికి గ్రామాల్లో దప్పు చాటింపు చేయాలన్నారు. ఎంపీడీవో ఏ.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, వైద్యాధికారి వంశీకృష్ణ, సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలని ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో కంటి వెలుగుపై నిర్వహించిన సమాయత్త సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో అందరికీ అందుబాటులోఉండే ప్రాంతంలో కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయాలన్నారు. శిబిరం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ప్రజాప్రతినిధులు చేయాలని సూచించారు. కంటి వెలుగు ప్రత్యేక వైద్యురాలు అరుణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ టి.లక్ష్మయ్య, మండల ప్రత్యేక అధికారి మధుసూదన్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జె.నర్సయ్య, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు బి.తిరుపతిగౌడ్‌తో పాటు పలువురు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


భవన నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి



వాచ్‌మెన్ గది పనులు ప్రారంభిస్తున్న మేయర్

కరీంనగర్ సిటీ: కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో నిర్మించే ప్రభుత్వ భవనాల్లో నాణ్యత పాటించాలని మేయర్ సునీల్‌రావు అన్నారు. కోర్టు సమీపంలోని నీటి రిజర్వాయర్ ప్రాంతంలో నగర పాలక సంస్థ రూ.11 లక్షల నిధులతో చేపట్టిన వాచ్‌మెన్ రూం, రూ.46 లక్షలతో చేపట్టిన స్టోర్‌రూం భవన నిర్మాణ పనులను బుధవారం కమిషనర్ సేవా ఇస్లావత్‌తో కలిసి ప్రారంభించారు. మంచినీటి రిజర్వాయర్‌లో రేకుల షెడ్డుతో కూడిన స్టోర్ రూం పూర్తిగా శిథిలమై సామగ్రి భద్రపర్చేందుకు ఇబ్బందిగా ఉండటంతో కొత్త స్టోర్‌రూం నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రాత్రింబవళ్లు రిజర్వాయర్‌ను భద్రంగా చూసే వాచ్‌మెన్‌కు కూడా ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాపర్తి విజయ, వాల రమణరావు, బండారి వేణు, సరిల్ల ప్రసాద్, డీసీపీ సుభాష్, ఈఈ మహేందర్, కిష్టప్ప, డీఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో మెరిసిన జిల్లా విద్యార్థులు



మొదటి బహుమతి అందుకుంటున్న శ్రీహరిణి

సప్తగిరికాలనీ(కరీంనగర్): రాష్ట్రస్థాయి బాలల వైజ్ఞానిక ప్రదర్శన-2022లో జిల్లా విద్యార్థులు మెరిసారు. ఈనెల 9 నుంచి 11 వరకు నిర్మల్‌లో జరిగిన 50వ వైజ్ఞానిక ప్రదర్శనలో కరీంనగర్ జిల్లా నుంచి పాల్గొన్న ఎ.శ్రీహరిణి(పారమిత) ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్‌లో శానిటరీ పాడ్స్ తయారు చేసిన ప్రదర్శన ప్రథమ బహుమతి పొంది జాతీయ స్థాయికి ఎంపికైంది. అదే విధంగా ఆటోమేటిక్ డ్రైనేజ్ క్లీనర్ ప్రదర్శన చేసిన ఎం.సాయివినీల్ (అల్ఫోర్స్) ద్వితీయస్థానం సాధించి సౌత్ ఇండియా స్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి చాడ జైపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్‌రావు, ఎస్‌పీఎస్‌సీ అకాడమిక్ కోఆర్డినేటర్ కేఎస్ అనంతాచార్యతో పాటు పలువురు అభినందించారు.

'సంచార మైనార్టీ బంధు ఇవ్వాలి'

విద్యానగర్: బీసీ–ఈ కేటగిరిలో ఉన్న 14 సంచార ముస్లిం తెగలకు సంచార మైనార్టీ బంధు అమలు చేయాలని సంచార ముస్లిం తెగల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ సాబీర్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అచ్చుకట్ల, అత్తరుసాయబులు, దర్వేష్, ఫకీర్, ఘంట ఫకీర్, ఎలుగుబంటి, బోరెవాలే, బొంతెవాలే తుర్కసా, గారడి ముస్లిం, పైల్వాన్లు, పాముల, బుగ్గలు ఆట బొమ్మలు అమ్మేవారు తదితర సంచార తెగలు అంతరించిపోకుండా ఆదుకునేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సమావేశంలో కార్యదర్శి షేక్ షేర్‌అలీ, మహ్మద్ షాదుల్లా, అబ్దులా అజీజ్, ఫాయాజ్, రషీద్, దవూద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'ఫండస్' వార్షికోత్సవం




వేడుకలను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ భగత్‌నగర్‌లోని ఫండస్ పాఠశాల 18వ వార్షికోత్సవం బుధవారం రాత్రి పాఠశాల ప్రాంగణంలో వైభవంగా జరిగింది. కరోనా వైరస్ కారణంగా మూడేళ్లు వార్షికోత్సవాలకు దూరంగా ఉన్న విద్యార్థులు పాల్గొని సందడి చేశారు సంస్కృతి సంప్రదాయలకు అద్దం పట్టేలా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అంతకుముందు వేడుకలను మేయర్ సునీల్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వేడుకల్లో ఫండస్ పాఠశాల కరస్పాండెంట్ పద్మజా ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ శశాంక్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి వేడుకల్లో పారమిత విద్యార్థులు



మాంటిస్సోరీలో..



శ్రీచైతన్య పాఠశాలలో..

కరీంనగర్‌లోని పలు పాఠశాలల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. పాఠశాలల ప్రాంగణమంతా విద్యార్థులు వేసిన రంగవల్లులు, గొబ్బెమ్మలతో సప్తవర్ణ శోభితంగా మారింది. విద్యార్థులు హరిదాసుల వేషధారణలో చేసిన కీర్తనలు, చిన్నారులను దీవించే కార్యక్రమం భోగిపళ్లు, భోగిమంటలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయినిలతో వేయబడిన తిరుప్పావై పారాయణ, చిట్టిపొట్టి చిన్నారులతో ప్రదర్శింపబడిన నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల చైర్మన్లు, డైరెక్టర్లు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. - సప్తగిరికాలనీ/విద్యానగర్/కొత్తపల్లి

రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్‌లో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: కరీంనగర్‌లో జగన్ చెస్ అకాడమీ నిర్వహించిన రాష్ట్రస్థాయి ర్యాపిడ్ ఓపెన్ చెస్ పోటీల్లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్‌కు చెందిన లిఖిత్‌కుమార్, టి.ఆశ్రుకాంత్‌లు ప్రతిభ కనబర్చి ప్రథమస్థానంలో నిలిచినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. చెస్ పోటీల్లో రాణించిన విద్యార్థులను బుధవారం అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన వెంకటసాయి, షాహెద్

కరీంనగర్‌స్పోర్ట్స్: విజయవాడలో గురువారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు జరుగనున్న 2వ సీనియర్, జూనియర్ బాలుర జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. కరీంనగర్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో రాణించిన కొత్తకొండ వెంకట సాయి సీనియర్స్ విభాగంలో, ఎండీ షాహెద్ జూనియర్స్ విభాగంలో ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఆరిఫ్, ఎండీ ముషాజిల్‌లు అభినందించారు.

పద్మశాలీ సంఘం కార్యవర్గం ఎన్నిక



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దామన్‌పల్లి గ్రామ పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దూడం మల్లేశం, ఉపాధ్యక్షులుగా గుండేటి కొండయ్య, దీకొండ శంకరయ్య, దాసరి మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా దాసరి అంజయ్య, సంయుక్త కార్యదర్శులుగా దూడం రాజశేఖర్, దాసరి రాజమల్లు, దూడం శ్రీనివాస్, కోశాధికారిగా బూర్ల లక్ష్మీరాజం ఎన్నికయ్యారు. కార్యవర్గసభ్యులుగా దూడం రమేశ్, దూడం లక్ష్మీనారాయణ, కార్నాటి రమేశ్, దశరథం, రమేశ్, శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గాన్ని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్, అధ్యక్షుడు శ్రీకాంత్, పద్మశాలీ సంక్షేమ ట్రస్టు ప్రధాన కార్యదర్శి భద్రయ్య తదితరులు అభినందించారు

మహిళా డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి

శాతవాహనయూనివర్సిటీ: కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగువిభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం ప్రకృతిహిత సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. రంగులు, రసాయన పదార్థాలు వాడకుండా కేవలం సుద్ద (ముగ్గుపిండి), సుద్దముక్క(చాక్ పీస్)తో మాత్రమే విద్యార్థులు తమ చిత్రలిపి కళను ప్రదర్శించారు. రెండు అంశాలుగా జరిగిన ఈ ముగ్గుల పోటీల్లో పిడికిలి ముగ్గు విభాగంలో బీకాం విద్యార్థి బరుగు స్వీటీ, చుక్కల ముగ్గు విభాగంలో బీయస్సీ విద్యార్థిని నిషాని స్వప్న బహుమతులు సాధించారు. అనంతరం విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షుడు, కార్యక్రమ సమన్వయకర్త మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి, తెలుగు అధ్యాపకులు కంజర్ల శ్రీలత, వెంకటరమణ, గాదెగోని పరిమళ, స్వప్న, శోభారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం



విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శిగా కరీంనగర్‌కు చెందిన కట్ల చంద్రమొగిలిని నియమించినట్లు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని సంఘ కార్యాలయంలో కట్ల చంద్రమొగిలికి కండువా కప్పి నియామకపత్రాన్ని అందజేశారు.


తిరుమల ఆలయం వెలుపల తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర రెడ్డి

ముగిసిన వైకుంఠ ద్వార దర్శనం

తిరుమల: వైకుంఠ ఏకాదశి పర్వదినాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం బుధవారం అర్ధరాత్రితో ముగిసింది. గురువారం నుంచి యథావిధిగా శ్రీవారి కార్యక్రమాలు జరగనున్నాయి. తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. టైమ్ స్లాట్ టోకెన్లు పొందిన వారికి కేటాయించిన నిర్ణీత సమయంలో త్వరితగతిన దర్శనం లభిస్తోంది. శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. అలాగే కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని కూడా ఆయన దర్శించుకున్నారు. కాగా, డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. ఈవో ఏవీ ధర్మారెడ్డితో మాట్లాడదలచుకున్న భక్తులు 0877-2263261 ఫోన్ నంబర్లో సంప్రదించవచ్చు.

వాల్తేర్ వీరయ్యకు రూ.25, వీరసింహారెడ్డికి రూ.20


10 రోజులు టికెట్ల ధరలు పెంపునకు అనుమతి

సాక్షి, అమరావతి: వాల్తేర్ వీరయ్య, వీరసింహారెడ్డి సినిమాల టికెట్ల ధరలను 10 రోజులపాటు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆ సినిమా నిర్మాతలు తమ సినిమాల బడ్జెట్ వివరాలతో సమర్పించిన దరఖాస్తులను హోం శాఖ కమిటీ పరిశీలించి టికెట్ల ధర పెంపుపై సిఫార్సు చేసింది. దీంతో వాల్తేర్ వీరయ్య సినిమాకు టికెట్‌పై గరిష్టంగా రూ.25 చొప్పున, వీరసింహారెడ్డి సినిమాకు రూ.20 చొప్పున పెంపుదలకు అనుమతినిస్తూ హోం శాఖ బుధవారం ఉత్తర్వులిచ్చింది.

నా'రా'బంధువులే'!

టీడీపీ పెద్దల గుప్పిట్లో బడుగుల అసైన్డ్ భూములు

- అమరావతిలో చంద్రబాబు బృందం అక్రమాలు బట్టబయలు
- జీపీఏ, సేల్‌డీడ్లతో 'పచ్చ ముఠా' దందా
- ఇప్పటివరకు సీఐడీ గుర్తించిన అసైన్డ్ భూములు 932.72 ఎకరాలు
- వాటి మార్కెట్ విలువ రూ.3,730.88 కోట్లు
- మాజీ మంత్రి నారాయణ సమీప బంధువుల పేరిట 140 ఎకరాలు
- నారాయణ విద్యా సంస్థలు, రామకృష్ణ హౌసింగ్ ఉద్యోగుల ఖాతాలో 200 ఎకరాలు
- టీడీపీ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీవీ వియ్యంకుడి పేరిట 40 ఎకరాలు
- చంద్రబాబు బినామీలు, సన్నిహితులు, టీడీపీ నేతల పేరిట 540 ఎకరాలు
- అన్యాక్రాంతమైన మొత్తం అసైన్డ్ భూములు 1,400 ఎకరాలు.. మార్కెట్ విలువ రూ.5,600 కోట్లు



సాక్షి, అమరావతి: అసైన్డ్ భూముల్లో వాలిపోయిన భూ రాబందుల అక్రమాలు బహిర్గతమయ్యాయి. బడుగు, బలహీన వర్గాల రైతులను బెదిరించి 932.72 ఎకరాల అసైన్డ్ భూములను పచ్చ గద్దలు కాజేసినట్లు వెల్లడైంది. గ్రామాల వారీగా ఎల్లో గ్యాంగ్ అసైన్డ్ భూముల అక్రమాల చిట్టా రట్టైంది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2014- 18 మధ్య పోటు చేసుకున్న ఈ దారుణాలు సీఐడీ దర్యాప్తులో ఆధార సహితంగా, రియల్ ఎస్టేట్ అక్రమ సామ్రాజ్యం భౌగోళిక సరిహద్దులతో సహా వెలుగు చూశాయి. ఇప్పటివరకు బట్టబయలైన అసైన్డ్ భూములు 932.72 ఎకరాలు. చంద్రబాబు చెప్పిన ప్రకారం వాటి మార్కెట్ విలువ ఏకంగా రూ.3,730.88 కోట్లకు పైమాటే! కొనసాగుతున్న సీఐడీ దర్యాప్తులో మరిన్ని అసైన్డ్ బాగోతాలు వెలుగు చూసే అవకాశాలున్నాయి.

కార్యాలయాల వారీగా రికార్డుల పరిశీలన..

రాజధాని అమరావతి ప్రాంతంలో 2014 నాటికి ఎస్సీ, బీసీ రైతుల పేరిట ఉన్న అసైన్డ్ భూములు గత సర్కారు హయాంలో ఇతరుల పేరుతో సీఆర్‌డీఏ రికార్డుల్లో నమోదు కావడం గమనార్హం. సీఐడీ దర్యాప్తులో గుర్తించిన అసైన్డ్ భూముల రికార్డులను గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారులు ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీ చేయించారు. అమరావతి పరిధిలో 932.72 ఎకరాల అసైన్డ్ భూములను టీడీపీ పెద్దలు కొల్లగొట్టినట్టు ఇప్పటివరకు నిర్ధారించారు. భూ సమీకరణ కోసం ఏర్పాటైన సీఆర్‌డీఏ కార్యాలయాల వారీగా రికార్డులను పరిశీలించి నిజాలు నిగ్గు తేల్చారు. మొత్తం 23 సీఆర్‌డీఏ కార్యాలయాల పరిధిలో 932.72 ఎకరాల అసైన్డ్ భూములను కాజేసినట్లు ఆధారాలతో సహా నిరూపితమైంది. రాజధాని నిర్మాణం తరువాత అమరావతిలో ఎకరా మార్కెట్ విలువ కనీసం రూ.4 కోట్లకు చేరుతుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించారు. ఆ ప్రకారం టీడీపీ పెద్దలు హస్తగతం చేసుకున్న 932.72 ఎకరాల అసైన్డ్ భూముల మార్కెట్ విలువ రూ.3,730.88 కోట్లకు పైమాటేనని పరిశీలకులు చెబుతున్నారు.

మొత్తం అసైన్డ్ అక్రమాలు రూ.5,600 కోట్లు!

సీఐడీ దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ మరిన్ని అసైన్డ్ భూముల అక్రమాలు వెలుగు చూసే అవకాశాలున్నాయి. అమరావతి పరిధిలో మొత్తం 1,400 ఎకరాల అసైన్డ్ భూముల రికార్డులను తారుమారు చేసినట్లు గతంలోనే సీఐడీ ప్రాథమికంగా గుర్తించింది ఆ ప్రకారం టీడీపీ నేతలు దక్కించుకున్న అసైన్డ్ భూముల విలువ రూ.5,600 కోట్లని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి.

'నారా'యణ బంధువులు, బినామీలే..


అసైన్డ్ భూముల అక్రమాల తీగ లాగితే నారా చంద్రబాబు, పొంగూరు నారాయణ బంధువులు, బినామీల ఇళ్లల్లో డొంక కదులుతోంది. బినామీలు, బంధువుల పేరిట అసైన్డ్ భూములను జీపీఏ, సేల్ డీడ్ల ద్వారా హస్తగతం చేసుకున్నట్లు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. టీడీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు సమీప బంధువు పేరిట కూడా అసైన్డ్ భూములను కొల్లగొట్టారు. నారాయణ విద్యా సంస్థలు, ఆయన సమీప బంధువుకు చెందిన రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ చిరుద్యోగుల పేరిట అసైన్డ్ భూములను కాజేశారు. ఇప్పటివరకు గుర్తించిన 932.72 ఎకరాల అసైన్డ్ భూముల సేల్‌డీడ్లు, జీపీఏలను సీఐడీ అధికారులు విశ్లేషించగా ఈ అక్రమాలు వెలుగుచూశాయి.

అమరావతిలో ఎల్లో గ్యాంగ్ అసైన్డ్ దందా గ్రామాలవారీగా

గ్రామం	అసైన్డ్ భూములు ఎకరాల్లో
కృష్ణాయపాలెం	9.31
నవులూరు-1	29 30
నవులూరు-2	12.89
కురగల్లు-1	225.34
కురగల్లు-2	2.14
నిడమానూరు-1	63.43
నిడమానూరు-2	41 62
ఉండవల్లి	5.45
పెనుమాక	2.37
లింగాయపాలెం	153.90
ఉద్దండరాయనిపాలెం	20.31
బోరుపాలెం	1.25
ఏచుకలపాలెం	9.99
నెక్కల్లు	17.17
నేలపాడు	17.36
తుళ్లూరు-1	43.19
తుళ్లూరు-2	12.52
అనంతవరం	6.96
రాయపూడి-1	87.28
కొండమరాజుపాలెం	6.47
వెలగపూడి	3.30
వెంకటపాలెం	27.39
మందడం-2	133 80
మొత్తం	**932.72**

'ఎన్‌స్పైర'లో కీలక ఆధారాలు స్వాధీనం

మాజీ మంత్రి పి.నారాయణ కుటుంబానికి చెందిన హైదరాబాద్‌లోని 'ఎన్ స్పైర' మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కార్యాలయంలో సీఐడీ అధికారుల సోదాలు బుధవారం ముగిశాయి. కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లు, బ్యాంకు ఖాతా లావాదేవీల పత్రాలు, ఇతర కీలక రికార్డులను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకుని విశ్లేషిస్తున్నారు. మునుముందు మరిన్ని కీలక అంశాలు బహిర్గతమవుతాయని భావిస్తున్నారు.


జగనన్న తోడు లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'చిరు' రుణాల్లో ఏపీ ఫస్ట్

- చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాల్లో దేశ చరిత్రలోనే రాష్ట్రం రికార్డు
- దేశ వ్యాప్తంగా 24.06 లక్షల మందికి రుణాలు.. ఇందులో ఒక్క ఏపీలోనే 15.31 లక్షలు
- జగనన్న తోడు లబ్ధిదారుల ఖాతాల్లో వడ్డీ జమ చేసిన సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాలు ఇవ్వడంలో దేశ చరిత్రలోనే ఆంధ్రప్రదేశ్ రికార్డు సృష్టించిందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. దేశంలో మొత్తం మీద చిరు వ్యాపారులకు 24.06 లక్షల మందికి రుణాలు ఇస్తే, ఇందులో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే జగనన్న తోడు పథకం కింద 15.31 లక్షల మందికి రుణాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రుణాల లెక్కన తీసుకుంటే దేశ వ్యాప్తంగా 39.21 లక్షల రుణాలకు గాను, ఒక్క మన రాష్ట్రంలో మాత్రమే 24.06 లక్షల మందికి రుణాలు ఇచ్చామన్నారు. జగనన్న తోడు పథకం కింద చిరు వ్యాపారులకు ఆరవ విడత రూ.10 వేల వరకు వడ్డీ లేని రుణాలను ఇచ్చే కార్యక్రమాన్ని బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున 3.95 లక్షల మంది చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారికి బ్యాంకుల ద్వారా కొత్తగా రూ.395 కోట్ల రుణాలు అందించడంతో పాటు, గత 6 నెలలకు సంబంధించిన రూ.15.17 కోట్ల వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను కంప్యూటర్‌లో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. చిరు వ్యాపారుల్లో 80 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములకు 'జగనన్న తోడు' అందుతోందని తెలిపారు. 3.95 లక్షల మందిలో 3.67 లక్షల మంది సకాలంలో రుణాలు చెల్లించి, మళ్లీ రెండోసారి రుణాలు తీసుకుంటున్నారని చెప్పారు. వీరు కాక మరో 28 వేల మందికి ఇవాళ రుణాలు ఇస్తూ కొత్తగా ఈ పథకంలో తీసుకొచ్చామన్నారు. మొత్తంమ్మీద జగనన్న తోడు ద్వారా దాదాపు 15.31 లక్షల చిరు వ్యాపారుల కుటుంబాలకు మంచి జరుగుతోందని స్పష్టం చేశారు.

47 హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో 47 హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుల భర్తీకి వైద్య శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. https://dmeaponline.com వెబ్‌సైట్ లో ఆన్‌లైన్ అప్లికేషన్‌ను అందుబాటులో ఉంచారు. బుధవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలు పెట్టారు. అర్హులైన వైద్యులు ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.వెయ్యి, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.750 చొప్పున దరఖాస్తు రుసుం ఉంటుంది రెండేళ్ల కాలపరిమితితో కాంట్రాక్ట్ ప్రాతిపదిక పోస్టుల భర్తీ చేపడతారు. ఎంబీబీఎస్/బీడీఎస్ పూర్తి చేసి హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్ డిగ్రీ/హాస్పిటల్ మేనేజ్‌మెంట్/ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్/ఎంబీఏ హ్యూమన్ రీసోర్స్ కోర్సులు చేసి, ఇతర అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నాటికి గరిష్ట వయోపరిమితి 42 ఏళ్లు మించకుండా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు వయోపరిమితి నుంచి మినహాయింపు ఉంటుంది. http://hmfw.ap.gov.in వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్‌ను అందుబాటులో ఉంచారు

జనసంద్రంగా జాతీయ బంజారా దీక్షభూమి

- ఘనంగా గురుకృప దినోత్సవం
- భోగ్ బండారో నిర్వహించిన దీక్షగురువు ప్రేంసింగ్ మహరాజ్
- ఎంపీ, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేల హాజరు


భోగ్ బండారో నిర్వహిస్తున్న ప్రేంసింగ్ మహరాజ్


ప్రేంసింగ్‌మహరాజ్‌కు ప్రజాప్రతినిధుల సన్మానం

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం కొత్తపల్లి-హెచ్ గ్రామంలోని జాతీయ బంజారా దీక్ష భూమి బుధవారం జనసంద్రమైంది. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి 10వేల మంది లంబాడాలు తరలిరాగా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. జాతీయ బంజారా దీక్ష భూమి పీఠాధిపతి, దీక్ష గురువు ప్రేంసింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో గురుకృప(గురు శిష్యుల మిలన్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజ చేసి భోగ్ బండారో నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, రాథోడ్ బాపురావు, రేఖానాయక్, మహారాష్ట్రకు చెందిన హజ్‌గావ్ ఎమ్మెల్యే మాధవ్‌పాటిల్, టీసీసీ చైర్మన్, కేంద్ర మాజీ మంత్రి హన్స్‌రాజ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. లంబాడా మహిళలు సంప్రదాయ నృత్యాలు, పాటలతో హోరెత్తించారు. రాష్ట్రంలోని ఏకైక బంజారా దీక్షభూమి వద్ద గురుకృప దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దీక్ష గురువు ప్రేంసింగ్ మహరాజ్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక భావంతోనే సమాజం జాగృతం అవుతుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ చదువుకునేలా చూడాలని, బాల్య వివాహాలను అరికట్టాలని సూచించారు.

దీక్షభూమి అభివృద్ధికి కృషి


దీక్షభూమి అభివృద్ధికి కోసం కృషి చేస్తామని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు హామీ ఇచ్చారు. మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంనాయక్, బంజారా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ శ్రీరాం, నార్నూర్ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, జేఏసీ నాయకుడు నారాయణ్, టీటీజేఏ జిల్లా అధ్యక్షుడు రమేశ్ నాయక్, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్మారాం నాయక్, ఆలయ కమిటీ సభ్యులు రాథోడ్ రామేశ్వర్, గ్రామ పెద్దలు గంగారాంనాయక్, శాక్రు నాయక్, యశ్వంతరావు, డిగాంబర్ ఉన్నారు.

రూ.10లక్షలు ప్రకటించిన ఎంపీ

దీక్షభూమి వద్ద నిర్వహించిన గురుకృప దినోత్సవంలో ఎంపీ సోయం బాపూరావు ప్రత్యేక పూజలు చేశారు. దీక్షభూమి అభివృద్ధి, వసతుల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. ఎంపీ నిధుల నుంచి తక్షణమే రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కేంద్రం నిధుల మంజూరుకూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ నాయకులు అజ్మీరా ఆత్మారాంనాయక్, రెడ్డినాయక్ తదితరులున్నారు.

స్క్వాడ్ కారు అద్దాలు ధ్వంసం చేసిన విద్యార్థులు

- ఇచ్చోడ మండల కేంద్రంలో ఘటన
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన స్క్వాడ్


విద్యార్థుల దాడిలో ధ్వంసమైన కారు

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో బుధవారం డిగ్రీ పరీక్ష రాస్తున్న పలువురు విద్యార్థులు ఫ్లయింగ్‌స్క్వాడ్ కారు అద్దాలు ధ్వంసం చేశారు. ఐదు డిగ్రీ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి డిగ్రీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం నాటి పరీక్షలో మాస్‌కాపీయింగ్ పాల్పడిన 19 మంది విద్యార్థులను ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రేమ్‌చంద్ డిబార్ చేశారు. దీంతో కొందరు విద్యార్థులు స్క్వాడ్ కారును అడ్డగించి వాహనం వెనుక అద్దాలు ధ్వంసం చేశారు. కాగా, డిబార్ చేశాననే కక్షతోనే కొందరు విద్యార్థులు తన కారు అద్దాలు ధ్వంసం చేశారని ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రేమ్‌చంద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్సై ఉదయ్‌కుమార్‌ను సంప్రదించగా ఘటనపై దర్యాప్తు చేపడతామని తెలిపారు. దాడికి కారకులను గుర్తించి కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. కాగా, ఓ కళాశాల యాజమాన్యం మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహించి విద్యార్థులను దాడికి ఉసిగొల్పిందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి

రాష్ట్రస్థాయి వ్యాసరచనలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ప్రతిభ


ఆర్జీయూకేటీ విద్యార్థులకు అవార్డు ప్రదానం చేస్తున్న గవర్నర్ తమిళిసై

బాసర(ముథోల్): జీ-20 దేశాలకు భారత్ సారథ్యం వహిస్తున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ కార్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఆర్జీయూకేటీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. విజేతలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై బహుమతులు ప్రదానం చేశారు. వసుధైక కుటుంబం, లేదా 'వన్ ఎర్త్' అనే అంశాలపై ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బాసర ట్రిపుల్ ఐటీ నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు వ్యాస రచనలో ఈ3 విద్యార్థి వి.శ్రుతి ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం, రూ.6 వేల నగదు గెలుచుకుంది. ఉర్దూ వ్యాసరచనలో ఈ1 విద్యార్థి ఆయేషా సాబ్యా ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం, రూ.6 వేల నగదు గెలుచుకుందని ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ తెలిపారు. ఈ బహుమతులను గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ ప్రదానం చేశారని పేర్కొన్నారు. విద్య, క్రీడారంగాలతోపాటు వివిధ సృజనాత్మక సాహిత్య సాంస్కృతిక కళారంగాల్లో ఆర్జీయూకేటీ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్, రూ.1000 నగదు బహుమతి ప్రదానం చేశారని పేర్కొన్నారు.

సైనికులను స్మరిస్తూ సైకిల్‌యాత్ర



దిలీప్‌భరత్‌ను సన్మానిస్తున్న సభ్యులు

పాతమంచిర్యాల: భారతదేశం కోసం అమరులైన వారిని స్మరిస్తూ.. దేశ గొప్పతనాన్ని తెలియజేయడానికి నాగ్‌పూర్‌కు చెందిన దిలీప్‌భరత్ చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం మంచిర్యాలకు చేరింది. మంచిర్యాల హైటెక్‌సిటీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మడుపు రాంప్రకాష్, చెట్ల రామయ్య, చుంచు గురువయ్య, మల్లికార్జున్ అతడికి స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా దిలీప్‌భరత్ మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకోవడానికి, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి యాత్ర చేపట్టినట్లు తెలిపాడు. 2022ఆగస్టు 5న యాత్ర ప్రారంభించానని, దేశంలో 45,700 కిలోమీటర్లు సైకిల్‌యాత్ర నిర్వహించి గిన్నిస్‌బుక్ రికార్డు సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు.

ప్రభాకరా.. నువ్వు బతికుండాల్సింది..

- జనవరి 12న ఒక విషాదమైన రోజు.. ఎవరో ఎగరేసిన జెండా తనకు తానుగా అవనతమైన రోజు.. మరణమెప్పుడూ చివరి చరణం కాదనే సంక్షోభ గీతం ఆలపించిన రోజు.. కవిత్వాన్ని అధ్యయనం చేస్తూ.. చిక్కడపల్లి సెంటర్‌లో తప్పిపోయిన నా జగిత్యాల పోరడు.. సిటీలైఫ్‌లో మంటల జెండాలు ఎగరెయ్యడానికి పోయి మళ్లీ రాలేదు.
- ఈ జనవరి 12.. నీ పుట్టిన రోజు నాన్నా.. అంటూ నా జగిత్యాల జనం అక్షర నక్షత్రాలు వెలిగిస్తుంటే..
- ఈ జనవరి 12.. నీ వర్ధంతి కన్నా.. అంటూ ఆ భాగ్యనగరం కన్నీళ్లని కవన భాషలోకి అనువదిస్తోంది.

\- నేడు అలిశెట్టి వర్ధంతి, జయంతి



నిజమే.. నువ్వు క్షమార్హుడివి కావు. తెలంగాణ ఉద్యమానికి నీ కవిత్వం తోడైతే ఎలా ఉండేది? నీలోని చిత్రకారుడు ఎంతగా స్పందించేవాడు? రాజకీయ నాయకులపై ఎంతగొప్ప కవిత రాశావ్.. ఒకనక్క ప్రమాణస్వీకారం చేసిందంట.. ఇంకెవర్ని మోసగించనని.. ఒక పులి పశ్చాత్తాపం ప్రకటించిందట.. తోటి జంతువుల్ని సంహరించనని.. ఈ కట్టుకథల్ని నమ్మబోమని గొర్రెలు పుర్రెలూపుతున్నాయి.. గాయపడ్డ ఉద్యమాన్ని చూసినప్పుడల్లా గుండెల్లో స్ట్రా గుచ్చినట్లు జ్ఞాపకాలు చురకలంటిస్తాయి. అరచేతిలో అదృష్ట రేఖలకు బదులు రక్తరేఖలు చూసుకుంటూ వందలాది క్యానమైసన్లు పాడి చేసుకుంటూ.. పచ్చగా బతికినోడివి. పత్రహరితం కోల్పోయిన మొక్కవై అద్దంలో చూసుకున్నప్పుడైనా చేటలో కన్నీళ్లు చెరుగుతున్న భాగ్యమ్మ కళ్లలోకి చూసుకున్నప్పుడైనా సిగరెట్లకి.. క్యాన్సర్లకి మధ్యవర్తిత్వాన్ని నెరిపే పొగని తరిమెయ్యలేకపోయాం.. దాన్యపు గింజలొలిస్తే రైతు అస్థిపంజరాలు రాలిపడే దయనీయ దృశ్యాల్లో.. ఎడారిలో కన్నీటి ఒయాసిస్సులు నింపిన వేశ్యల ఆకలి మూలుగుల్లో.. ఏకే 47 గర్జనల్లో నువ్వే ముఖచిత్రమై కన్పిస్తావు.. సిద్ధాంత గ్రంథాల సారమెందుకురా.. ఇంటిముందు నుంచి సాగిపోయిన నా జగిత్యాల జైత్రయాత్ర 1978 సెప్టెంబర్ 9లోని పాదధూళి చాలు.. కవిత్వంతో కరచాలనం చేయడానికి కన్నావ్.. తెలంగాణ ఉద్యమంలో పిట్టల్లా రాలిపోయిన తల్లుల గర్భశోకాన్ని అర్థవంతంగా అక్షరబద్ధం చేయడానికి నువ్వు బతికుండాల్సి ఉండే.. నీ కవిత్వమింకా.. ఇంకా రావాల్సి ఉండే.. అందుకే నువ్ క్షమార్హుడివి కావు..

మన జగిత్యాలలో ప్రామిసరీ నోట్టై వెలిగిన వాడివి.. నగరం పోయాక ఆకలి సంతకమయ్యావు.. ఇక్కడి సాహిత్య పార్టీల్లో ఎక్కడా నీ పేరు కన్పించనివ్వరు.. ఎందుకంటే నాలుగులైన్ల నీ కవితొక్కటి చాలు.. వెయ్యి పేజీల వాళ్ల కవిత్వ చరిత్రను మింగివేయడానికి.. అవును మరి.. చూసిచూసి ఎవడైనా బాంబుల బతుకమ్మని నెత్తికెత్తుకుంటాడా.. ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది 1947.. ఇన్నేళ్ల ఆకలి నిరుద్యోగం కలిసి మనకిచ్చింది ఒక ఏకే 47.. అడవుల్లోనూ అజ్ఞాత వీరులా.. గుండెల్లోనూ ఈ కవిత కదన సూచనలా ఇంకా కదలాడుతూనే ఉంది.

ఒరేయ్ ప్రభాకర్.. నా ఆయుష్షు నీకిస్తాను రారా.. అని విలపించిన కాళోజీ కలలో కూడా నీ కవిత్వాన్ని మాత్రమే పలవరించే ఎమ్వీయల్.. నీ కవిత్వాన్ని ప్రేరేపించిన కొంగరి జగ్గయ్య.. అందరూ నీదగ్గరికి వచ్చారు.


తాను శవమై.. ఒకరికి వశమై.. తనువు పుండై. ఒకరికి పండై.. ఎప్పుడూ ఎడారై.. ఎందరికో ఒయాసిస్సై.. జీవితాంతం కలల మతకోబరాలు కాలుతున్నచోట ఈ కవిత ప్రతిధ్వనిస్తూనే ఉంది.. వేదన భరితమైన ఈ కవిత చిత్ర వేశ్యవాటికనే పలకమీద దిద్దినప్పుడు నీకు 18 ఏళ్లు అని ఎందరికి తెలుసు.. తెలంగాణ ఉద్యమాన్ని గమనిస్తే నీ కవితే గుర్తొస్తుంది.. ఎర్రెర్రని గాయాన్ని గాయంగా మాత్రమే పరిగణించే వీలు లేదు.. అదొక ప్రమాదసూచిక, ప్రారంభ సంచిక. కవిగా.. చిత్రకారుడిగా.. ఫొటోగ్రాఫర్‌గా నన్ను పునీతం చేశావు.. నా మట్టిని విశ్వవ్యాప్తం చేశావు.. నువ్వెప్పుడో రాసిన 'నువ్వే' కవిత గుర్తొస్తే ఉస్మానియా కళ్లల్లో మెదులుతారు.. అశ్రుభరిత నయనంలో నువ్వే.. క్షతగాత్రుడి నేత్రంలో నువ్వే.. అయితేనేం.. ధ్వజాల హారంలో నువ్వే.. ఉజ్వల భవితవ్యంలో నీ నవ్వే.. నీ ప్రతి కవితా కాలేకడుపుల కన్నీటి దృశ్యమై కదిలిపోతుంది.. ఎన్నెన్ని కవితలు.. ఎన్నెన్ని వెతలు.. నీ ఊపిరితిత్తుల్లో క్షయ రాజుకున్నావ్.. మందులు కొనుక్కోలేని నిర్భాగ్యనగరం'లో రక్తం ముద్దలుగా పడుతున్న రోజుల్లో కూడా కవిత్వాన్ని నీ వ్యక్తిత్వానికి మోకరిల్లాల్సిందే . చనిపోయిన రోజు కూడా కవిత రాసిన ధీరత్వానికి నమస్కరించాల్సిందే..



మరణం నా చివరి చరణం కాదు మౌనం నా చితాభస్మం కాదు మసోహ రాకాశంలో విలపించే చంద్రఖింబం నా అశ్రుకణం కాదు.. అంటూ నిన్ను నువ్వు నిర్వహించుకుని వెళ్లిపోతే గుండెలు చిదుకుంది.. గొంతు చిదుకుంది సాహితీలోకం.. ఇప్పటికీ నువ్వులేక 30 ఏళ్లు.. అయినా.. ఆ తడి నా జగిత్యాల జీవనాడిలో ఆగిపోని అలజడి.

\- జగిత్యాల

కవిత్వానికి జాతీయ జెండా



తెలుగు మినీ కవిత్వంలో ఒక జాతీయ జెండా లాంటివాడు అలిశెట్టి ప్రభాకర్. ఆయన కవిత్వమే కాదు జీవితం కూడా ఒక సంక్షోభ గీతం. చనిపోయే రోజు కూడా 'మరణం.. నా చివరి చరణం కాదు'అంటూ కవిత రాయడం ఆయనకే చెల్లింది. వేశ్య మీద రాసిన కవితకు సమానమైన కవిత ఇప్పటి వరకు ఎవరూ రాయలేకపోయారు. ఆ కవిత రాసినప్పుడు ఆయన వయస్సు 18 ఏళ్లు అని చాలా మందికి తెలియదు. అలిశెట్టి కవితలను ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాలలో ప్రవేశ పెట్టడం తెలంగాణ కవులకు ఒక గుర్తింపు లభించినట్లు. ఆయన గొప్ప కవే కాదు, గొప్ప చిత్రకారుడు. ఆయన కవితల్ని, చిత్రాల్ని జగిత్యాలలో ప్రదర్శించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

\- కేపీ నరేందర్, ప్రముఖ కథా రచయిత

పొట్టి కవితల గట్టి కవి



పదాల పరిమితమే కానీ వాటికి పదునే అపరిమితం. తక్కువ పదాల్లో ఎక్కువ భావాన్ని జొప్పించి సూటిగా ప్రశ్నించడమే ఆయన కవిత్వం. పొట్టి కవితల్లోనే తనవాదాన్ని గట్టిగా విన్పించే కవి అలిశెట్టి ప్రభాకర్. ఏనాడూ కవిత్వాన్ని అమ్ముకోలేదు. తాను నమ్మిన సిద్ధాంతాల దారిలోనే నడిచాడు. అక్షరం ఊపిరిగా చివరి వరకు పోరాడాడు. ఆయన జననం, మరణం ఒకే రోజు ఆవడం ఎంతో గొప్పది.

\- అయిత అనిత, రచయిత, జగిత్యాల



• 'ఆర్‌ఆర్‌ఆర్‌'లో రామ్ చరణ్, ఎన్టీఆర్



• ఎం. ఎం. కీరవాణి

గోల్డెన్ నాటు

తెలుగు నాటు యమా హిట్టు

నాటుదనంలో మాయామర్మం ఉండదు.
నాటుదనంలో కల్లాకపటం ఉండదు.
నాటుదనంలో హొయలు వగలు ఉండవు.
నాటుదనంలో తళుకూ జిలుగూ ఉండవు.
నాటుదనం గ్రామీణం.
నాటుదనం భోళాతనం.
నాటుదనం సాంస్కృతిక వరం.
నాటుదనం మేకప్పు లేని సౌందర్యం.
అందుకే ప్రపంచం మెచ్చింది.
తెలుగు నాటుదనానికి చరిత్రాత్మక గుర్తింపునిచ్చింది.
78 ఏళ్లుగా ఇస్తున్న హాలీవుడ్ గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో భారతదేశం నుంచి అందునా తెలుగు నుంచి మొట్ట మొదటిసారి 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్'గా ఆర్.ఆర్.ఆర్ లోని 'నాటు నాటు' పాట అవార్డు గెలుచుకుంది.
సంగీత దర్శకుడు కీరవాణి తెలుగు కీర్తిని పెంచారు.
రాసినవారు, పాడినవారు, ఆడినవారు, ఆడించినవారు, ఆదరించిన తెలుగు కుటుంబాలు సెలబ్రేట్ చేసుకోవాల్సిన సమయం ఇది.
పరమ నాటు సమయం.

పాట కూడా ఒక్కోసారి బాకులా గుచ్చుకుంటుంది. గజమో రెండు గజాలో దూరం కాకుండా సముద్రాలు దాటి తియ్యటి గాటు పెడుతుంది. పల్లవి చెంప నిమురుతుంది. చరణం గుండె తడుముతుంది. పదం పదం కలిసి జ్వరం తెప్పించి వెర్రెక్కిస్తుంది. భాష తెలియని భావం అక్కర్లేని నాదం ముందుకు దుముకుతుంది. హోరున తాకే జలపాతం కింద నిలబడినవాడి జాతి ఏదైతే ఏంటి... రీతి ఏదైతే ఏంటి... నిలువునా తడిపేస్తుంది. పాట కూడా అంతే.

పొలం గట్టు దుమ్ములోన పోట్ల గిత్త దూకినట్టు
పోలేరమ్మ జాతరలో పోతరాజు ఊగినట్టు...

అది గుంటూరు మిర్చి పొలం కావచ్చు. బహుశా నెల్లూరు పోలేరమ్మ జాతర కావచ్చు. కాకుంటే లష్కర్ బోనాలు కావచ్చు. అయితే మేడారం మహా సంగమం కావచ్చు. తెలుగు దనం అది. తెలుగు ఘనం. తెలుగు జనం. తెలుగు జయం. గ్రామీణ తేటదనం. అమాయక నాటుదనం. అది ఊరి పెద్దమనిషి తలపాగ. పేదరైతు భుజాన కండువ. నిండు గాజుల ఇల్లాలి నుదుటి బొట్టు. రోకలి దంచే యువతి చెంపన చెమట చుక్క. అది నిర్మల్ కొయ్య బొమ్మ. కొండపల్లి పూలకొమ్మ. ఉత్త నాటు సౌందర్యం. ఖమ్మేటి సౌందర్యం.

నాటు నాటు నాటు నాటు నాటు వీర నాటు
నాటు నాటు నాటు నాటు నాటు ఊర నాటు

ఈ నాటు ఇప్పుడు ప్రపంచాన్ని గెలిచింది. సినిమా ద్వారా అయితేనేమి తెలుగు మాట ఖండాంతరాలలో మోగింది. తెలుగు బాణీ దేశదేశాల వాళ్లతో చిందులు వేయించింది. తెలుగు దరువు భూగోళాన్ని దండనకర ఆడించింది. తెలుగువారికి ఏం తక్కువ? మనకంటే ఎవరు ఎక్కువ?

చులకన చేయని ఘనత

ఆర్.ఆర్.ఆర్‌లో 'నాటు నాటు' పాట వచ్చే సందర్భం ఆంగ్లేయులు తమను తాము గొప్ప చేసుకుంటూ తెలుగు వారికి ఏం వచ్చు అని ప్రశ్నించే సందర్భం. వాళ్ల స్టయిలు డాన్సులు, సైను స్టెప్పులే గొప్ప అనుకుంటూ కథా నాయకులైన రామ్‌ను, భీమ్‌ను నిలదీసే సందర్భం. దానికి జవాబుగా తెలుగువారు రంగంలోకి దిగితే పరిస్థితి ఎంత నాటుగా ఉంటుందో హీరోలు చెప్పాలి. అందుకు పాట కావాలి. గీత రచయిత చంద్రబోస్‌కు సిట్యుయేషన్ చెప్పి 'నువ్వు ఏదైనా రాయి మన ఘనత దాటుకునేలా ఉండాలి. ఎదుటివారిని అవమానించేలా తిట్లేలా ఉండకూడదు' అన్నాడు దర్శకుడు రాజమౌళి. ఇంగ్లిష్ వాణ్ణి తిట్టకుండా చెంప పగులగొట్టాలన్న మాట. చల్లగరిగ (జయశంకర్ భూపాలపల్లి జిల్లా) లాంటి చిన్న పల్లెలో పుట్టిన చంద్రబోస్‌కి తెలుగు వేగం, తెలంగాణ యోగం తెలియనిది ఏముంది? పాట పుట్టింది.

కిర్రు సెప్పులేసుకుని కర్రసాము సేసినట్టు
మర్రిసెట్టు నీడలోన కుర్రగుంపు కూడినట్టు
ఎర్రజొన్న రొట్టెలోన మిరపతొక్కు కలిపినట్టు
నా పాట చూడు
నాటు నాటు నాటు నాటు నాటు నాటు వీర నాటు

చంద్రబోస్ మొత్తం పాట రాశాక కీరవాణి దానికి ట్యూన్ చేశారు. పాట రాశాక ఫైనల్ వెర్షన్‌గా పాట బయట పడటానికి మధ్య దాదాపు 19 నెలలు ఉన్నాయి కరోనా వల్ల. 'లోపలున్న పాన మంతా దుముకు దుముకులాడేలా' చంద్రబోస్ రాయడం, 'వొంటిలోన రగత మంతా రంకెలేసి ఎగిరేలా' కీరవాణి ట్యూన్ చేయడం... దాంతో అది కోటి ఈలల పాటైంది. జపాన్ వాడి ఈల.. రష్యావాడి ఈల... చైనా వాడిదీ... అమెరికా వాడిదీనూ.

పాదాల తుఫాను

రికార్డింగ్ థియేటర్‌లో వాయుగుండం బలపడింది. ఇక అది తెర మీద తుఫానులా తాకాలి. గంటకు 240 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయాలి. పులి ఒకరు, బెబ్బులి ఒకరుగా ఇద్దరు హీరోలు... ఎన్టీఆర్, రామ్ చరణ్ సిద్ధంగా ఉన్నారు. వీరి కాళ్లకు గజ్జెలు కట్టే వీరుడు కావాలి. ప్రేమ్ రక్షిత్. ఈ పాండిచ్చేరి కుర్రాడు హైదరాబాద్‌నే తన రెండో ఇల్లు చేసుకున్నాడు. కొరియోగ్రఫీని ఒంట్లో నింపుకున్నాడు. 'ఈ పాటను నువ్వు ఎలాగైనా కంపోజ్ చెయ్. కాని ఇద్దరు హీరోలు ఈక్వల్‌గా కనిపించాలి' అనేది దర్శకుడి షరతు. 'ఎవరి ఎనర్జీ లెవల్ కూడా తగ్గినట్టుగా స్క్రీన్ మీద ఉండరాదు' అన్నాడు దర్శకుడు. ప్రేమ్ రక్షిత్ పాటను అందుకున్నాడు. నెల రోజులు తపస్సు చేశాడు. హుక్ స్టెప్ (వైరల్ అయిన స్టెప్) కోసం యాభై రకాల మూమెంట్స్ సిద్ధం చేస్తే దర్శకుడికి ఇప్పుడు ఉన్నది నచ్చింది. పాట కోసం మొత్తం 94 రకాల మూవ్‌మెంట్స్‌ని కంపోజ్ చేశాడు ప్రేమ్ రక్షిత్. పాటను ఉక్రెయిన్‌లో ప్రెసిడెంట్ ప్యాలెస్ దగ్గర 20 రోజులు షూట్ చేశారు. ఇద్దరూ సింగిల్ టేక్ ఆర్టిస్టులే అయినా పర్‌ఫెక్ట్ సింక్ కోసం దాదాపు 46 రీటేకులు అయ్యాయి.


• చంద్రబోస్


• ప్రేమ్ రక్షిత్

నాటు నాటు నాచో నాచో

తెలుగు తమిళ మలయాళ హిందీ భాషల్లో నాటు నాటు వీర నాటు హిట్ కొట్టింది. ఇందులోని హుక్ స్టెప్‌ను అబాల గోపాలం ఇమిటేట్ చేసింది. యూ ట్యూబ్ షాట్స్, ఇన్‌స్టా రీల్స్ వందల వేలుగా తయారయ్యాయి. సల్మాన్ ఖాన్, అమిర్ ఖాన్ కూడా ఈ స్టెప్‌ను రిపీట్ చేశారు. ప్రపంచమంతా తెలుగు మోత మోగింది. ఒకప్పుడు రాజ్ కపూర్ చేసిన 'ఆవారా హూ' పాట ఇంత పెద్ద హిట్ అయ్యింది. తమిళంలో రహెమాన్ చేసిన 'తిల్లానా తిల్లానా' ఇలాగే హిట్ అయ్యింది. ఇప్పుడు తెలుగు వంతు.

మన జానపదం, మన నాటుదనం ఇప్పుడు కేకమీదున్నాయి. ఇది తెలుగు ఘనం. ఇది తెలుగు జయం.


• ప్రణతి, ఎన్టీఆర్, రాజమౌళి, రమ, శ్రీవల్లి, కీరవాణి, ఉపాసన, రామ్‌చరణ్, కార్తికేయ, శోభు యార్లగడ్డ

ఊర నాటు స్టెప్ విశ్వ విజేత అయింది. తెలుగు సినిమా సత్తాను ప్రపంచవ్యాప్తంగా చాటిన 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'నాటు నాటు.. ఊర నాటు.. వీర నాటు' పాట గ్లోబల్‌గా గెలిచింది. 80వ గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ స్కోర్' విభాగంలో చిత్రసంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణికి అవార్డు దక్కేలా చేసింది. భారతీయ కాలమానం ప్రకారం బుధవారం ఉదయం కాలిఫోర్నియాలోని బెవర్లీ హిల్స్‌లో గల 'ది బెవర్లీ హిల్టన్' వేదికగా గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ వేడుక జరిగింది. హాలీవుడ్ ఫారిన్ ప్రెస్ అసోసియేషన్ (హెచ్‌ఎఫ్‌పీఏ) మంగళవారం రాత్రి విజేతలకు అవార్డులు ప్రదానం చేసింది. బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగం విజేతను ప్రకటిస్తూ, 'అండ్ ది అవార్డ్ గోస్ టు నాటు నాటు...' అని హోస్ట్ ప్రకటించగానే రాజమౌళి, ఎన్టీఆర్, రామ్ చరణ్, ఇంకా 'ఆర్‌ఆర్‌ఆర్' యూనిట్ నిలబడి, చప్పట్లతో ఆనందం వ్యక్తం చేశారు. ఇంకా వీక్షకుల కరతాళ ధ్వనుల మధ్య ఎం.ఎం. కీరవాణి అవార్డు అందుకున్నారు.

రిహాన్నా.. లేడీ గాగాలతో పోటీ పడి..

'బెస్ట్ ఒరిజినల్ సాంగ్-మోషన్ పిక్చర్' కేటగిరీలో భారత్ నుంచి ఒక పాటకు అవార్డు లభించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. టేలర్ స్విఫ్ట్, రిహాన్నా, లేడీ గాగా వంటి ప్రపంచ ప్రఖ్యాత గాయకుల పాటలతో పోటీలో నిల్చి కీరవాణి 'నాటు నాటు...' గెలిచింది. కాగా 'బెస్ట్ ఒరిజినల్ స్కోర్' విభాగంతో పాటు 'బెస్ట్ పిక్చర్-నాన్ ఇంగ్లిష్' కేటగిరీలోనూ 'ఆర్‌ఆర్‌ఆర్' నామినేట్ అయినప్పటికీ అవార్డు మాత్రం అర్జెంటీనా చారిత్రక చిత్రం 'అర్జెంటీనా 1985'కు దక్కింది.

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్‌ఆర్‌ఆర్' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకాదరణ పొంది, సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇప్పటికే పలు అంతర్జాతీయ అవార్డులు అందుకున్న ఈ చిత్రం ఆస్కార్ అవార్డ్స్ తర్వాత అంతటి ప్రతిష్ఠాత్మకంగా భావింపబడుతున్న 'గోల్డెన్ గ్లోబ్' అవార్డు అందుకోవడం పట్ల ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా ప్రేక్షకులు అభినందనలు కురిపించారు. ఇక ఈ వేడుకకు రాజమౌళి, కీరవాణి, ఎన్టీఆర్, రామ్ చరణ్ సతీసమేతంగా హాజరయ్యారు. కీరవాణి ఉద్వేగభరిత స్పందన, హీరోలిద్దరి ఎనర్జిటిక్ స్పీచ్.. ప్రపంచ ప్రేక్షకులను ఆకట్టుకుంది. కాగా 'ఆర్‌ఆర్‌ఆర్'కి గోల్డెన్ గ్లోబ్ అవార్డు వచ్చిన సందర్భంగా అమితాబ్ బచ్చన్, రజనీకాంత్, కమల్‌హాసన్, చిరంజీవి, బాలకృష్ణ తదితర సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

థ్యాంక్యూ శ్రీవల్లి - ఎం.ఎం. కీరవాణి

అవార్డు స్వీకరించిన అనంతరం ఎం.ఎం. కీరవాణి మాట్లాడుతూ– ''ధన్యవాదాలు.. ప్రతిష్ఠాత్మక గోల్డెన్ గ్లోబ్ అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ ఉద్వేగాన్ని ఈ ప్రాంగణంలో ఇక్కడే కూర్చుని ఉన్న నా వైఫ్ (శ్రీవల్లి)తో షేర్ చేసుకోవడం నాకు ఆనందంగా ఉంది. మామూలుగా అవార్డులు అందుకున్నప్పుడు 'నిజానికి ఇది నాది కాదు.. మరొకరికి దక్కుతుంది' అని అంటుంటారు. అందుకని ఇలాంటి అవార్డు అందుకున్నప్పుడు నేను అలా మాట్లాడకూడదని ప్లాన్ చేసుకున్నాను. కానీ సారీ... (నవ్వుతూ) నేను ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాను. ఎందుకంటే ఇవి నా హృదయంలోంచి వచ్చే మాటలు. వరుస క్రమంలో చెప్పాలంటే ముందుగా ఈ అవార్డు నా సోదరుడు, ఈ సినిమా డైరెక్టర్ రాజమౌళి విజన్‌కి దక్కుతుంది. నా పనిని నమ్మి, నన్ను సపోర్ట్ చేస్తున్నందుకు తనకు ధన్యవాదాలు. తర్వాత ప్రేమ్ రక్షిత్ గురించి చెప్పాలి. అద్భుతమైన కొరియోగ్రఫీ చేశారు. తను లేకపోతే ఈ పాట లేదు. తర్వాత ఈ పాటకు అన్నీ సమకూర్చిన కాలభైరవ, అద్భుతంగా రాసిన రచయిత చంద్రబోస్, కాలభైరవతో కలిసి ఎనర్జిటిక్‌గా పాడిన రాహుల్ సిప్లిగంజ్, ఫుల్ స్టామినాతో డ్యాన్స్ చేసిన ఎన్.టి. రామారావు, రామ్‌చరణ్‌లకు ధన్యవాదాలు. చివరిగా.. ఈ పాటకు ప్రోగ్రామ్ చేసిన సాహం సిద్ధార్థ్, జీవన్‌బాబులకు కూడా ధన్యవాదాలు. ఇంకొన్ని వర్డ్స్ షేర్ చేసుకోవాలనుకుంటున్నాను. అదేంటంటే.. థ్యాంక్యూ శ్రీవల్లి... థ్యాంక్యూ వల్లీ'' అంటూ ఉద్వేగంగా ప్రసంగించారు.

20 రోజులు.. 20 కోట్లు - 'ఆర్‌ఆర్‌ఆర్' నిర్మాత డీవీవీ దానయ్య



''మా 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'నాటు నాటు..' పాటకు ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కడం ఆనందంగా ఉంది'' అని చిత్రనిర్మాత డీవీవీ దానయ్య అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ – ''ఈ పాట తీసేముందు హీరోలిద్దరూ 30 రోజులు ప్రాక్టీస్ చేశారు. ఆ తర్వాత 20 రోజులు చిత్రీకరణకు పట్టింది. ఈ ఒక్క పాటకే దాదాపు రూ. 20 కోట్లు ఖర్చు పెట్టాం. ఉక్రెయిన్‌లో తీశాం. ఎన్టీఆర్, రామ్‌చరణ్‌గార్లతో పాటు అక్కడి జూనియర్ ఆర్టిస్టులు, డ్యాన్సర్లు.. ఇలా ప్రతిరోజూ రెండువేల మంది ఉండేవారు. కీరవాణిగారు ఇచ్చిన గొప్ప ట్యూన్‌కి చంద్రబోస్‌గారు గొప్పగా రాస్తే, ప్రేమ్ రక్షిత్ అద్భుతంగా కొరియోగ్రఫీ చేశారు. హీరోలిద్దరూ ఎంతో కష్టపడి చేశారు. ఇద్దరికీ కాళ్లు నొప్పులు ఉండేవి. కాసేపు గ్యాప్ తీసుకుని, చేసేవారు. నొప్పులతోనే డ్యాన్స్ చేశారు'' అన్నారు. ఒక్క పాటకు 20 కోట్లంటే ఎక్కువ ఖర్చు అనిపించలేదా? అనడిగితే – ''లేదు. రాజమౌళిగారి మీద నమ్మకంతో వెనకాడలేదు. ఇవాళ ఈ పాట ప్రపంచవ్యాప్తంగా అందర్నీ ఆకట్టుకుని మా నమ్మకాన్ని నిలబెట్టింది'' అన్నారు డీవీవీ దానయ్య.



ఐరన్ మ్యాన్ అంటే ఇష్టం - ఎన్టీఆర్

''రాజమౌళితో 'ఆర్‌ఆర్‌ఆర్' చేస్తున్నప్పుడే ఈ సినిమా ఎక్కువమందికి రీచ్ అవుతుందని తెలుసు. ఆయనతో సినిమాలు చేయడం వల్ల, ఆయన ట్రాక్ రికార్డుని దృష్టిని పెట్టుకోవడం వల్ల తప్పకుండా మేం గెలుస్తామనే నమ్మకం ఏర్పడింది'' అన్నారు ఎన్టీఆర్. మార్వెల్ సినిమాల గురించి విలేకరి అడిగితే... ''మార్వెల్ సినిమా చేయాలని ఉంది. నా ఫ్యాన్స్ దీని గురించి క్రేజీగా మాట్లాడుకుంటున్నారు. నాకు ఐరన్ మ్యాన్ అంటే ఇష్టం. ఆ క్యారెక్టర్ మాకు దగ్గరగా అనిపిస్తుంది'' అని అన్నారు. అది మాత్రమే కాదు.. ''ఇవాళ మీ బర్త్‌డే కదూ.. హ్యాపీ బర్త్‌డే... మీకో చిన్న గిఫ్ట్. మీకు నచ్చుతుందనుకుంటున్నా'' అంటూ ఓ గిఫ్ట్‌ని విలేకరికి అందజేశారు ఎన్టీఆర్.

అది అందమైన టార్చర్ - రామ్‌చరణ్

''మా టీమ్ కష్టమే మమ్మల్ని ఇంతదాకా తీసుకువచ్చింది. అదొక అందమైన టార్చర్. సౌత్ ఇండియా నుంచి సినిమాలకు ఎంతో పాపులర్ అయిన ఈ ప్రాంతానికి రావడం, ప్రశంసలు పొందడం మాకు ఎనర్జీని ఇచ్చే విషయం. నాకిష్టమైన ప్లేస్ ఇది. హాలిడే ట్రిప్స్‌కి వస్తుంటాను. ఈ 80వ గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌కి రావడం ఆనందంగా ఉంది'' అన్నారు రామ్‌చరణ్. కాగా 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం 'మార్వెల్' మూవీస్‌ని తలపించిందని, మీరు మార్వెల్ యాక్టర్‌లా కనిపించారని, మార్వెల్ స్టార్‌గా, సూపర్ హీరోగా చేయాలనుకుంటున్నారా? అని రామ్‌చరణ్‌ని ఓ విలేకరి అడగ్గా, ''తప్పకుండా చేస్తాను. నా ఫేవరెట్ మార్వెల్ మూవీ 'కెప్టెన్ అమెరికా'' అన్నారు. అవార్డు వేడుకకు ముందు రెడ్ కార్పెట్ పై ఇంకా మాట్లాడుతూ – ''ఇక్కడి టాప్ టెక్నీషియన్లతో పని చేయాలని ఉంది. అలాగే మా భారతదేశంలో అద్భుతమైన సూపర్ హీరోలు ఉన్నారు. వారి నటనని ఇక్కడి దర్శకులు ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన అవసరం ఉంది'' అని రామ్‌చరణ్ అన్నారు. ఒకవేళ మీ సినిమాకి అవార్డు వస్తే అని విలేకరి అడగ్గా– ''మా డైరెక్టర్ రాజమౌళి గారిని ఆ అవార్డుని నాకు ఇవ్వమని అడుగుతాను. కొన్ని రోజులు మా ఇంట్లో ఉంచుకుని ఆ తర్వాత వెనక్కి ఇచ్చేస్తాను'' అన్నారు.

మాటలు రావడం లేదు. సంగీతానికి హద్దులు లేవు. నాకు 'నాటు నాటు..' లాంటి పాట ఇచ్చిన పెద్దన్నా (కీరవాణి) మీకు శుభాకాంక్షలు. ధన్యవాదాలు. ఇది (అవార్డు) చాలా ప్రత్యేకమైనది. 'నాటు నాటు...' స్టెప్ వేస్తూ, ప్రపంచవ్యాప్తంగా పాపులర్ చేసిన ఫ్యాన్స్‌కి ధన్యవాదాలు.
– రాజమౌళి

ఇద్దరు స్టార్స్‌కి కొరియోగ్రాఫ్ చేయడం అనేది పెద్ద సవాల్. ఎందుకంటే ఒక్కో స్టార్‌కి ఒక్కో స్టైల్ ఉంటుంది. 'నాటు నాటు..'కి రెండు స్టయిల్స్ తీసుకుని, ఒకే స్టయిల్‌గా మార్చడం జరిగింది. నేను సవాల్‌గా తీసుకుని ఈ పాట చేశాను. కొరియోగ్రాఫ్ చేయడానికి నాకు రెండు నెలలు పట్టింది. చిత్రీకరణకు 20 రోజులు. 43 రీటేక్స్ తీసుకోవడం జరిగింది. మొదట్లో కొంచెం భయం అనిపించింది. ఎందుకంటే ఇద్దరు స్టార్స్‌ని సమానంగా చూపించాలి. అందుకే చివరి వరకూ పాటకు మెరుగులు దిద్దుతూనే ఉండేవాళ్లం.
– ప్రేమ్ రక్షిత్, కొరియోగ్రాఫర్

కీరవాణి సార్‌తో నా ప్రయాణం ఒక దశాబ్దం నాటిది. సార్ నన్ను నమ్మి 'నాటు నాటు..'ని నాలుగు భాషల్లో పాడేలా చేశారు. ఇది నాకు అద్భుతమైన అవకాశం. 'ఆర్‌ఆర్‌ఆర్'కి పాడటం అనేది నాకో పెద్ద చాలెంజ్. నిరూపించుకోవాలని చాలా కష్టపడి పాట పాడాను. ఈ పాటను పెద్ద హిట్ చేసినందుకు యావత్ భారతదేశానికి ధన్యవాదాలు.
– రాహుల్ సిప్లిగంజ్, గాయకుడు



''నా జీవితంలో మరచిపోలేని మధుర క్షణాలివి. ఎందుకంటే 'నాటు నాటు' పాట విశ్వ వేదిక మీద విజయం సాధించింది. రచయితగా చాలా చాలా సంతోషంగా, గర్వంగా ఉంది'' అన్నారు చంద్రబోస్. ''28 ఏళ్ల ప్రస్థానం, 850 చిత్రాలు, 3,600లకు పైగా పాటలు... మొట్ట మొదటి పాట 'తాజ్‌మహల్'లోని 'మంచు కొండల్లోన చంద్రమా..' నుండి ఇప్పటి 'వాల్తేరు వీరయ్య'లోని పాట వరకూ.. ప్రతి పాటకూ తపస్సే, మథనమే జ్వలనమే. 3500 సార్లకు పైగా తపస్సు చేస్తే ఒక్కసారైనా భగవంతుడు ప్రత్యక్షమవ్వడు కదా, ఈసారి 'నాటు నాటు..' పాటకు భగవంతుడు ప్రత్యక్షం అయి, వరం ఇచ్చాడని భావిస్తున్నాను.
– చంద్రబోస్, రచయిత

ప్రతి భారతీయుడిని గర్వించేలా చేసింది
– నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి



''ఈ విజయం చాలా ప్రత్యేకం. కీరవాణి, ప్రేమ్ రక్షిత్, కాలభైరవ, చంద్రబోస్, రాహుల్ సిప్లిగంజ్‌లకు అభినందనలు. ఎస్.ఎస్. రాజమౌళి, జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్‌తో పాటు 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్ర బృందానికి అభినందనలు. ఈ ప్రతిష్ఠాత్మక గౌరవం ప్రతి భారతీయుడిని ఎంతగానో గర్వించేలా చేసింది'' అన్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. చిత్ర బృందాన్ని అభినందిస్తూ ట్వీట్ చేశారు.

మరిన్ని విజయాలు సాధించాలి
– విశ్వభూషణ్ హరిచందన్, గవర్నర్



'నాటు నాటు' గోల్డెన్ గ్లోబ్ అవార్డు సాధించినందుకు 'ఆర్‌ఆర్‌ఆర్' యూనిట్‌ని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అభినందించారు. ఈ పాటకు అవార్డు రావడం ద్వారా తెలుగు సినిమా ప్రపంచ సంగీత వేదికపై గర్వించదగ్గ స్థాయిలో నిలిచిందన్నారు. తెలుగు సినీ పరిశ్రమ భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని గవర్నర్ ఆకాంక్షించినట్లుగా రాజ్ భవన్ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి.

ఆర్‌ఆర్‌ఆర్ టీమ్‌కు అభినందనలు
– వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి



ప్రతిష్ఠాత్మకమైన గోల్డెన్ గ్లోబ్ అవార్డు సాధించి తెలుగుతెందాను రెపరెపలాడించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్ర యూనిట్‌ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. 'ఆర్‌ఆర్‌ఆర్' సాధించిన ఈ విజయాన్ని చూసి గర్వపడుతున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ట్వీట్ చేశారు. చిత్ర మ్యూజిక్ డైరెక్టర్ ఎం.ఎం. కీరవాణి, దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, హీరోలు తారక్ (జూనియర్ ఎన్టీఆర్), రామ్ చరణ్‌తోపాటు 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా టీమ్ మొత్తానికి అభినందనలు తెలిపారు.

తెలుగు పాటకు దక్కిన గౌరవం
– కిషన్ రెడ్డి, కేంద్రమంత్రి



'నాటు నాటు' పాటకు గోల్డెన్ గ్లోబ్ అవార్డు దక్కడం భారతీయ సంగీతానికి, ప్రత్యేకంగా తెలుగు పాటకు దక్కిన అద్భుత గౌరవమని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి, దర్శకుడు రాజమౌళి, నటులు రామ్‌చరణ్, ఎన్టీఆర్‌తో పాటు యావత్ చిత్ర యూనిట్‌కు ఆయన అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మన సంగీతం, మన కొరియోగ్రఫీ, మన దర్శకత్వం, మన చిత్రాలు మరింత గుర్తింపును అందుకోవాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు.

క్లుప్తంగా...

మోదీ నాయకత్వంలో దేశం అప్పుల కుప్ప

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధులేవీ?: ఎమ్మెల్సీ ఎల్.రమణ



సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అప్పుల కుప్పగా మారిందని, మేకిన్ ఇండియా నినాదానికే పరిమితమైందని శాసన మండలి సభ్యులు ఎల్.రమణ విమర్శించారు. బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం నేత, వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించే ఉద్దేశంతో చేపట్టిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ 18 వేల మగ్గాలను గుర్తించి చేనేత రంగానికి చేయూతను అందించారని, కరోనా సమయంలో చేనేత కార్మికులను ఆదుకునేందుకు సుమారు రూ.వంద కోట్లు విడుదల చేస్తే...అదే చేనేత రంగంపై ప్రధాని మోదీ జీఎస్టీని విధించారని, ఆ నిర్ణయంపై వ్యతిరేకత ఎదురుకావడంతో జీఎస్టీని ఐదు శాతానికి కుదించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జీఎస్టీ విధింపును వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంటులో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టిన విషయాన్ని రమణ గుర్తు చేశారు.

దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలను అణగదొక్కే యత్నం

మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



సాక్షి ప్రతినిధి, వరంగల్: ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపుగా వ్యవహరిస్తోందని, ఒక దశలో ఆ రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కుట్రలు కూడా చేస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఆరోపించారు. బుధవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో విలేకరుల సమావేశంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎంపీ సీతారాం నాయక్‌లతో కలిసి శ్రీహరి మాట్లాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రం వైఖరి అసమానతలను పెంచేలా ఉందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కుల, మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా బీజేపీ వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. దళిత మేధావులు, ప్రజాస్వామికవాదులు అప్రమత్తమవ్వాలని కడియం సూచించారు. 2011 జనాభా ప్రకారం విద్య, ఉద్యోగాల్లో ఎస్సీలకు 16.6 శాతం, ఎస్టీలకు 8.6 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉండగా.. 1961 నుంచి 2021 వరకు ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్లను పెంచలేదని వెల్లడించారు. 1961 జనాభా ప్రకారం విద్య, ఉద్యోగాల్లో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, వాస్తవంగా ఇప్పుడున్న జనాభా ప్రకారం ఎస్సీలకు 18, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కడియం డిమాండ్ చేశారు. 18న ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు.

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్


టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏవీఎన్‌రెడ్డి

ఖరారు చేసిన బీజేపీ

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్, ఏవీఎన్ ఇంజనీరింగ్ కాలేజీ, విద్యాసంస్థల అధినేత ఎ.వెంకటనారాయణరెడ్డి (ఏవీఎన్‌రెడ్డి) పేరును బీజేపీ ఖరారు చేసింది. బుధవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ అనుమతితో ఆయన్ను అభ్యర్థిగా ప్రకటించారు. ఈ మేరకు టీచర్ ఎమ్మెల్సీగా పోటీకి అనుమతివ్వాల్సిందిగా ఆయన పెట్టుకున్న దరఖాస్తుకు ఆమోదం తెలిపారు.

బీఆర్‌ఎస్‌తో పొత్తుపై ఇప్పుడే ఏమీ చెప్పలేం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పొత్తులు ఉంటాయని కానీ, ఉండవని కానీ ఇప్పుడే ఏమీ చెప్పలేమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. అయితే బీఆర్‌ఎస్‌తో తమకు రాజకీయ సారూప్యత ఉందని, ఎన్నికల్లో కలిసే ఉంటామని అనుకుంటున్నామని అన్నారు. బుధవారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో దాని గురించి మాట్లాడుకుంటామని, తామేమి త్యాగయ్యలం కాదని, ముందు దేశ ప్రయోజనాలు, తరువాత పొత్తుతో ఉండే పార్టీ ప్రయోజనంతోపాటు తమ ప్రయోజనం కూడా నెరవేరాలని అన్నారు. తాము దేశం కోసం త్యాగం చేస్తామే తప్ప ఇంకో పార్టీ కోసం కాదని, తమకు కూడా గౌరవప్రదంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రజాతంత్ర, లౌకిక పార్టీ అయినప్పటికీ ముందుగా వాళ్లు తమ ఇల్లు చక్కదిద్దుకోవాలని సూచించారు. బీజేపీ విషయంలో బీఆర్‌ఎస్, కమ్యూనిస్టుల భావజాలం, ఎజెండా ఒక్కటేనని పేర్కొన్నారు.

యాదాద్రి నుంచి ఖమ్మం సభకు..

- కలెక్టరేట్, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- కేసీఆర్, ముగ్గురు సీఎంలు, ప్రముఖుల పర్యటన షెడ్యూల్ ఖరారు
- 18న మధ్యాహ్నం నుంచి కార్యక్రమాలు..
- ఖమ్మం సభ దేశం దృష్టిని ఆకర్షిస్తుంది: హరీశ్, పువ్వాడ
- సన్నాహక సమావేశాలు నిర్వహించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న హరీశ్‌రావు, పువ్వాడ, నామా, కౌశిక్‌రెడ్డి, రాజేశ్వరరెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మంలో బీఆర్‌ఎస్ సభకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సీఎం కేసీఆర్‌తోపాటు మూడు రాష్ట్రాల సీఎంలు, యూపీ మాజీ సీఎం, ఇతర జాతీయస్థాయి నేతలు హాజరవుతుండటంతో పోలీసులు, అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాయి. మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్ సభా ప్రాంగణం, కలెక్టరేట్ ప్రాంతాలను పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఇక ప్రముఖుల పర్యటనకు సంబంధించి ప్రాథమికంగా షెడ్యూల్ ఖరారైనట్టు బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి. ఢిల్లీ, పంజాబ్, కేరళ సీఎంలు కేజ్రీవాల్, భగవంత్‌మాన్, పినరయి విజయన్, యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్‌యాదవ్ ఈ నెల 17న రాత్రికి హైదరాబాద్ చేరుకోనున్నారు. 18న ఉదయం వారు సీఎం కేసీఆర్‌తో కలిసి రెండు ప్రత్యేక హెలికాప్టర్లలో యాదాద్రికి చేరుకుని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటారు. తర్వాత ఖమ్మంకు చేరుకుంటారు. బీఆర్‌ఎస్ తొలి సభకావడంతో సెంటిమెంట్‌గా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినట్టు తెలిసింది.

అభివృద్ధి పనులు ప్రారంభించి సభకు..

18న మధ్యాహ్నం 12.30 గంటలకు సీఎంలు, ఇతర ప్రముఖులు ఖమ్మం కొత్త కలెక్టరేట్‌కు చేరుకుంటారు. కలెక్టరేట్‌ను ప్రారంభించిన అనంతరం అక్కడే మెడికల్ కాలేజీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. కంటివెలుగు రెండో దశ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. తర్వాత సభా వేదికకు చేరుకుంటారు.

క్యూఆర్ కోడ్‌తో పార్కింగ్‌కు కసరత్తు

సభ ఏర్పాట్లను మంత్రులు పర్యవేక్షిస్తుండగా.. వేదికను తీర్చిదిద్దే బాధ్యతను టీఎస్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్‌ఐఐసీ) చైర్మన్ గ్యాదరి బాలమల్లుకు అప్పగించారు. వేదికపై ముఖ్య నేతలతోపాటు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులకు సీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిసింది. ఇక ఇల్లెందు, డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్ నుంచి వచ్చే వాహనాలకు ఖమ్మంలోని ఇల్లెందు రోడ్డులో.. సూర్యాపేట మీదుగా వచ్చే వాహనాలకు ముదిగొండ, కోదాడ క్రాస్‌రోడ్డు మీదుగా ప్రకాశ్‌నగర్, మమత రోడ్డులో ఏర్పాటు చేసే పార్కింగ్ స్థలాల్లో.. భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, వైరా, మధిర నుంచి వచ్చే వాహనాలకు వైరా రోడ్డులోని అమ్మపాలెం సమీపంలో పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి వచ్చే వాహనాలకు ఒక్కో క్యూఆర్ కోడ్ ఇచ్చేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

నేతలకు వివిధ బాధ్యతలు..

ఖమ్మం సభ విజయవంతానికి సీఎం కేసీఆర్ సూచనల మేరకు 24 మందితో టీమ్ సిద్ధమైంది. అందులో మంత్రులతోపాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు ఉన్నారు. సభకు సంబంధించి మొత్తంగా మంత్రి హరీశ్‌రావు పర్యవేక్షించనుండగా.. ఆయన సారథ్యంలో మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ నామా నాగేశ్వర్‌రావు సభకు ఇన్‌చార్జులుగా ఉంటారు.

దేశం దృష్టిని ఆకర్షిస్తుంది: హరీశ్, పువ్వాడ

ఖమ్మం బీఆర్‌ఎస్ సభ దేశం దృష్టిని ఆకర్షిస్తుందని.. అందుకు తగినట్టు ప్రతిష్టాత్మకంగా సభ నిర్వహణ కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్ పేర్కొన్నారు. బుధవారం సభ స్థలాన్ని, కొత్త కలెక్టరేట్‌ను వారు పరిశీలించారు. కలెక్టర్, పోలీసు అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. సభ ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయన్నారు. టీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్‌గా మారిన తర్వాత మొదటి బహిరంగ సభను ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్నామని.. దీనికి ఢిల్లీ, పంజాబ్, కేరళ సీఎంలు కేజ్రీవాల్, భగవంత్‌మాన్, పినరయి విజయన్, యూపీ మాజీ సీఎం అఖిలేశ్‌యాదవ్, సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు హాజరవుతారని తెలిపారు. సభ మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమై 4.30 వరకు కొనసాగుతుందన్నారు. భారీగా హాజరై సభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

తుమ్మలతో మంత్రుల భేటీ



దమ్మపేట: ఖమ్మం సభ ఏర్పాట్లను పరిశీలించిన తర్వాత మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్, ఇతర నేతలు బుధవారం రాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలోని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసానికి వెళ్లారు. తుమ్మల ఆతిథ్యాన్ని స్వీకరించి, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయ సమీకరణాలపై చర్చించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్‌ఎస్‌లో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్టుగా కొన్ని నెలలుగా వస్తున్న వార్తలు, ఇటీవలి రాజకీయ పరిణామాల నేపథ్యంలో వారు తుమ్మలను కలవడం చర్చనీయాంశంగా మారింది.

నేడు మానుకోటకు సీఎం కేసీఆర్

బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం, నూతన కలెక్టరేట్ ప్రారంభం

- 10వేల మంది అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం
- మహబూబాబాద్ నుంచి నేరుగా భద్రాద్రి కొత్తగూడెం వెళ్లనున్న సీఎం



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ తదితరులు

సాక్షి, మహబూబాబాద్: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గురువారం మహబూబాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. నూతన జిల్లాగా ఏర్పడిన తరువాత నిర్మించిన బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంతోపాటు, సమీకృత కలెక్టర్ కార్యాలయాన్ని సీఎం ప్రారంభించనున్నారు. కేసీఆర్ పర్యటన ఏర్పాట్లను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, గిరిజన, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీఎం పర్యటించే ప్రాంతాల్లో రోడ్లు, ఇతర మరమ్మతుల పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌లతోపాటు మహబూబాబాద్ ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావులతో సమీక్ష నిర్వహించారు. బీఆర్‌ఎస్, కలెక్టర్ కార్యాలయాల ప్రారంభంతోపాటు జిల్లావ్యాప్తంగా ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కో–ఆర్డినేటర్లు, ఇతర ముఖ్య నాయకులు, అధికారులు మొత్తం 10వేల మందితో సీఎం సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సమావేశానికి ఎవరెవరిని ఆహ్వానించాలి, ఏ మండలం నుంచి ఎంత మంది వస్తున్నారనే విషయంపై మంత్రులు, అధికారులు చర్చించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీఎం మహబూబాబాద్‌లో గడపనున్నారు. అనంతరం సీఎం మహబూబాబాద్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెళ్లనున్నారు. పోడు భూములకు పట్టాలిచ్చే విషయంలో జాప్యం చోటుచేసుకోవడం, గిరిజనేతరులకు పట్టాల పంపిణీ విషయంలో ఇప్పటివరకు స్పష్టత లేకపోవడం, నారాయణపురం గ్రామంలోని కొందరు రైతులకు పట్టాలు ఇవ్వని విషయంపై ఆందోళనలు, నిరసనలు జరగనున్న నేపథ్యంలో పోలీసులు వారిపై గట్టి నిఘా పెట్టారు.

క్లాసుల్లేకున్నా పాస్

- ప్రైవేటు డీఎడ్ కాలేజీల దందా
- ఇంటి దగ్గర్నుంచే చదువుకోవచ్చట
- ఫ్యాకల్టీ, నిర్వహణ భారం మిగిలించుకునే యోచన



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులను తయారు చేసేందుకు ఉద్దేశించిన డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డీఈడీ) పరిస్థితి దారుణంగా తయారైంది. నాణ్యత ప్రమాణాలు పూర్తిగా అడుగంటాయి. ప్రభుత్వ కాలేజీల్లో బోధకుల్లేరు. ప్రైవేటు కాలేజీలు అసలు తెరుచుకునే పరిస్థితే కన్పించడం లేదు. క్లాసులకు హాజరవ్వకపోయినా ఫర్వాలేదు.. పరీక్షలు రాస్తే చాలు పాస్ గ్యారెంటీ అంటూ ప్రైవేటు డైట్ కాలేజీలు కొత్త భాష్యం చెబుతున్నాయి. ఇదేదో బాగుందని విద్యార్థులు దానికే సిద్ధమవుతున్నారు. ఉన్నతాధికారులు ఈ పరిస్థితిని నియంత్రించడం లేదనే విమర్శలొస్తున్నాయి. ఫలితంగా డీఈడీ పూర్తి చేసినా... అభ్యర్థులు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో కనీసం సగం మంది కూడా అర్హత సాధించలేకపోతున్నారు.

పడిపోతున్న డీఎడ్

ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తి ఉన్న వారు ఇంటర్ తర్వాత డీఈడీ, డిగ్రీ తర్వాత బీఈడీలో చేరుతారు. డీఈడీలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్‌ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్‌ఈ) విభాగాలుంటాయి. ఇందులో ఉత్తీర్ణులైన వారు ప్రాథమిక పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ)లుగా పనిచేసే అవకాశం ఉంటుంది. అయితే, కీలకమైన డీఎడ్ స్థాయిలోనే బ్రేకులు పడుతున్నాయని నిపుణులు అంటున్నారు.

286మందికి కేవలం 21మందే ఉన్నారు

రాష్ట్రవ్యాప్తంగా 10 డీఎడ్ కాలేజీలుంటే, 286 మంది బోధకులు ఉండాలి. కానీ మన రాష్ట్రంలో ఉన్న బోధకుల సంఖ్య కేవలం 21 మాత్రమే. 265 ఖాళీలున్నా, వాటిని భర్తీ చేయడం లేదు. రిటైర్ అయిన ప్రభుత్వ ప్రిన్సిపాల్స్‌ను మాత్రమే తీసుకోమని ప్రభుత్వం చెబుతోంది. కానీ వాళ్లు ఎక్కడా లభించడం లేదని అధికారులు అంటున్నారు. డీఎడ్‌లో కీలకమైన బోధన విధానం, విద్యార్థుల సైకాలజీ, పాలనాపరమైన ప్రక్రియలు, మాతృభాషలో బోధించే తీరు, విలువలు, కళలు, కంప్యూటర్, ఫిజికల్ ఎడ్యుకేషన్‌పై బోధన కాలేజీల్లో ఏమాత్రం జరగడం లేదని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

క్లాసులు లేకున్నా...

రాష్ట్రంలో 2015లో 212 డైట్ కాలేజీలుంటే... ఇప్పుడివి 59కి పడిపోయాయి. ఇందులో ప్రభుత్వ కాలేజీలు పది. 6,888 సీట్ల నుంచి 4600 సీట్లకు తగ్గిపోయాయి. ప్రభుత్వ కాలేజీల్లో టీచర్ల కొరత ఉంటే, ప్రైవేటు కాలేజీల్లో ఫ్యాకల్టీ నియామకమే జరగడం లేదని తెలుస్తోంది. రికార్డుల్లో అధ్యాపకులు ఉన్నట్టు చూపిస్తున్నా, క్షేత్రస్థాయిలో వాళ్లు కన్పించడం లేదనే ఆరోపణలున్నాయి. ఏటా ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీఎంబర్స్ రూ.12,500 కూడా సకాలంలో రావడం లేదని కాలేజీలు అంటున్నాయి. విద్యార్థులు కాలేజీకి రాకున్నా రూ. 25 వేలు ఇస్తే పరీక్షలకు హాజరవ్వొచ్చని, సర్టిఫికెట్ పొందొచ్చని యాజమాన్యాలు చెబుతున్నా యి.

మంచి టీచర్లు ఎలా వస్తారు : శ్రీరాం ముండయ్య (ప్రభుత్వ డైట్ కాలేజీ లెక్చరర్, కరీంనగర్)

డీఎడ్ కాలేజీల్లో అధ్యాపకుల కొరత కారణంగా ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చే వారికి సరైన ప్రమాణాలు లేకపోతే మంచి విద్య అందించడం సాధ్యం కాదు.

జిల్లాల్లోనూ పరిశ్రమలు నెలకొల్పాలి

పారిశ్రామికవేత్తలకు మంత్రి కేటీఆర్ పిలుపు

- స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలి... తెలంగాణ దేశానికే మార్గదర్శకమని వెల్లడి
- మహిళా పారిశ్రామికవేత్తలకు అవార్డుల ప్రదానం



అవార్డులను అందజేస్తున్న మంత్రి కేటీఆర్

మణికొండ (హైదరాబాద్): హైదరాబాద్‌లోనే కాకుండా జిల్లాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ అనేక రంగాల్లో దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందని, అలాంటి రాష్ట్రానికి కేంద్రం అధికంగా ప్రాజెక్టులు, నిధులివ్వాలన్నారు. రాష్ట్రంలో తలసరి వార్షిక ఆదాయం 2014లో రూ.1.24 లక్షలు ఉండగా ప్రస్తుతం అది రూ. 2.78 లక్షలకు పెరిగిందన్నారు. ఐటీ ఎగుమతుల్లో సైతం 2014లో 57వేల కోట్ల ఎగుమతులు ఉండగా, ప్రస్తుతం రూ.1.83 కోట్లకు పెరిగాయని చెప్పారు. బుధవారం నార్సింగిలో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్‌ఓ) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళా పారిశ్రామిక వేత్తలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్ నగరం ఉత్తరాదికి, దక్షిణాదికి మధ్యలో ఉండటంతోపాటు బిర్యానీ, పరాటాలకు కేంద్ర బిందువుగా ఉందన్నారు. దక్షిణాదిలో బెంగుళూరుతోపాటు హైదరాబాద్ కూడా ఐటీ రంగంలో రాణిస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం నివాస నగరాల్లో ప్రపంచంలోనే ఉత్తమ నగరంగా హైదరాబాద్ నిలుస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో రోడ్లతో పాటు ఫ్లైఓవర్‌లను నిర్మించి ప్రపంచ ప్రామాణిక నగరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. గ్రీన్, బ్లూ, పింక్, ఎల్లో, వైట్ లాంటి ఐదు విప్లవాలతో రాష్ట్రం పురోభివృద్ధిలో ఉందన్నారు. రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తోందని, అందులో మహిళా పారిశ్రామికవేత్తలు, ఎఫ్ఎల్‌ఓ కృషి ఎంతో ఉందని కేటీఆర్ చెప్పారు. పలు రంగాల్లో ప్రతిభ చూపిన 16 మంది మహిళలకు అవార్డులను అందజేశారు.

మహిళాభివృద్ధే భవిష్యత్ అభివృద్ధి

రాబోయే రోజుల్లో మహిళలు ఎంతగా అభివృద్ధి సాధిస్తే ప్రపంచమంతటా అంతగా అభివృద్ధి చెందుతుందని నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ అన్నారు. పారిశ్రామిక, ఆర్థిక విప్లవాలు ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్నాయని, అందులో మన దేశం అగ్రగామిలో ఉందన్నారు. మన దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర ఉందని, వారికి మరింత ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో కేంద్రం 56శాతం వారి పేర్లతోనే జన్‌ధన్ ఖాతాలను తెరిచిందన్నారు. హైదరాబాద్ ఫిక్కీ మహిళలు దేశ మహిళా పారిశ్రామిక వేత్తలకు మార్గదర్శకంగా నిలుస్తున్నారని చెప్పారు. కాగా, ఎఫ్ఎల్‌ఓ జాతీయ అధ్యక్షురాలు జయంతి దాల్మియా, మాజీ అధ్యక్షురాలు పింకీరెడ్డి, ఎఫ్ఎల్‌ఓ హైదరాబాద్ చైర్‌పర్సన్ శుభ్ర పరమేశ్వరి వారు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన వీల్‌చైర్ డ్యాన్స్‌ను ప్రదర్శించారు.

ఫ్లెక్సీల్లో ఫొటోలు కాదు.. ఇంటింటికి వెళ్లాలి!

▶ మొదటి పేజీ తరువాయి

పార్లమెంట్ కన్వీనర్, ప్రభారీ, విస్తారక్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల 29న ప్రధాని మన్‌కీబాత్ కార్యక్రమాన్ని మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలోని సగం పోలింగ్ బూత్‌లలో నిర్వహించాలన్నారు.

31లోగా బూత్ కమిటీల నియామకం..

'ప్రజా గోస– బీజేపీ భరోసా' కార్యక్రమానికి పెద్ద లీడర్లు సరిగా రావడం లేదని, కేటాయించిన నియోజకవర్గాల్లో పూర్తి సమయం ఉండటం లేదని కొందరు తన దృష్టికి తీసుకురావడాన్ని సునీల్ బన్సల్ ప్రస్తావించినట్టు తెలిసింది. "ఎన్నికల్లో విజయం సాధించేందుకు పార్టీ సంస్థాగతంగా బలోపేతం కావడమే లక్ష్యం. ఎవరైనా సీనియర్ నాయకుడు రాకపోతే పార్టీ మండలాధ్యక్షుడే లీడర్. ఆ రోజు మండలంలో జరగాల్సిన కార్యక్రమాన్ని యథాతథంగా పూర్తిచేయాలి. నిర్దేశిత కార్యక్రమం మేరకు అన్ని మండలాల్లో బైక్ ర్యాలీలు పూర్తి చేయాలి. కార్యకర్తలు స్వచ్ఛందంగా బైక్ పెట్రోల్, ఇతర ఖర్చులు పెట్టుకుని కార్యక్రమం చేపట్టేలా చూడాలి. పార్టీ నాయకత్వం నిర్ణయించిన కార్యక్రమానికి ఎవరూ అడ్డుచెప్పే ప్రశ్నే ఉత్పన్నం కాదు.." అని స్పష్టం చేసినట్టు సమాచారం. లోక్‌సభ నియోజకవర్గాల్లోనో, ఏదైనా నిర్ణయించిన కార్యక్రమంలోనో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎవరూ హాజరుకాకపోయినా సరే.. ఈనెల 31లోపు అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ బూత్ కమిటీల నియామకం పూర్తి చేయాలని సూచించినట్టు తెలిసింది. లోక్‌సభ విస్తారక్‌లు, ఇతర నేతల సమావేశంలో నేతలు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, బంగారు శ్రుతి, చింతల రామచంద్రారెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, యెండల లక్ష్మీనారాయణ, కాసం వెంకటేశ్వర్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా కాంగ్రెస్ పీఏసీ

- మూడు గంటల పాటు కొనసాగిన భేటీ
- హాథ్ సే హాథ్ జోడో పై సాగిన చర్చ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం సుదీర్ఘంగా మూడు గంటల పాటు సాగింది. కొత్త ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే నేతృత్వంలో బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో ప్రారంభమైన ఈ సమావేశం 10.30 గంటల వరకు జరిగింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, సీనియర్ నేతలు వి.హనుమంతరావు, జానారెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్ బాబు, వంశీచంద్ రెడ్డి, గీతా రెడ్డి, షబ్బీర్ అలీ, బలరాం నాయక్, సంపత్ కుమార్, చిన్నారెడ్డిలతో పాటు ఇన్‌చార్జి ఏఐసీసీ కార్యదర్శులు పాల్గొన్నారు. టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ అజారుద్దీన్, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డిలు వివిధ కారణాలతో గైర్హాజరయ్యారు.

గడప గడపకూ రాహుల్ సందేశం

సమావేశంలో భాగంగా ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రల గురించే చర్చ జరిగింది. రాజకీయంగా ఈ యాత్రలు పార్టీకి పెద్ద ఎత్తున ఉపకరించనున్న నేపథ్యంలో పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు ఠాక్రే సూచించారు. ఈసారి సమావేశానికి సభ్యుడి హోదాలో ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. కాగా, రాష్ట్ర కాంగ్రెస్ నేతల మధ్య ఉన్న చిన్నా చితకా సమస్యలు ఈ రోజుతో ముగిసినట్టేనని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు.

ఎన్ని గెలుస్తాం.. ఎలా అధికారంలోకి వస్తాం?

▶ మొదటి పేజీ తరువాయి



మాణిక్‌రావ్ ఠాక్రేతో ముచ్చటిస్తున్న ఉత్తమ్



ఠాక్రేతో భేటీ అయ్యేందుకు వచ్చిన మధుయాష్కీ, దామోదర, షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి తదితరులు

నియామకం అయ్యాక తొలిసారి హైదరాబాద్‌కు వచ్చిన మాణిక్‌రావ్ ఠాక్రే బుధవారం గాంధీభవన్ వేదికగా బిజీబిజీగా గడిపారు. దాదాపు 20 మంది నేతలతో విడివిడిగా సమావేశమై అభిప్రాయాలను తెలుసుకున్నారు. నేతలు చెప్పేది వింటూ, మధ్యలో ప్రశ్నలు అడుగుతూ వివరాలన్నింటినీ నోట్ చేసుకున్నారు.

ఏఐసీసీ కార్యదర్శులతో మొదలు

మాణిక్‌రావ్ ఠాక్రే బుధవారం ఉదయం ఢిల్లీ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఇతర నేతలు ఘనంగా స్వాగతం పలికారు. సుమారు పదిన్నర గంటల సమయంలో మాణిక్‌రావ్ ఠాక్రే గాంధీభవన్‌కు చేరుకోగా.. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మాణిక్‌రావ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. వెంటనే భేటీలు మొదలుపెట్టారు. తొలుత ఏఐసీసీ కార్యదర్శులు బోసురాజు, నదీమ్ జావేద్, రోహిత్ చౌదరిలతో సమావేశమయ్యారు. రాష్ట్ర కాంగ్రెస్ పరిస్థితులు, ఏఐసీసీతో సమన్వయం, అధిష్టానం వద్ద ఉన్న పార్టీ సమాచారం, హాథ్‌సే హాథ్ జోడో యాత్ర ప్రణాళిక తదితర అంశాలపై ఇందులో చర్చించినట్టు సమాచారం.

వరుసగా సమావేశాలు

అనంతరం టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్కలతో విడివిడిగా అరగంట పాటు మాణిక్‌రావ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, నేతల మధ్య సమన్వయం, హాథ్‌సే హాథ్ జోడో యాత్ర విజయవంతంపై చర్చించారు. పలు అంశాలపై వారి అభిప్రాయాలు తీసుకున్నారు. ఆనక సాయంత్రం దాకా వరుసగా సీనియర్ నేతలు వీహెచ్, అజారుద్దీన్, గీతారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, షబ్బీర్‌అలీ, మహేశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, మధుయాష్కీగౌడ్, రేణుకాచౌదరి తదితరులతో విడివిడిగా భేటీ అయ్యారు. రాత్రి ఏడు గంటల సమయంలో జరిగిన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో పాల్గొన్నారు. ఈ భేటీ సుదీర్ఘంగా మూడు గంటల పాటు సాగింది.

నేడు కూడా సమావేశాలు

గురువారం రెండోరోజు పలువురు రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో మాణిక్‌రావ్ ఠాక్రే సమావేశం కానున్నారు. టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు, ఇతర ముఖ్య నేతలతో భేటీ అయిన అనంతరం ఆయన ఢిల్లీకి తిరిగి వెళ్లనున్నారు.

మాట్లాడుతూ.. మాట్లాడిస్తూ..

యువజన కాంగ్రెస్‌లో పనిచేసినప్పటి నుంచీ సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌లో చురుకుగా పనిచేసిన మాణిక్‌రావ్ ఠాక్రే.. రాష్ట్రంలో 2023 ఎన్నికలే లక్ష్యంగా నేతల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ పరిస్థితి, అధికారంలోకి వచ్చేందుకు ఉన్న మార్గాలపై ఆయన ఎక్కువ ఫోకస్ చేశారని.. నేతల మధ్య విభేదాలకు కారణాలు, సమన్వయం కోసం తీసుకోవాల్సిన చర్యలపైనా చర్చించారని సమాచారం. ఆయన తాను మాట్లాడుతూనే.. రాష్ట్ర నాయకులతో కూడా మాట్లాడించేలా ప్రశ్నలు వేశారని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇక ఠాక్రేతో సమావేశమైన పలువురు నేతలు.. రాష్ట్రంలో పార్టీ బలంగా ఉందని, సరైనదిశలో తీసుకెళ్లలేకపోవడమే ప్రధాన సమస్య అని వివరించినట్టు సమాచారం. పార్టీని ముందుకు తీసుకెళ్లడం ఏ ఒక్కరితోనో సాధ్యం కాదని.. కలిసికట్టుగా ముందుకెళ్లాల్సి ఉంటుందని, దానికి మీరే మార్గం కనుక్కోవాలని కొందరు నేతలు పేర్కొన్నట్టు తెలిసింది. ఇటీవల నియమించిన కమిటీలు, పార్టీలో సమాచార లోపం తదితర అంశాలపైనా ఠాక్రేకు వివరించినట్టు సమాచారం.

కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఠాక్రే ఫోన్

కొత్త ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడినట్టు సమాచారం. బుధవారం తాను గాంధీభవన్‌కు వస్తున్నా నని, వచ్చి కలవాలని ఠాక్రే కోరగా.. తాను నియోజకవర్గంలో జరిగే సమావేశానికి వెళుతున్నానని, వచ్చిన తర్వాత కలుస్తానని వెంకటరెడ్డి చెప్పినట్టు తెలిసింది. ఠాక్రేతో సమావేశమయ్యేందుకు గాంధీభవన్‌కు రావాలంటూ టీపీసీసీ నుంచి కూడా వెంకటరెడ్డికి సమాచారం వెళ్లినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

సాక్షి బిజినెస్
గురువారం
12-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
	10	18
	60,106	17,896

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	10,861	△ 118
డోజోన్స్	33,805	△ 101
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,725	△ 30
డాక్స్	14,948	△ 173
షాంఘై	3,162	▽ 8
నిక్కాయ్	26,446	△ 270

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (10 గ్రా. 24 క్యారట్స్)	56,115	△ 141
బంగారం (10 గ్రా. 22 క్యారట్స్)	55,890	△ 140
వెండి (కేజీ)	68,363	△ 734

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		80.91	82.58
£	బ్రిటన్ పౌండ్		97.69	101.01
€	యూరో		86.20	89.28
¥	జపాన్ ఎన్ (100)		60.72	62.71
AUS	ఆస్ట్రేలియా డాలర్		55.30	57.65
S$	సింగపూర్ డాలర్		60.40	62.40
SAR	సౌదీ రియాల్		20.76	22.43
UAE D	యూఏఈ దిర్హామ్		21.31	23.11
¥	చైనా యువాన్		10.92	12.95

బిగ్‌'సి' లక్కీడ్రా ఆఫర్‌కు విశేష స్పందన



హైదరాబాద్‌: బిగ్‌'సి' 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రకటించిన లక్కీడ్రా ఆఫర్‌కు విశేష స్పందన లభిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు, సీఎండీ ఎం.బాలు చౌదరి పేర్కొన్నారు. ఈ మేరకు విడుదలైన ఒక ప్రకటన ప్రకారం, ఈ ఆఫర్‌లో మొత్తం 3 లక్కీడ్రాలను తీస్తారు. 11వ తేదీన రెండవ లక్కీడ్రా నిర్వహించి 35 మంది విజేతల పేర్లను సంస్థ డైరెక్టర్‌ బాలాజీ రెడ్డి ప్రకటించారు. ఆఫర్‌ ఈ నెల 29వ వరకూ కొనసాగుతుంది. మూడు లక్కీడ్రాలలో విజేతలుగా ఎంపికైన కస్టమర్లకు 20 మారుతీ ఆల్టో కార్లు, 20 బజాజ్‌ ప్లాటినా బైక్‌లు, 20 రిఫ్రిజిరేటర్లు, 20 ఏసీలు, 20 టీవీలను బహుమతులుగా అందజేయడం జరుగుతుంది. దీనితోపాటు మొబైల్స్‌ కొనుగోలుపై పలు ప్రయోజనాలను కూడా అందిస్తున్నట్లు ప్రకటన వివరించింది.

బీ న్యూలో రెడ్‌మీ నోట్‌ 12 5జీ సిరీస్‌ ఆవిష్కరణ



హైదరాబాద్‌: మల్టీ బ్రాండ్‌ మొబైల్స్‌ రిటైల్‌ చైన్‌ బీ న్యూ మొబైల్స్‌ అండ్‌ ఎలక్ట్రానిక్‌ స్టోర్లలో రెడ్‌మీ నోట్‌ 12 5జీ సిరీస్‌ అందుబాటులోకి వచ్చింది. ఈ మేరకు ఇక్కడ బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రముఖ నటి ఈషా రెబ్బా ఈ ఫోన్‌ను ఆవిష్కరించారు. సంస్థ సీఎండీ వైడీ బాలాజీ చౌదరి, ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ సాయి నితేష్, రెడ్‌మీ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొబైల్‌ కొనుగోళ్లకు సంబంధించి ఈఎంఐ, జీరో ఫైనాన్స్‌ సౌలభ్యం అందుబాటులో ఉన్నట్లు సంస్థ విడుదల చేసిన ప్రకటన తెలిపింది.

రూపే కార్డుల ప్రోత్సాహానికి రూ. 2,600 కోట్ల స్కీము

న్యూఢిల్లీ: రూపే డెబిట్‌ కార్డులు, తక్కువ విలువ చేసే భీమ్‌–యూపీఐ లావాదేవీలను ప్రోత్సహించే దిశగా కేంద్ర క్యాబినెట్‌ బుధవారం రూ. 2,600 కోట్ల స్కీముకు ఆమోదముద్ర వేసింది. దీని కింద ఈ ఆర్థిక సంవత్సరంలో రూపే కార్డులు, యూపీఐని ఉపయోగించి జరిపే పాయింట్‌ ఆఫ్‌ సేల్స్, ఈ–కామర్స్‌ లావాదేవీలను ప్రోత్సహించినందుకు గాను బ్యాంకులకు ప్రోత్సాహకాలు లభిస్తాయి.



కార్ల సందడి.. 'ఎలక్ట్రిక్‌' స్టార్ట్‌!

ప్రారంభమైన ఆటో ఎక్స్‌పో-2023 • కొలువుదీరిన కొత్త వాహనాలు

ఏపీలో కియా... రూ.2,000 కోట్ల పెట్టుబడి

ప్లాంటులో ఎలక్ట్రిక్‌ వాహనాల తయారీ 2025 నాటికి మేడిన్‌ ఇండియా ఈవీ

గ్రేటర్‌ నోయిడా: వాహన దిగ్గజం కియా ఇండియా ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌ ప్లాంటులో వచ్చే నాలుగేళ్లలో రూ.2,000 కోట్ల పెట్టుబడి చేయనుంది. ఎలక్ట్రిక్‌ వాహనాల పరిశోధన, అభివృద్ధి, తయారీ, మౌలిక వసతులకు ఈ మొత్తాన్ని ఖర్చు చేయనున్నట్లు సంస్థ బుధవారం ప్రకటించింది. ప్రస్తుతం కంపెనీ భారత్‌లో సింగిల్‌ బ్యాటరీ ఎలక్ట్రిక్‌ మోడల్‌ను విక్రయిస్తోంది. దేశీయంగా తయారైన ఎలక్ట్రిక్‌ కారును 2025లో ఆవిష్కరించాలన్నది సంస్థ ప్రణాళిక. అంతర్జాతీయంగా 2027 నాటికి 14 ఎలక్ట్రిక్‌ మోడళ్లను ప్రవేశపెట్టనున్నట్లు కియా ఇప్పటికే ప్రకటించింది. ఇందుకు మొత్తం రూ.1.79 లక్షల కోట్లు ఖర్చు చేస్తోంది.

ప్రత్యేకంగా భారత్‌ కోసం..

భారత్‌లో ప్రతిపాదిత పెట్టుబడి ఇప్పటి వరకు అనంతపూర్‌ ప్లాంటులో కంపెనీ చేసిన మూలధనంలో మూడింట ఒక వంతు అని కియా ఇండియా వైస్‌ ప్రెసిడెంట్, సేల్స్, మార్కెటింగ్‌ హెడ్‌ హర్‌దీప్‌ సింగ్‌ బ్రార్‌ తెలిపారు. 'మాస్‌ మార్కెట్‌ లక్ష్యంగా ప్రత్యేకంగా భారత్‌ కోసం ఒక మోడల్‌ తయారు కానుంది. 2025లో ఇది రానుంది. ఈవీలను విడుదల చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌ ప్లాంటు సిద్ధంగా ఉంది' అని వివరించారు.



కియా ఈవీ9 కాన్సెప్ట్‌

అవసరాలకు అనుగుణంగా..

కస్టమర్ల వ్యాపార అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకంగా పర్పస్‌ బిల్ట్‌ వెహికిల్స్‌ (పీబీవీ) తయారీలోకి ప్రవేశిస్తున్నట్లు కియా ప్రకటించింది. కరెన్స్‌ మోడల్‌ ఆధారిత పోలీస్‌ వ్యాన్, అంబులెన్స్‌ను కంపెనీ ప్రదర్శించింది. 'పీబీవీలకు పెద్ద మార్కెట్‌ ఉంది. 2030 నాటికి ఈ విభాగంలో అంతర్జాతీయంగా నాయకత్వ స్థానానికి చేరుకోవాలన్నది లక్ష్యం. పూర్తి ఎలక్ట్రిక్‌ కాన్సెప్ట్‌ మోడల్స్‌ ఈవీ9, కేఏ4 సైతం ప్రదర్శనలో కొలువుదీరాయి.

గ్రేటర్‌ నోయిడా: భారత్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రెండేళ్లకోసారి జరిగే ఆటో ఎక్స్‌పో 2023 బుధవారం ప్రారంభమైంది. 2022లో జరగాల్సిన ఈ కార్యక్రమం కోవిడ్‌-19 కారణంగా వాయిదా పడింది. ఈసారి షోలో ఎలక్ట్రిక్‌ వాహనాలు హైలైట్‌. 5 మోడళ్లు ప్రపంచంలో తొలిసారి ఎక్స్‌పోలో తళుక్కుమంటున్నాయి. వీటిలో మారుతీ 5 డోర్‌ జిమ్నీ, నెక్స్ట్‌ జనరేషన్‌ కియా కార్నివల్, ఎంజీ ఎయిర్‌ ఈవీ, టాటా పంచ్‌ ఈవీ, హ్యుందాయ్‌ అయానిక్‌-5 ఉన్నాయి. జనవరి 18 వరకు ప్రదర్శన ఉంటుంది.

■ **సుజుకీ ఈవీఎక్స్‌ 550 కిలోమీటర్లు**

వాహన తయారీ దిగ్గజం జపాన్‌కు చెందిన సుజుకీ మోటార్‌ కార్పొరేషన్‌ అభివృద్ధి చేసిన కాన్సెప్ట్‌ ఎలక్ట్రిక్‌ మధ్యస్థాయి ఎస్‌యూవీ 'ఈవీఎక్స్‌' తొలిసారిగా అంతర్జాతీయంగా దర్శనమిచ్చింది. 2025లో ఈ కారు మార్కెట్లో అడుగుపెట్టనుంది. 60 కిలోవాట్‌ అవర్‌ బ్యాటరీ ఏర్పాటు ఉంది. ఒకసారి చార్జింగ్‌తో 550 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని కంపెనీ డైరెక్టర్, ప్రెసిడెంట్‌ తోషిహిరో సుజుకీ వెల్లడించారు. మొత్తం 16 వాహనాలను మారుతీ ప్రదర్శిస్తోంది. వీటిలో వేగన్‌–ఆర్‌ ఫ్లెక్స్‌ ఫ్యూయల్‌ ప్రోటోటైప్, బ్రెజ్జా ఎస్‌–సీఎన్‌జీ, గ్రాండ్‌ విటారా ఇంటెలిజెంట్‌ ఎలక్ట్రిక్‌ హైబ్రిడ్‌ వంటివి ఉన్నాయి.

■ **హ్యుందాయ్‌:** అయానిక్‌–5 ఈవీ ప్రపంచంలో తొలిసారిగా ఆవిష్కరించింది. పరిచయ ఆఫర్‌లో ధర తొలి 500 మంది కస్టమర్లకు రూ.44.95 లక్షలు. 72.6 కిలోవాట్‌ అవర్‌ బ్యాటరీతో 217 హెచ్‌పీ ఎలక్ట్రిక్‌ మోటార్‌ పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 631 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. అయానిక్‌-6 ఎలక్ట్రిక్‌ సెడాన్‌ సైతం కొలువుదీరింది. 53, 77 కిలోవాట్‌ అవర్‌ బ్యాటరీ ప్యాక్‌ ఆప్షన్స్‌లో లభిస్తుంది.

■ **ఎంజీ:** హెక్టర్, హెక్టర్‌ ప్లస్‌ ఫేస్‌లిఫ్ట్‌ కొలువుదీరాయి. ఆల్‌ ఎలక్ట్రిక్‌ మిఫా 9 ఎంపీవీ తొలిసారిగా భారత్‌లో తళుక్కుమన్నది. దీనిలో 90 కిలోవాట్‌ అవర్‌ బ్యాటరీ ఉంది. 440 కిలోమీటర్లు పరుగెడుతుంది. ఫుల్లీ ఎలక్ట్రిక్‌ ఎంజీ–4 హ్యాచ్‌బ్యాక్, ఎంజీ 5 ఎలక్ట్రిక్‌ స్టేషన్‌ వేగన్‌ (ఎస్టేట్‌), ఈహెచ్‌ఎస్‌ హైబ్రిడ్‌ సెడాన్‌ సైతం ప్రదర్శనలో ఉంది.

■ **బీవైడీ:** సీల్‌ ఎలక్ట్రిక్‌ సెడాన్‌ను ఆవిష్కరించింది. 2023 చివరి త్రైమాసికంలో రానుంది.


■ **లెక్సస్‌:** ఎల్‌ఎం 300హెచ్‌ ఎంపీవీ (టయోటా వెల్‌ఫైర్‌) భారత్‌లో అడుగుపెట్టింది. హైబ్రిడ్‌ పవర్‌ట్రెయిన్‌తో రూపుదిద్దుకుంది. 150 హెచ్‌పీ, 2.5 లీటర్‌ అట్కిన్సన్‌ సైకిల్‌ పెట్రోల్‌ ఇంజన్‌ ఏర్పాటు ఉంది. కొత్త ఆర్‌ఎక్స్‌ ఎస్‌యూవీ భారత్‌లో ప్రవేశించింది. ఎల్‌ఎఫ్‌-30, ఎల్‌ఎఫ్‌–జడ్‌ ఈవీ కాన్సెప్ట్‌ మోడళ్లు ఉన్నాయి.

■ **టయోటా:** ల్యాండ్‌ క్రూజ్‌ ఎల్‌సీ 300 ఎస్‌యూవీ కొత్త రూపులో చమక్కుమంటోంది. బీజడ్‌4ఎక్స్‌ భారత్‌లో అడుగుపెట్టింది. 71.4 కిలోవాట్‌ అవర్‌ బ్యాటరీ ఏర్పాటు ఉంది. 450 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది.


■ **టాటా:** అందరినీ ఆశ్చర్యంలో పడేస్తూ హ్యారియర్‌ ఈవీ కాన్సెప్ట్‌ను ఆవిష్కరించింది. 2024లో మార్కెట్లోకి రానుంది. డ్యూయల్‌ మోటార్, ఆల్‌ వీల్‌ డ్రైవ్‌ ఉంది. 2025లో రంగ ప్రవేశం చేయనున్న సియర్రా ఈవీ కాన్సెప్ట్‌ సైతం మెరిసింది.



మారుతీ ఈవీఎక్స్‌ కాన్సెప్ట్‌



హ్యుందాయ్‌ అయానిక్‌ 5 ఈవీతో షారూక్‌



టాటా మోటార్స్‌ సియర్రా ఈవీ



టయోటా హైలక్స్‌ ఆఫ్‌రోడ్‌

ఆటుపోట్ల మధ్య ఫ్లాట్‌గా

10 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్‌



ముంబై: రోజంతా ఆటుపోట్ల మధ్య సాగిన ట్రేడింగ్‌లో దేశీ స్టాక్‌ మార్కెట్లు చివరికి అక్కడక్కడే అన్నట్లుగా ముగిశాయి. సెన్సెక్స్‌ 10 పాయింట్లు తగ్గి 60,106 దిగువన ముగిసింది. నిఫ్టీ 18 పాయింట్ల నష్టంతో 17,896 వద్ద నిలిచింది. కొద్ది రోజులుగా విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతుండటం మార్కెట్లను బలహీనపరుస్తున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. ఇంట్రాడేలో సెన్సెక్స్‌ 60,365–59,806 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. వెరసి 559 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులు చవిచూసింది. నిఫ్టీ సైతం 17,976– 17,824 పాయింట్ల గరిష్ట, కనిష్టాలను తాకింది. కాగా.. వరుసగా మూడో రోజు దేశీ కరెన్సీ బలపడింది. డాలరుతో మారకంలో రూపాయి 13 పైసలు పుంజుకుని నెల రోజుల గరిష్టం 81.61 వద్ద ముగిసింది. తొలుత 81.52 స్థాయి వరకూ ఎగసింది.

టాటా ఏస్‌ ఈవీ డెలివరీలు

న్యూఢిల్లీ: టాటా మోటార్స్‌ 'ఏస్‌ ఈవీ' డెలివరీలను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇది ఎంతో ఆత్యాధునిక టెక్నాలజీతో, సున్నా కాలుష్యాన్ని విడుదల చేసే చిన్న పాటి వాణిజ్య వాహనం (4 చక్రాలు) అని కంపెనీ తెలిపింది. అమెజాన్, డెల్హివరీ, డీహెచ్‌ఎల్, ఫెడెక్స్, ఫ్లిప్‌కార్ట్, జాన్సన్‌ అండ్‌ జాన్సన్‌ కన్సూమర్‌ హెల్త్, మోతీవింగ్, సేఫ్‌ ఎక్స్‌ప్రెస్, ట్రెంట్‌ సంస్థలకు తొలుత టాటా ఏస్‌ (ఏసీఈ) ఈవీలను అందించినట్లు ప్రకటించింది. ఒక్కసారి చార్జింగ్‌తో 154 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని కంపెనీ తెలిపింది.

దిగువబాటన భారత్‌ వృద్ధి రేటు

ప్రపంచ బ్యాంక్‌



న్యూఢిల్లీ: భారత్‌ 2023–24 ఆర్థిక సంవత్సరం వృద్ధి అంచనాలను ప్రపంచ బ్యాంక్‌ కుదించింది. 6.9 శాతంగా ఉన్న క్రితం అంచనాలను 6.6 శాతానికి కుదిస్తున్నట్లు తన తాజా ఎకనమిక్‌ అప్‌డేట్‌లో తెలిపింది. భారత్‌ 2021–22లో 8.7 శాతం వృద్ధి రేటును నమోదు చేసుకోగా, ప్రస్తుత 2022–23లో ఈ రేటు 6.9 శాతంగా ఉంటుందని ఇప్పటికే ప్రపంచ బ్యాంక్‌ పేర్కొంది. కాగా, 2024–25 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటును ప్రపంచ బ్యాంక్‌ 6.1 శాతంగా అంచనావేసింది. అంటే వృద్ధి రేటు క్రమంగా దిగువకే పయనిస్తుందన్నది ప్రపంచ బ్యాంక్‌ అంచనా. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనిశ్చితి, ఎగుమతులు, పెట్టుబడుల వేగం తగ్గడం తన అంచనాలకు కారణమని ప్రపంచ బ్యాంక్‌ పేర్కొంటోంది. అయితే ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఎకానమీల్లో భారత్‌ తొలి స్థానంలో ఉంటుందని ప్రపంచ బ్యాంక్‌ పేర్కొంది.

భవిత

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగార్థులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న గ్రూప్‌-2 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది! దీని ద్వారా మొత్తం 783 పోస్ట్‌లను భర్తీ చేయనుంది! గ్రూప్‌-2.. రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఎంతో క్రేజ్‌ ఉన్న సర్వీసులు. గ్రూప్‌-1తో పోల్చితే ఈ పోస్టులకు పోటీ పడే వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. కాబట్టి గ్రూప్‌-2 అభ్యర్థులు ఇక ప్రిపరేషన్‌పై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో.. గ్రూప్‌-2 నోటిఫికేషన్‌ వివరాలు, ఎంపిక విధానం, పరీక్ష ప్యాట్రన్, సిలబస్‌ విశ్లేషణ, ప్రిపరేషన్‌ గైడెన్స్‌...

గ్రూప్‌-2.. గురి పెట్టండిలా!

» 783 పోస్ట్‌లతో గ్రూప్‌–2 నోటిఫికేషన్‌ విడుదల
» ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 16 వరకు దరఖాస్తు ప్రక్రియ
» సరైన వ్యూహంతో అడుగులు వేస్తే సక్సెస్‌ సాధించే అవకాశం



టీఎస్‌పీఎస్సీ జాబ్స్‌

పోస్టుల సంఖ్య పెంచడంతోపాటు గ్రూప్‌–2 అభ్యర్థులకు ప్రిపరేషన్‌కు తగినంత సమయం ఇస్తామని టీఎస్‌పీఎస్సీ వర్గాలు పేర్కొనడం సానుకూల అంశంగా చెప్పొచ్చు. టీఎస్‌పీఎస్‌సీ 783 పోస్టులతో ప్రకటించిన గ్రూప్‌–2కు అయిదు లక్షల మందికిపైగా పోటీ పడే అవకాశం ఉంది. కాబట్టి తీవ్ర పోటీలో కొలువు సాధించాలంటే.. అత్యంత అప్రమత్తతో ప్రిపరేషన్‌ సాగించాలని నిపుణులు సూచిస్తున్నారు. పటిష్ట ప్రణాళికతో, ప్రామాణిక పుస్తకాలతో ప్రిపరేషన్‌ను కొనసాగిస్తే.. విజయం సాధించొచ్చని పేర్కొంటున్నారు.

మొత్తం 783 పోస్టులు

టీఎస్‌పీఎస్‌సీ తాజాగా విడుదల చేసిన గ్రూప్‌ 2 నోటిఫికేషన్‌ ప్రకారం–మొత్తం 783 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిల్లో ఏఎస్‌ఓ పోస్టుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ హోదాలో 214 పోస్టులున్నాయి. గ్రూప్‌–2 అనగానే అభ్యర్థులు తొలి ప్రాధాన్యంగా భావించే డిప్యూటీ తహశీల్దార్‌ పోస్టుల సంఖ్య 98గానే ఉండడంతో నిరుద్యోగులు కొంత నిరాశకు గురవుతున్నారు.

అర్హతలు

- మొత్తం 18 రకాల పోస్టులకు సంబంధించి దాదాపు అన్ని పోస్టులకు బ్యాచిలర్‌ డిగ్రీని విద్యార్హతగా పేర్కొన్నారు. అయితే కొన్ని పోస్టుల విషయంలో మాత్రం ప్రత్యేక అర్హత ప్రమాణాలు నిర్దేశించారు. ఆయా పోస్టులను అనుసరించి బ్యాచిలర్‌ డిగ్రీ/ఎల్‌ఎల్‌బీ/బీఏ సోషల్‌ వర్క్‌/బీకాం /బీఎస్సీ/సైకాలజీ ఉత్తీర్ణత ఉండాలి.
- వయసు: జూలై 1, 2022 నాటికి 18–44 ఏళ్లు ఉండాలి. రిజర్వ్‌డ్‌ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది. ఎక్సైజ్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ పోస్టులకు మాత్రం 21–30 ఏళ్ల మధ్యలో ఉన్న వారే అర్హులు.

రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగానే

గ్రూప్‌–2 పోస్టులకు సంబంధించి రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగానే తుది నియామకాలు ఖరారు చేస్తారు. ఈ రాత పరీక్షను ఆన్‌లైన్‌ లేదా ఆఫ్‌లైన్‌ విధానంలో నిర్వహిస్తామని ప్రకటించారు.

నాలుగు పేపర్లు.. 600 మార్కులు

గ్రూప్‌–2 సర్వీసులకు నిర్వహించే రాత పరీక్ష నాలుగు పేపర్లుగా 600 మార్కులకు ఉంటుంది. ఒక్కో పేపర్‌కు 150 మార్కుల చొప్పున కేటాయించారు. పేపర్‌ 1లో జనరల్‌ స్టడీస్‌ అండ్‌ జనరల్‌ ఎబిలిటీస్‌ అంశాలు ఉంటాయి. పేపర్‌ 2లో హిస్టరీ, పాలిటీ అండ్‌ సొసైటీ; పేపర్‌ 3లో ఎకానమీ అండ్‌ డవలప్‌మెంట్; పేపర్‌ 4లో తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం అంశాలు ఉంటాయి.

విజయానికి ప్రిపరేషన్‌ ఇలా

పేపర్‌-1: జనరల్‌ స్టడీస్‌ అండ్‌ జనరల్‌ ఎబిలిటీస్‌

- అభ్యర్థులకు అత్యంత కీలకమైన ఎంతో విస్తృతంగా చదవాల్సిన సబ్జెక్ట్‌ ఇది. స్థానికం నుంచి అంతర్జాతీయం వరకు అన్నింటిపై అవగాహన పెంచుకోవాలి. జనరల్‌ స్టడీస్‌ పరిధిలోకి వచ్చే హిస్టరీ,జాగ్రఫీ,ఎకానమీ,సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ, పాలిటీల్లోని అన్ని అంశాలపై పట్టు సాధించాలి. తెలంగాణ ప్రాంతంలోని అంశాలకు ప్రాధాన్యతనిస్తూ జనరల్‌ స్టడీస్‌ ప్రిపరేషన్‌ సాగించాలి.
- చరిత్ర చదివేటప్పుడు భారతదేశ చరిత్రతో పాటు, తెలంగాణ చరిత్రలోని ముఖ్యాంశాలుగా పేర్కొనే శాతవాహనులు, కాకతీయులు తదితర రాజవంశాల కాలం నాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక, మత పరిస్థితులను క్షుణ్నంగా అవగాహన చేసుకోవాలి.
- పాలిటీకి సంబంధించి రాజ్యాంగం, సవరణలు, రాజ్యాంగ సంస్థలు–వాటి విధుల గురించి తెలుసుకోవాలి. ఈ విభాగం నుంచి తెలంగాణ ప్రత్యేకంగా ఉండే అంశాలు తక్కువే. అయితే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ముఖ్యమైన సంస్థల ఏర్పాటు, ఉమ్మడి రాష్ట్రంలో ఉమ్మడి సంస్థలుగా ఉన్న వాటి విభజన–అందుకు పరిపాలన పరంగా ఉన్న అధికారాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.
- తెలంగాణ ప్రాంతం గురించి మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతంలోని భౌగోళిక పరిస్థితులు, పంటలు, రవాణా సౌకర్యాలు, రాష్ట్రం మీదుగా వెళ్లే జాతీయ రహదారులు, నీటి పారుదల వ్యవస్థ అంశాలు బాగా చదవాలి.
- ఎకానమీ కోసం తెలంగాణపై ప్రత్యేక దృష్టితో ప్రిపరేషన్‌ సాగించడం మేలు చేస్తుంది. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో ఆర్థిక వృద్ధికి చేయూతనిచ్చే రంగాలపై అవగాహన అవసరం. పంటలు–దిగుబడి, తాజా ఆర్థిక సర్వేలో ఈ ప్రాంతం గురించి పేర్కొన్న ముఖ్య అంశాలన్నింటిపైనా దృష్టి సారించాలి.
- జనరల్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీలో స్కోర్‌ కోసం బేసిక్స్‌ నుంచి కరెంట్‌ అఫైర్స్‌ వరకు ఔపోసన పట్టాలి. పుస్తకాల్లో బేసిక్‌గా భావించే విటమిన్లు–వ్యాధులు వంటి అంశాల నుంచి తాజా అంతరిక్ష పరిశోధనల వరకు అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలి.
- జనరల్‌ స్టడీస్‌లో పట్టు కోసం అభ్యర్థులు ముందుగా హైస్కూల్‌ స్థాయి పుస్తకాలను చదివి బేసిక్స్‌పై స్పష్టత తెచ్చుకోవాలి. ఆ తర్వాత బ్యాచిలర్‌ డిగ్రీ స్థాయిలోని పుస్తకాలను చదవడంతో పాటు, వాటిలో తెలంగాణ ప్రాంతానికి చెందిన విశేషాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. వీటితోపాటు కరెంట్‌ అఫైర్స్‌కోసం తెలంగాణ మ్యాగజీన్‌ చదవడం ఎంతో ఉపకరిస్తుంది.

పేపర్‌-2: హిస్టరీ, పాలిటీ అండ్‌ గవర్నెన్స్‌

- హిస్టరీకి సంబంధించి ప్రాచీన, ఆధునిక భారతదేశ చరిత్ర, అదే విధంగా తెలంగాణ చరిత్ర అంశాలపై అవగాహన పెంచుకోవాలి. భారత చరిత్రకు సంబంధించి సింధు నాగరికత, వేదకాలం –నాగరికత, జైన, బౌద్ధ తదితర మత ఉద్యమాల ప్రారంభం; మగధ సామ్రాజ్యం; ఇస్లాం మతం–ప్రభావం, భక్తి ఉద్యమాలు–స్వభావం, లలిత కళలు, విజయనగర సామ్రాజ్యం, మొగల్‌ సామ్రాజ్యం, శివాజీ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. ఆధునిక భారతదేశ చరిత్రకు సంబంధించి బ్రిటిష్‌ పాలనకు దారితీసిన ప్లాసీ యుద్ధంతో మొదలు పెట్టి.. బ్రిటిష్‌ కాలంలోని ముఖ్య ఘట్టాలు, వారు విధించిన నిబంధనలు, బ్రిటిషర్లకు–ఇతర రాజ వంశాలకు మధ్య జరిగిన యుద్ధాలపై దృష్టి పెట్టాలి.
- తెలంగాణ చరిత్రకు సంబంధించి ప్రాచీన చరిత్ర విభాగంలో శాతవాహనులు, ఆనాటి సాంఘిక, మత పరిస్థితులు; సంస్కృతి, సాహిత్యం; ఆంధ్రప్రదేశ్‌లో బౌద్ధ మతం, ఇక్ష్వాకులు, తూర్పు చాళుక్యులు–నాటి సామాజిక పరిస్థితులపై అవగాహన ఏర్పరచుకోవాలి. మధ్యయుగ తెలంగాణకు సంబంధించి కాకతీయ రాజులు, వెలమ రాజులు, తెలుగు భాషకు కుతుబ్‌షాహీల సేవలపై దృష్టి పెట్టాలి.
- ప్రాచీన, మధ్యయుగ చరిత్రలు చదివేటప్పుడు ఆయా రాజులు–రాజ వంశాల తోపాటు వారి హయాంలో చేపట్టిన ప్రఖ్యాత కట్టడాలు, వారి కాలంలో ఆదరణ పొందిన కళలు, కవులు, కళాకారులు వంటివి కూడా తెలుసుకోవాలి.
- ఆధునిక తెలంగాణ చరిత్రకు సంబంధించి అసఫ్‌ జాహీలు, సాయుధ పోరాటం, కమ్యూనిస్టులు, జమీందారి వ్యతిరేక ఉద్యమాలు; రజాకార్లు–తెలంగాణ ఉద్యమం వంటివి కీలకమైనవి. వీటితోపాటు 1857 నాటి సిపాయిల తిరుగుబాటులో తెలంగాణ ప్రాంత ప్రజల భాగస్వామ్యం–నిజాం వ్యతిరేక విధానాలపై పోరాటాల గురించి తెలుసుకోవాలి.
- **పాలిటీ అండ్‌ గవర్నెన్స్‌:** పేపర్‌–2లోనే మరో విభాగంగా ఉండే పాలిటీ అండ్‌ గవర్నెన్స్‌ విషయంలో భారత రాజ్యాంగంలోని ముఖ్య లక్షణాలు; ప్రవేశిక; ప్రాథమిక విధులు;ప్రాథమిక హక్కులు; ఆదేశిక సూత్రాలు; భారత సమాఖ్య; విశిష్ట లక్షణాలు; కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల విభజన; శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ పాత్రలపై నిర్దేశిత సిలబస్‌ ప్రకారం లోతుగా అధ్యయనం చేయాలి. పంచాయతీరాజ్‌ వ్యవస్థ; 73,74 రాజ్యాంగ సవరణలు; వాటి ప్రాముఖ్యత; తేదీలు వంటి అంశాలపై దృష్టి సారించాలి. ఇందుకోసం డిగ్రీ మూడో సంవత్సరం పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌ పుస్తకాలు చదవాలి. కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన, కార్యనిర్వాహక విధుల విభజన, కేంద్ర–రాష్ట్ర సంబంధాలు, వాటి గురించి రాజ్యాంగంలో పేర్కొన్న అధికరణలను అధ్యయనం చేయాలి. వీటితోపాటు తాజా రాజ్యాంగ సవరణలు, వాటి ఉద్దేశంపైనా అవగాహన పెంచుకోవాలి.

పేపర్‌-3: ఎకానమీ అండ్‌ డెవలప్‌మెంట్‌

- ఈ పేపర్‌కు సంబంధించి పంచవర్ష ప్రణాళికలు మొదలు తాజా ఆర్థిక పరిణామాలపై అవగాహన అవసరం. దీంతోపాటు ఆర్థిక సంఘం సిఫార్సులు, ప్రణాళిక సంఘం స్థానంలో ఏర్పాటైన నీతిఆయోగ్‌ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. పారిశ్రామిక విధానాలు, విదేశీ వాణిజ్య విధానం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల గురించి అధ్యయనం చేయాలి. సహజ వనరుల లభ్యత, ఆర్థికాభివృద్ధి దిశగా అవి దోహదపడుతున్న తీరుపై అధ్యయనం చేయాలి. కోర్‌ ఎకానమీకి సంబంధించి ద్రవ్యం, బ్యాంకింగ్, పబ్లిక్‌ ఫైనాన్స్‌ల నిర్వచనాలు–సిద్ధాంతాలు తెలుసుకోవాలి. అదే విధంగా జాతీయాదాయ భావనలు, జీడీపీ, తలసరి ఆదాయం వంటి బేసిక్‌ కాన్సెప్ట్‌లపై అవగాహన అవసరం. వీటితోపాటు ఆర్థిక రంగంలో తాజా పరిణామాల గురించి కూడా అధ్యయనం చేయాలి. ఇండియన్‌ ఎకానమీ పరంగా అభ్యర్థులు మరింత పట్టు సాధించేందుకు ఆర్థిక సంఘం సిఫార్సులు, తాజా బడ్జెట్‌ గణాంకాలు, సహజ వనరుల లభ్యత, వాటి వల్ల లభిస్తున్న ఆదాయం–జీడీపీలో వాటి వాటా వంటిపై పట్టు సాధించాలి.
- **తెలంగాణ ఎకానమీ:** పేపర్‌–3లోనే ఉండే తెలంగాణ ఎకానమీలో తెలంగాణ ప్రాంతంలోని ముఖ్యమైన వనరులు, అవి లభించే ప్రాంతాలు, పంటలు–దిగుబడి కారకాలు గురించి తెలుసుకోవాలి. వీటితోపాటు తాజా సమకాలీన అంశాలతో సమ్మిళితమైన అంశాలపైనా అధ్యయనం ముఖ్యం. అదే విధంగా తెలంగాణ ఆర్థిక విధానం, ఆయా రంగాల్లో అభివృద్ధి, జీఎస్‌డీపీ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. ఎకానమీలో పట్టు సాధించడం కోసం అభ్యర్థులు మానవాభివృద్ధి సూచీలలోని వివిధ ఇండికేటర్స్‌ను పరిశీలించాలి. రాష్ట్ర ఆర్థిక సర్వే గణాంకాలు, కేంద్ర ఆర్థిక సర్వేలో రాష్ట్రాల వారీగా పేర్కొన్న గణాంకాలు సేకరించి ఔపోసన పట్టాలి.

పేపర్‌-4: తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం

ఈ పేపర్‌ కోసం అభ్యర్థులు మరింత ప్రత్యేక దృష్టి సారించాలి. గ్రూప్‌–2లో నాలుగో పేపర్‌గా పేర్కొన్న.. తెలంగాణ ఆలోచన(1948–1970), ఉద్యమ దశ (1971–1990), తెలంగాణ ఏర్పాటు దశ, ఆవిర్భావం(1991–2014)) అంశాలకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. ముఖ్యంగా సిలబస్‌లో నిర్దేశించిన ప్రకారం– 1948 నుంచి 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వరకు జరిగిన ముఖ్య ఉద్యమాలు, ఒప్పందాలు, ముల్కీ నిబంధనలు,తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీలు–వాటి సిఫార్సులు వంటి వాటిపై అవగాహన ఏర్పరచుకోవాలి.దీంతోపాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా రూపొందించిన పునర్‌ వ్యవస్థీకరణ బిల్లులో తెలంగాణకు సంబంధించి ప్రత్యేకంగా పొందుపరచిన అంశాలు; తెలంగాణ రాష్ట్రానికి కల్పించిన హక్కులపై దృష్టి సారించాలి.

ఒకట్రెండు పుస్తకాలు

అభ్యర్థులు ముందుగా సిలబస్‌ అంశాలపై పూర్తి స్పష్టత తెచ్చుకోవాలి.ఆ తర్వాత సిలబస్‌కు అనుగుణంగా ప్రామాణిక పుస్తకాలను ఎంచుకోవాలి. తెలంగాణ ఉద్యమానికి సంబంధించి అన్ని ముఖ్యమైన ఘట్టాలు ఉన్న ఒకట్రెండు పుస్తకాలను ఎంచుకోవడం మేలు చేస్తుంది. అకాడమీ పుస్తకాలను చదవడం ఉపయుక్తంగా ఉంటుంది.

సమగ్ర అధ్యయనం

- గ్రూప్‌–2 పరీక్షలు ఆబ్జెక్టివ్‌ విధానంలో,బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటాయి.కాని అభ్యర్థులు ప్రిపరేషన్‌ సమయంలో డిస్క్రిప్టివ్‌ విధానంలో చదువుతూ ఆయా అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని నిపుణుల సూచిస్తున్నారు.
- ఒక టాపిక్‌కు సంబంధించి నిర్వచనం మొదలు తాజా పరిణామాలకు వరకూ..సమగ్రంగా అధ్యయనం చేయాలి. అదేవిధంగా అన్వయ దృక్పథాన్ని పెంచుకోవాలి.

అనుసంధానం.. సొంత నోట్స్‌

- ప్రిపరేషన్‌లో భాగంగా పలు పేపర్లలో ఉమ్మడిగా ఉన్న అంశాలను అనుసంధానం చేసుకుంటూ చదవడం అనుకూలిస్తుంది. జనరల్‌ స్టడీస్, కరెంట్‌ అఫైర్స్, ఇంటర్నేషనల్‌ రిలేషన్స్‌; భారత రాజ్యాంగం, పరిపాలన, ఎకానమీ అండ్‌ డెవలప్‌మెంట్‌.. ఇలా అన్ని అంశాలను అనుసంధానం చేసుకుంటూ చదివే వీలుంది.
- దీంతోపాటు ప్రిపరేషన్‌ సమయంలోనే ముఖ్యమైన అంశాలను పాయింట్ల వారీగా సొంత నోట్సు రాసుకోవాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్‌ దరఖాస్తు తేదీలు: జనవరి 18 నుంచి ఫిబ్రవరి 16 వరకు
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌: https.tspsc.gov.in

18న ఖమ్మంలో 'కంటి వెలుగు'కు శ్రీకారం

ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని ఈ నెల 18న ప్రారంభించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. ఆ రోజు ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ఖమ్మంలో ప్రారంభించనున్నట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో వైద్య యంత్రాంగమంతా ఖమ్మం తరలిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా 1,500 కేంద్రాల్లో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 18 ఏళ్లు నిండిన వారందరికీ పరీక్షలు చేస్తారు. అవసరమైన వారికి కంటి అద్దాలు ఇస్తారు. మొత్తం 55 లక్షల కళ్లద్దాలు ఇస్తారు. ప్రతీ రోజు గ్రామీణ ప్రాంతాల్లోని కేంద్రాల్లో ఒక్కోచోట 300 మందికి, పట్టణ ప్రాంతాల్లో 400 మందిని పరీక్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్యాంపులు నిర్వహిస్తారు. ఎట్టి పరిస్థితుల్లో సాయంత్రం 4 గంటల వరకు శిబిరాన్ని తెరిచి ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

ఆన్‌లైన్‌లోకి 'విజయ'

- బిగ్ బాస్కెట్, జియోమార్ట్, స్విగ్గి, బ్లింకిట్, జెప్టోలతో అవగాహన
- నూనెలు, బియ్యంతో పాటు మొత్తం 30 రకాల సరుకులసరఫరా త్వరలో ఆన్‌లైన్‌లో పంపిణీ

సాక్షి, హైదరాబాద్: విజయ బ్రాండ్ వంట నూనెలు, సరుకులకు మార్కెట్లో డిమాండ్ ఉండటంతో వాటిని ఆన్‌లైన్‌లో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయిల్‌ఫెడ్ నిర్ణయించింది. అందుకు సంబంధించి ప్రముఖ ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థలైన బిగ్ బాస్కెట్, జియో మార్ట్, స్విగ్గి, బ్లింకిట్, జెప్టోతో త్వరలోనే ఒప్పందం చేసుకోనుంది. ఈ మేరకు ఆయా సంస్థలతో ఆయిల్‌ఫెడ్ అధికారులు చర్చలు జరుపుతున్నారు. ఈ నెలాఖరు వరకు విజయ బ్రాండ్ సరుకులను ఆన్‌లైన్ మార్కెట్‌లోకి అందుబాటులోకి తేనున్నట్లు ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్ తెలిపారు. ఇప్పటికే ఆయిల్‌ఫెడ్ విజయ బ్రాండ్ పేరుతో సన్‌ఫ్లవర్, వేరుశనగ, రైస్‌బ్రాన్, పామాయిల్, దీపం, గానుగ కొబ్బరి నూనెలతో పాటు హెచ్ఎంటీ, సోనామసూరి సన్న బియ్యం, బాస్మతీ బియ్యం, పప్పులు, పల్లీలు, మసాలా దినుసులు ఇలా 30 రకాల వరకు సరుకులను బహిరంగ మార్కెట్లో వినియోగదారులకు అందిస్తున్నది. గతంలో కేవలం నూనెలు మాత్రమే అందించగా ఇటీవలే వంట సరుకులను కూడా ప్రవేశపెట్టింది. దీంతో కొంతకాలంగా విజయ సరుకులకు వినియోగదారుల నుంచి భారీ డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో సరుకులను వినియోగదారులకు మరింత సులువుగా అందించేలా ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉండాలని నిర్ణయించామని, అందుకే పలు మార్కెటింగ్ సంస్థలతో ఒప్పందం చేసుకోనున్నట్లు సురేందర్ తెలిపారు. ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా తమ డీలర్లకు ఎలాంటి నష్టం ఉండబోదని, వారి ద్వారానే మార్కెటింగ్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో ఆన్‌లైన్ మార్కెటింగ్ హవా కొనసాగుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో మార్కెట్ పోటీ తట్టుకొని, వ్యాపారాన్ని నిలబెట్టుకునేందుకుగాను ఆన్‌లైన్ మార్కెటింగ్‌లోకి ప్రవేశించక తప్పని పరిస్థితి ఆయిల్‌ఫెడ్‌కు ఏర్పడింది. ఒక సోషల్ మీడియా సంస్థ ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలని నిర్ణయించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.